






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు

# పని విద్య

3 నుండి 5 తరగతులు





రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# పని విద్య - ఉపాధ్యాయ కరదీపిక

## ప్రాథమికస్థాయి

## 3, 4, 5 తరగతులు

రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు

## రూపొందించిన వారు

### పనివిద్య

**శ్రీమతి ఈ. ఉషాబాల,** ఉపన్యాసకులు, డైట్, వికారాబాద్, రంగారెడ్డి

**శ్రీ జి. ప్రభాకర్,** విశ్రాంత సీనియర్ ఉపన్యాసకులు, డైట్, కర్నూలు

**శ్రీ వి. శ్రీనివాసులు,** స్కూల్ అసిస్టెంట్, ఎం.పి.యు.పి.ఎస్, తాటిపాడు, కర్నూలు

**శ్రీ యం. రమేశ్,** స్కూల్ అసిస్టెంట్, జడ్.పి.హెచ్.ఎస్, చెరుకుచెర్ల, కర్నూలు.

**డా॥ శ్రీమతి ఆకుల వనజ,** స్కూల్ అసిస్టెంట్, జడ్.పి.హెచ్.ఎస్, చందుపట్ల, నల్లగొండ

**శ్రీమతి కె. ఉమారాణి,** స్కూల్ అసిస్టెంట్, జి.హెచ్.ఎస్, అమీర్‌పేట నెం.1, హైదరాబాదు.

**శ్రీమతి వసుంధర,** స్కూల్ అసిస్టెంట్, జడ్.పి.హెచ్.ఎస్, తిరుచానూరు, చిత్తూరు

**శ్రీ సదానందం,** రిటైర్డ్ క్రాఫ్ట్ టీచర్, గవర్నమెంట్ సి.టి.ఇ. మహబూబ్‌నగర్

## ముఖచిత్రం - డిజైనింగ్

**కె.సుధాకరాచారి,** SGT, UPS నీలికుర్తి,
మరిపెడ, వరంగల్

## ఎడిటింగ్ మరియు సమన్వయం

**డా॥ పి. జానిరెడ్డి**
ఆంగ్ల పాఠ్యపుస్తకాల కోఆర్డినేటర్
రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ
హైదరాబాదు.

**డా॥ ఎన్. ఉపేందర్‌రెడ్డి**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక పాఠ్యపుస్తక విభాగం
రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ
హైదరాబాదు.

## ముఖ్యసలహాదారులు

**శ్రీ W.G. ప్రసన్న కుమార్**
సంచాలకులు
నేషనల్ గ్రీన్ కోర్
హైదరాబాదు.

**శ్రీ జి. గోపాల్‌రెడ్డి**
సంచాలకులు
రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ
హైదరాబాదు.

# ముందుమాట

పాఠశాల స్థాయిలో మరియు కాలేజి స్థాయిలో చాలా మంది విద్యార్థులలో ఆశించిన విద్యా ప్రమాణాలు ఉండడం లేదు. ఉదాహరణకు 10 సంవత్సరాలు ఇంగ్లీషు నేర్చుకున్న ఒక వ్యక్తి తప్పులు లేకుండా తన అభిప్రాయాలను వ్యక్తీకరించడంగాని, ఒక ఉత్తరంగాని రాయలేని పరిస్థితులలో ఉన్నాడు. బి.ఎస్సీ భౌతిక శాస్త్రం చదువుకున్న వ్యక్తి ఇస్త్రీ పెట్టెను బాగుచేయలేని స్థితిలో, ఫ్యూజ్ ఎందుకు పోతుంది, దానికి నివారణ మార్గాలేమిటో తెలియని స్థితిలో ఉన్నాడు. పట్టణ ప్రాంతాలలోని మధ్య మరియు ఉన్నత స్థాయి వర్గాలకు చెందిన పిల్లలు వంట చేయడం, ఇల్లు ఊడవడం, తుడవడం, తోట పనులు మొదలగు గృహ సంబంధమైన చిన్న చిన్న పనులు కూడా చేయడం లేదు. చేయడానికి ఇష్టపడడం లేదు. అవి వారి స్థాయికి తగినదిగా వారు భావించడం లేదు. పై వర్గాలకు చెందిన స్త్రీలు తమ జీవిత కాలమంతా అవే పనులు చేస్తున్నా వారి గుర్తింపునుగాని, స్థాయినిగాని కోల్పోవడం లేదు అన్న విషయాన్ని పాఠశాల స్థాయిలో కూడా ఎవ్వరూ ఉటంకించడం లేదు. మరొక మాటలో చెప్పాలంటే ఏవిధమైన ఆచరణాత్మక సామర్థ్యాలు, నైపుణ్యాలు లేని కేవలం కాగితపు సర్టిఫికెట్లు మాత్రమే పాఠశాలలు మరియు కాలేజీలు ప్రదానం చేస్తున్నాయి. పిల్లలు కుటుంబం మరియు సమాజం నుండి నేర్చుకున్న ప్రాథమిక జ్ఞానాన్ని, ఉత్పత్తి ప్రక్రియలో తాము నేర్చుకున్న శ్రమ విలువను, నిబద్ధతను పాఠశాలకు రావడానికి ముందే వారికున్న బహుముఖ నైపుణ్యాలను పాఠశాలలు నాశనం చేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

పని చేయకుండా ఏ మనిషి ఆనందాన్ని పొందలేడు. అభివృద్ధి సాధించలేడు. చేసే పని దైవంతో సమానం. పనే మనిషికి వృత్తి మరియు ప్రవృత్తి. కానీ దురదృష్టవశాత్తు, శ్రమపట్ల గౌరవం తగ్గి, శ్రమించే వారిని చిన్నచూపు చూడడం జరుగుతోంది.

ఆర్థికపరమైన అంశాలతో ముడిపడకుండా, ఉత్పాదకతలో పాల్గొనడం ద్వారా అభ్యసనం మరియు అభివృద్ధికి తోడ్పడేదే పని. పని ద్వారా నేర్చుకోవడం, నేర్చుకోవడం కోసం పని చేయడం అనేవి మిళితమైన అంశాలు.

చదువంటే సమాచారమని, బట్టీపట్టి పరీక్షలు రాయడం అనే భావన నేటి సమాజంలో పాతుకొని పోయింది. ఉత్పత్తులు, ఉత్పత్తికారక పనులు విద్య కాదు అనే నమ్మకం బలపడింది. శాస్త్రీయ భావనలను, 'నేర్చుకోవడానికి పని', 'పనిద్వారా నేర్చుకోవడం' ఈ రెండింటి కారణంగా పనిని విద్యలో అంతర్భాగం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

పని చేయడమంటే పిల్లలలో విలువలు, వైఖరులు మరియు నైపుణ్యాలు వృద్ధి చెందడం. పని ద్వారా సృజనాత్మకత, బాధ్యత, కలిసిమెలసి పనిచేయడం, గౌరవం, సహనం, క్రమశిక్షణ, సమాజంతో సత్సంబంధాలు వంటి లక్షణాలు పెంపొందడంతోపాటు పిల్లలలో సృజనాత్మక, సామాజిక మరియు భావాత్మక సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి.

NCF-2005 పని ద్వారా పిల్లలకు వివిధ పాఠ్యాంశాలు నేర్పాలని, తద్వారా పిల్లల్లో పని సామర్థ్యాలు మరియు నైపుణ్యాలను పెంపొందించాలని సూచించింది. విద్యాహక్కు చట్టం-2009 పిల్లల సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించింది. పిల్లల సమగ్ర అభివృద్ధికోసం పనివిద్యను ఒక ముఖ్యమైన సబ్జక్టుగా పాఠశాలవిద్యలో చేర్చారు. పనివిద్యను పాఠ్యాంశాలతో సమ్మిళితం చేయడం ద్వారా లేదా ప్రత్యేకంగా కూడా నేర్పించవచ్చు. ఈ కరదీపిక ప్రత్యేకంగా నేర్పించడానికి ఉద్దేశించినది. ఉత్పత్తితో ముడిపడిఉన్న లేదా అనుభవాన్ని కలిగించేది ఏదైనా కూడా పని అని భావించవచ్చు. ఇవి సాంస్కృతికపరమైనవి, సాంప్రదాయక ఉత్పత్తులకు సంబంధించినవి కావచ్చు.

ఎంచుకున్న పనికి సాంకేతిక నైపుణ్యానికి ఏవిధమైన సంబంధం లేదు. ఉపాధ్యాయులు బోధన, పర్యవేక్షణలలో మాత్రమే కాకుండా, ఉత్పత్తి ప్రక్రియలోనూ పాల్గొనాలి.

పాఠశాలలో వివిధ కృత్యాలు నిర్వహించేటప్పుడు సమీపంలోగల వృత్తినిపుణత గలవారిని పాఠశాలకు పిలిపించి వారిచే మాట్లాడిపించడం తద్వారా విద్యార్థులలో వివిధ నైపుణ్యాలు, పనిపట్ల గౌరవం మరియు సామాజిక అవగాహనను పెంపొందించవచ్చు.

పనివిద్య ఒక సహపాఠ్య అంశంగా పాఠశాలలో అమలవుతుంది కాబట్టి, మూల్యాంకనం చేయడం అవసరం. నిర్ధారించిన మూల్యాంకన సూచికలపట్ల ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలి. ఈ మూల్యాంకనం నిరంతరం, సమగ్రంగా కొనసాగాలి.

ఉపాధ్యాయులు ఈ కరదీపికను చదివి తగువిధంగా ప్రణాళికను తయారుచేసుకొని, ఇంకా తమ అనుభవాలను జోడించి, పనివిద్యా కార్యక్రమాలను పాఠశాలలో విజయవంతం చేసి పిల్లలలో సంపూర్ణ మూర్తిమత్వాన్ని సాధించడంలో భాగస్వాములౌతారని ఆశిస్తూ...

సంచాలకులు
రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ
హైదరాబాదు.

## పనివిద్య - విషయసూచిక

## 3, 4, 5 తరగతులు


| తరగతి | ప్రధాన అంశము | ఉప అంశము | పేజీ |
|---|---|---|---|
| | **పనివిద్య నేపథ్యం - ఆవశ్యకత** | | 1-6 |
| | **ఉపాధ్యాయ సూచనలు** | | 7 |
| | **పనివిద్య - ప్రధాన అంశములు** | | 8-36 |
| 3 | 1. పౌష్టికాహారము | ఆహారపదార్థాల సేకరణ - వర్గీకరణ | 38 |
| | 2. ఆరోగ్య విద్య | పారిశుధ్యం - వ్యక్తిగత శుభ్రత | 39-40 |
| | 3. జనాభా విద్య | తరగతి - జనాభా | 41 |
| | 4. సాంస్కృతిక వైవిధ్యము - వినోదము | ఇల్లు - తరగతిగది అలంకరణ | 42-43 |
| | 5. సామాజిక అంశాలపై అవగాహన - స్పందన | కుటుంబంలో వ్యక్తిగత బాధ్యత | 44 |
| | 6. సమాచారము - డాక్యుమెంటేషన్ | గోడపత్రిక - నిర్వహణ | 45 |
| | 7. వస్తువులు నమూనాల తయారీ | ఆకృతులు నమూనాలు | 46-50 |
| | 8. గృహయాజమాన్యము | ఇల్లు - వస్తువుల అమరిక | 51 |
| | 9. వినియోగదారుల విజ్ఞానము | వస్తువులు - ధరలు | 52 |
| | 10. పర్యావరణ విద్య | జీవకారుణ్యం | 53 |
| 4 | 1. పౌష్టికాహారము | ఆహారపదార్థాల సేకరణ - వర్గీకరణ | 55 |
| | 2. ఆరోగ్య విద్య | పారిశుధ్య అలవాట్లు - పరిసరాల శుభ్రత | 56 |
| | 3. జనాభా విద్య | పాఠశాల - జనాభా | 57 |
| | 4., సాంస్కృతిక వైవిధ్యం - వినోదము | కార్టూన్ చిత్రాల ప్రదర్శన మరియు కార్టూన్ కథల పఠనము | 58 |
| | 5. సామాజిక అంశాలపై అవగాహన - స్పందన | తరగతి పాఠశాలలో వ్యక్తిగత బాధ్యత | 59-60 |
| | 6. సమాచారము - డాక్యుమెంటేషన్ | పోస్టరు తయారీ | 61 |
| | 7. వస్తువులు నమూనాల తయారీ | ఆకృతులు నమూనాలు | 62-64 |
| | 8. గృహయాజమాన్యము | ఇల్లు - ఇంటి పరిసరాల శుభ్రత | 65-66 |
| | 9. వినియోగదారుల విజ్ఞానము | వస్తువుల ధరలను పోల్చడము | 67 |
| | 10. పర్యావరణ విద్య | ప్రకృతి - ఆకారాలు, క్రమాలు | 68 |

| తరగతి | ప్రధాన అంశము | ఉప అంశము | పేజీ |
|---|---|---|---|
| 5 | 1. పౌష్టికాహారము | సమతుల ఆహారము<br>ఆహారమేళా | 70–71 |
| | 2. ఆరోగ్య విద్య | పారిశుధ్యం – వస్తువుల శుభ్రత | 72 |
| | 3. జనాభా విద్య | వంశవృక్షము | 73 |
| | 4., సాంస్కృతిక వైవిధ్యం – వినోదము | ఊయల తయారీ<br>సంగీతవాయిద్యాల పరిచయము<br>(డప్పు, డోలు, ఫ్లూటు, కోలాటం) | 74–75 |
| | 5. సామాజిక అంశాలపై అవగాహన – స్పందన | సమాజంపట్ల బాధ్యత | 76 |
| | 6. సమాచారము – డాక్యుమెంటేషన్ | నోటీసులు, ఆహ్వానాలు, ప్రకటనలు | 77 |
| | 7. వస్తువులు నమూనాల తయారీ | పూలదండలు, డోర్‌మ్యాట్స్<br>ఆకృతులు | 78–80 |
| | 8. గృహయాజమాన్యము | ఇల్లు – మొక్కల పెంపకము | 81 |
| | 9. వినియోగదారుల విజ్ఞానము | తూనికలు – కొలతలు | 82–83 |
| | 10. పర్యావరణ విద్య | పాఠశాలలో మొక్కల పెంపకము – సంరక్షణ | 84 |


**పాఠశాల మొత్తంగా చేపట్టవలసిన కార్యక్రమాలు**


| | | |
|---|---|---|
| 1. | బాలసభ నిర్వహణ | 85 |
| 2. | పారిశుధ్య అలవాట్లు | 86–87 |
| 3. | లింగవివక్షత మరియు వికలాంగుల సమస్యల అవగాహన | 88 |
| 4. | స్థానిక కళాకారులచే పాఠశాలలో ప్రదర్శన ఏర్పాటు | 88 |
| 5. | జాతీయ పండుగల సందర్భంగా పాఠశాల నిర్వహించే కార్యక్రమాలు | 89 |
| 6. | బాల్యవివాహాలు మరియు బాలల హక్కులపై అవగాహనా కార్యక్రమాలు | 90 |
| 7. | పాఠశాల కార్యక్రమాలపై డాక్యుమెంటేషన్ | 91 |
| 8. | వస్తువుల నమూనాల తయారీ | 92 |
| 9. | పాఠశాలలో, ఇంటిలో విద్యార్థులు చేయవలసిన పనులు | 93 |
| 10. | వినియోగదారుల హక్కులు | 94 |
| 11. | పర్యావరణ పరిరక్షణ | 95 |

# పని విద్య - నేపథ్యం - ఆవశ్యకత

భారతీయ సమాజంలో, ఇంట్లో, పొలాలలో, దుకాణాలలో, ఇతర ప్రాంతాలలో పనిచేయడం పిల్లల దైనందిన జీవితంలో భాగమైపోయింది. గ్రామాలలో పనులు ఎక్కువగా ఉన్న సమయంలో పిల్లలు వ్యవసాయపనులు, కుండలు, బుట్టలు మొదలగునవి చేయడంలో తల్లిదండ్రులకు సహాయం చేయడమనేది సర్వసాధారణం. పిల్లవాడు చేసేపని అతనికి జ్ఞానాత్మక, సామాజిక, మానసిక రంగాలలో బహుముఖ అభ్యసనానికి అవకాశం కల్పిస్తూ బోధనాభ్యసన ప్రక్రియకు అమూల్యమైన వనరుగా ఉపయోగపడుతుంది.

పాఠశాలలు, పిల్లలకు ఉన్న పై అనుభవాలను నిర్లక్ష్యం చేయడమే కాకుండా చిన్నచూపు చూస్తూ పనులకు వారిని దూరం చేస్తున్నారు. పిల్లలు పాఠశాల సమయం తరవాతగానీ, చదువు పూర్తయిన తరవాతగానీ తమ పనులలో సహాయం చేయడానికి తిరస్కరించడంతో విచారిస్తున్న తల్లిదండ్రులను నేటికీ మనం గ్రామీణ వాతావరణంలో చూడవచ్చు.

పెస్టాలజీ, ఓవెన్, టాల్‌స్టాయ్, జాన్ డెవీ మరియు గాంధీజీ వంటి విద్యావేత్తలు ఉత్పాదకతతో కూడిన శ్రమను సమస్త పాఠశాల అనుభవాలకు మూలంగా చేయాలని ప్రయత్నించారు.

**చారిత్రక నేపథ్యం:**

స్వాతంత్ర్యానికి ముందే మన దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపే దిశగా జాతీయ విద్యా కమీషన్లు ఎన్నో ప్రతిపాదనలు చేశాయి. అందులో భాగంగానే పనివిద్యకు సంబంధించిన ప్రతిపాదనలను ఆచరణాత్మకంగా నిర్వహించడానికి కృషి చేశాయి.

1937లో వార్ధాలో జరిగిన జాతీయ విద్యా సమావేశంలో గాంధీగారు జాతీయ విద్యా విధానానికి, బేసిక్ ఎడ్యుకేషన్ రూపంలో ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని సూచించారు. దీని ప్రకారం నిజజీవిత పరిస్థితులను ప్రతిబింబించే ఉత్పాదకతతో కూడిన పనిని, అభ్యసనంతో అనుసంధానం చేయడం ద్వారా జ్ఞాన సముపార్జనయే కాకుండా విలువలు, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

చేతల ద్వారా పిల్లవాని మేధస్సు అభివృద్ధి చెందాలని; తల, చేయి మరియు హృదయం ఈ మూడింటిని సమైక్యం చేయడం ద్వారా పిల్లవాడి సంపూర్ణ అభివృద్ధి సాధించవచ్చని గాంధీజీ అభిప్రాయం. చేతివృత్తుల మాధ్యమంగా స్థానిక వనరులను ఉపయోగించి విద్యనందించాలని గాంధీగారి ఆకాంక్ష. రాట్నంతో దారం వడికేటప్పుడు గణితం, సామాన్యశాస్త్రం మరియు సాంఘిక శాస్త్రాలను సమీకృతం చేసి బోధించవచ్చునన్నారు.

జాతీయ విద్యామిషన్ (1964-66) 'పని అనుభవం .... అనేది విద్యను పనితో అనుసంధానించే ఒక పద్ధతిగా పేర్కొన్నారు. ఈ పని అనుభవం, యువతకు ఉపాధి మార్గాలను చూపడమే కాకుండా, పనిపట్ల బాధ్యతను, శ్రమించేతత్వాన్ని పెంచి, జాతీయ ఉత్పాదనలో పాలుపంచుకునేలా చేస్తుందని, ఈ కమీషన్ ఉద్ఘాటించింది.

జాతీయ విద్యా కమీషన్ (1964-66) ప్రతిపాదనల ఆధారంగా 1977 జాతీయ విద్యా కమీషన్ సాంఘికంగా ఉపయుక్తమైన ఉత్పాదకతతో కూడిన పనిని (SUPW) విద్యలో భాగంగా ఉంచాలని సూచించింది. అప్పటి నుండి SUPW (Socially Useful Productive Work) ఒక సహ పాఠ్యాంశంగా కొనసాగింది.

రాష్ట్ర విద్యా ప్రణాళికలో పనివిద్యకు సరైన స్థానం లేకపోవడం అత్యంత శోచనీయం. పాఠశాల ప్రణాళిక విద్యా సంబంధమైన విషయాలకే ప్రాధాన్యతనిస్తూ పని అనుభవాన్ని నిర్లక్ష్యం చేసింది. విద్యార్థి పొందే జ్ఞానం పరీక్షలలో ఉత్తీర్ణతకు మాత్రమే ఉపయోగపడేలా ఉంది. నిజజీవిత సమస్యలను ఎదుర్కొనే స్థైర్యాన్ని, సామర్థ్యాన్ని కల్పించేలా లేదు. (పనికి-విద్యకు సంబంధం లేకుండా పోతోంది)

పనివిద్య ప్రాధాన్యతను గుర్తించి జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005 (NCF), పనిద్వారా పిల్లలకు వివిధ పాఠ్యాంశాలను నేర్పించాలని, తద్వారా పిల్లలలో పని సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించాలని సూచించింది. విద్యాహక్కు చట్టం-2009 (RTE) కూడా విద్య ద్వారా భాష, సంస్కృతి, వృత్తులను తెలుసుకునే హక్కు పిల్లలకు ఉందని ప్రకటించింది.

వివిధ కమీషన్లు, కమిటీలు పని అనుభవం పేరిట పనిని చదువులో భాగంగా నేర్పడానికి పాఠశాలల్లో ప్రవేశపెట్టినప్పటికీ పనివిద్య అమలుతీరు ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి పనివిద్య, బాలకార్మికత అంటే భిన్న అభిప్రాయాలున్న నేటి సమాజంలో కింది ప్రశ్నల గురించి ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది.

**పని అంటే?**

ఆర్థికపరమైన అంశాలతో ముడిపడకుండా, ఉత్పాదకతలో పాల్గొనడం ద్వారా అభ్యసనం మరియు అభివృద్ధికి తోడ్పడేదే పని. పని ద్వారా నేర్చుకోవడం, నేర్చుకోవడం కోసం పనిచేయడమనేది మిళితమైన అంశాలు.

పాఠశాలలో పనివిద్య, బాలకార్మికత మధ్య వ్యత్యాసాన్ని చాలా మంది గుర్తించడం లేదు. సంపాదన కోసం పని చేయడం బాలకార్మికత అవుతుంది.

**పనివిద్య - ఆవశ్యకత:**

చదువుకున్న వారు నేడు తమ పనులు తామే చేసుకోవడం కూడా నామోషిగా భావించడం, పనిచేయడం తమ బాధ్యత కాదని, పనిచేసేందుకు వేరే వ్యక్తులుంటారని భావించడం జరుగుతున్నది. పని సంస్కృతి లేకపోవడం, పనిచేసే వారిని గౌరవించకపోవడం, ఆందోళన కలిగించే విషయాలు. వాస్తవానికి పనిలో కూడా ఆలోచన, అభివ్యక్తీకరణ, సృజనాత్మకతలు ఉంటాయి. పిల్లలు తమ బాల్యంలో ప్రత్యక్ష అనుభవాల ద్వారా, అంటే వివిధ పనులు చేయడం ద్వారా ఎన్నో విషయాలను సందర్భోచితంగా గ్రహిస్తారు. నేర్చుకోవడానికి, పని చేయడం అనేది ప్రాథమిక దశలో ఒక మాధ్యమం. చదువంటే సమాచారమని, దానిని జ్ఞాపకముంచుకొని అప్పజెప్పడమే నేర్చుకోవడం అనే భావన బలపడిన సందర్భంలో పని యొక్క ప్రాముఖ్యత కనుమరుగైంది. ఉత్పత్తులు, ఉత్పత్తికారక పనులు విద్య కాదు అనే భావన బలపడింది. ఈ అశాస్త్రీయ భావనలను తొలగించి పనిపట్ల, పనిచేసే వారిపట్ల గౌరవ భావం పెంపొందించేలా చేయాలి. 'నేర్చుకోవడానికి పని', 'పని ద్వారా నేర్చుకోవడం'- ఈ రెండింటి కారణంగా పనిని విద్యలో అంతర్భాగం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. పని చేయడమనేది ఉల్లాసమో, వినోదమో కాకూడదు. పనిచేయడం అంటే పిల్లలలో విలువలు, వైఖరులు మరియు నైపుణ్యాలు వృద్ధి చెందాలి. పని ద్వారా కలిసిమెలిసి పనిచేయడం, సృజనాత్మకత, బాధ్యత, గౌరవం, సహనం, క్రమశిక్షణ, ప్రసార నైపుణ్యాలు, సమాజంతో సత్సంబంధాలు వంటి లక్షణాలు పెంపొందడంతోపాటు పిల్లలలో జ్ఞానాత్మక, సామాజిక, భావాత్మక సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా సమాజంలోని బడుగు, బలహీనవర్గాల పిల్లలను, వికలాంగులను, అల్పసంఖ్యాకుల పిల్లలను, బడి మానివేసిన, బడి నుండి పంపించివేసిన పిల్లలను మరియు బాలికలను పనివిద్య ఆకర్షిస్తూ సమస్యలను, బలహీనతలను అధిగమించి సాధికారత సాధించేలా సహకరిస్తుంది.

ఈ నేపథ్యంలో పనివిద్యను, విద్యాప్రణాళికలో భాగం చేస్తూ, విద్యార్థులలో పై సామర్థ్యాలు, విలువలు మరియు నైపుణ్యాలను పెంపొందించుటకుగాను 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు పనివిద్యను ప్రవేశపెట్టడం జరిగింది.

**విద్యాప్రమాణాలు - పని:**

కింది విషయాలను దృష్టిలో ఉంచుకొని, పనిని విద్యాప్రణాళికలో ఒక భాగంగా చేర్చారు.

- పని అనేది విద్యార్థుల సామాజిక మరియు ఆర్థిక స్వరూపాలను తెలుసుకొనే వీలును కల్పిస్తుంది. అంతేకాకుండా వారి అభ్యసనాన్ని సందర్భోచితంగా అర్థవంతం చేసుకునేలా సహాయపడుతుంది.

- సహజంగానే పిల్లలు, తమ పనులు తామే చేసుకోవడానికి ఇష్టపడతారు. వారు ఉపయోగించే వస్తువుల తయారీ ప్రక్రియలను తెలుసుకోవడానికి ఉత్సాహం చూపుతారు.
- పనిని విద్యాప్రణాళికలో చేర్చడం ద్వారా, సమాజంలోని ఉత్పత్తి మరియు పాఠశాల సముదాయాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూరించవచ్చు.
- పని వివిధ సామర్థ్యాలు– జ్ఞానాత్మక, సామాజిక మరియు భావాత్మక సామర్థ్యాలు పొందేలా అవకాశం కల్పిస్తుంది. మేధస్సు మరియు చేతులతో అభ్యసనం జరిగే వాతావరణం పని ద్వారా లభిస్తుంది.
- వ్యవసాయం, చేపలు పట్టడం, వడ్రంగం, కుండలు చేయడం లాంటి స్థానిక సాంప్రదాయ ఉత్పత్తులను తయారు చేయడమే పని. ఇది ఖచ్చితమైన సాంకేతిక నైపుణ్యంతో తయారుచేసే అంశమై ఉండాలని ఏమీ లేదు. కానీ తప్పనిసరిగా సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించినదై, పిల్లవాడు ఆ ఉత్పత్తి తయారీలో స్వయంగా పాల్గొనేలా గానీ, భాగం అయ్యేలా గానీ ఉండాలి.
- పని విద్యార్థుల వయస్సులకు అనుగుణంగా ఉండాలి. ప్రాథమిక తరగతి విద్యార్థులకన్నా, ప్రాథమికోన్నత తరగతి విద్యార్థులకు చలన నైపుణ్యాలను ఉపయోగించే పనులను ఎక్కువగా ఇవ్వాలి.
- పాఠశాలలోగానీ, సమాజంలోగానీ లభ్యమయ్యే వనరుల ఆధారంగా చేసే పనులకు అవకాశం కల్పించాలి.
- పాఠ్య ప్రణాళికలో ఉండే అంశాలకు చేసే పనికి సంబంధం ఉండాలని ఏమీ లేదు. ఉదాహరణకు ఆహార పదార్థాల తయారీ అనే పని సామాన్య శాస్త్రంలోని ఆహార పదార్థాల నిలువ అనే అంశానికి సంబంధించినదై ఉండాల్సిన అవసరం లేదు.
- విద్యార్థి పాఠశాలలో ఎంచుకున్న పనికి మున్ముందు ఉన్నత విద్యాస్థాయిలలో ఎంచుకునే వృత్తికి లేదా ఉద్యోగానికి ఎలాంటి సంబంధం లేదు.
- ఎంచుకున్న పనికి సాంకేతిక నైపుణ్యానికి ఏవిధమైన సంబంధం లేదు.
- కులం, తరగతి, లింగ వివక్షత లేకుండా ప్రతి విద్యార్థి పనిలో పాల్గొనాలి.
- బోధన, పర్యవేక్షణ మాత్రమే కాదు ఉపాధ్యాయులు ఉత్పత్తి ప్రక్రియలోనూ పాల్గొనాలి.
- అవసరమైనప్పుడు ఉపాధ్యాయుడు తరగతి గదిలో పని నేర్పించే సమయంలో స్థానిక వృత్తులు నిర్వహించే వ్యక్తులను ఆహ్వానించాలి.
- పనిని సమవయస్కులతో నేర్చుకునేలా, జట్లుగా చేయడాన్ని ప్రోత్సహించాలి.
- పని నేర్పించడానికి ముందు ఉపాధ్యాయులకు విద్యార్థులలో పెంపొందించాల్సిన సామర్థ్యాల గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి. ఈ సామర్థ్యాలే విద్యార్థులను మాపనం చేయడానికి ఆధారమవుతాయి.

**పనివిద్య – యాజమాన్యం మరియు మూల్యాంకనం:**

తరగతిలో ఉపాధ్యాయులు పనిని ఒక అభ్యసనా సాధనంగా వినియోగించాలి.

**పనివిద్య – ఉపాధ్యాయుని పాత్ర:**

పని కేంద్రిత తరగతిగదిగా మార్చుకోవడానికి ఉపాధ్యాయులు కింది విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.

- విద్యార్థుల స్థాయిని మరియు అందుబాటులో ఉన్న వనరులను దృష్టియందుంచుకుని సామాజిక, ఆర్థిక అంశాలకు చెందిన చేతివృత్తి పనిని ఎంచుకోవాలి.

- వస్తు ఉత్పత్తికి అవసరమైన పదార్థాలను, వనరులను సమకూర్చాలి. ఇందుకోసం ఉపాధ్యాయులు వాటికి సంబంధించిన వివరాలు అందించే వ్యక్తులనుగానీ, సంస్థలనుగానీ సంప్రదించాలి.
- విద్యార్థి తాను చేయబోయే పనికి, నేర్చుకోబోయే అంశానికి ఏవిధమైన సంబంధం ఉందో ఉపాధ్యాయుడు ముందుగానే వివరించాలి.
- ఉపాధ్యాయులు కేవలం పర్యవేక్షకులుగానో, పనిని బోధించేవారుగానో కాకుండా విద్యార్థులతోపాటు పనిలో పాలుపంచుకోవాలి.
- ఉపాధ్యాయులు విద్యార్థులలో పెంపొందించాల్సిన సామర్థ్యాలు- జ్ఞానాత్మక, సామాజిక మరియు భావాత్మక రంగాలలో వేటికి చెందినవో ముందుగానే ఒక జాబితా తయారు చేసుకోవాలి. ఇవి విద్యార్థులను మూల్యాంకనం చేయడానికి ఉపయోగపడతాయి.
- ఉపకరణాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, ఉత్సాహంగా జట్లలో పని చేయగల విద్యార్థులను అంచనావేయాలి. పనికి సంబంధించిన జ్ఞానం కంటే జట్టులో ఇతరులతో పిల్లవాడి సంబంధాలు మరియు పనిచేసే విధానాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.
- తల్లిదండ్రులకు, సమాజంలోని వ్యక్తులకు పనివిద్య పట్ల అవగాహన కల్పించడం ఉపాధ్యాయులు చేయాల్సిన అతిముఖ్యమైన పని. ఇందుకు రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి కమ్మరి, కుమ్మరిలాంటి వృత్తిపనివారిని పాఠశాలలోకి రప్పించి విద్యార్థులకు అవగాహన కల్పించడం మాత్రమే కాకుండా విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించడానికిగాని, అమ్మడానికిగాని సమాజం యొక్క సహాయసహకారాలు అవసరం. రెండవది, పనివిద్య ప్రాముఖ్యత తల్లిదండ్రులకు తెలియకపోవచ్చు కాబట్టి పాఠశాలలో పనివిద్య ప్రారంభించే ముందు వారికి అవగాహన కల్పించి, దాని ప్రాధాన్యత వారికి తెలియజేయాలి.

**పనివిద్య - పాఠ్యాంశాలు:**

3వ తరగతి నుండి 10వ తరగతి వరకు పనివిద్యను ఒక విషయం (సబ్జక్టు)గా అమలుపరుస్తారు. ఈ పాఠ్యాంశాలు పౌష్టికాహారం, ఆరోగ్యవిద్య, జనాభావిద్య, సాంస్కృతిక వైవిధ్యం-వినోదం, సామాజిక అంశాల అవగాహన-స్పందన, సమాచారము-డాక్యుమెంటేషన్, వస్తువులు - నమూనాల తయారీ, గృహయాజమాన్యం, వినియోగదారులు-విజ్ఞానం మరియు పర్యావరణ విద్య.

పైన పేర్కొనబడిన పాఠ్యాంశాలు కేవలం మార్గదర్శకాలు మాత్రమే. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ శిక్షకులు, పాఠ్యప్రణాళికా రూపకర్తలు వారి వారి పరిస్థితులు/ సందర్భాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చుకునే అవకాశం ఉంది.

**పనివిద్య - ఉద్దేశాలు:**

- నిజజీవితంలోని పనులపట్ల అవగాహన కల్పించడం.
- సమాజం నుండి నేర్చుకునే అవకాశం ఇవ్వడం.
- అనుకోని పరిస్థితులను, సమస్యలను అధిగమించేలా తయారు చేయడం.
- వివిధ రంగాలలోని వ్యక్తుల గురించి మాట్లాడి వారి గురించి తెలుసుకునేలా చేయడం.
- శ్రమించడం, శ్రమ విలువను గుర్తించి గర్వించేలా చేయడం.
- రోజువారీ పాఠశాల కార్యక్రమాల మార్పునకు దోహదంచేసి, కొత్త ఆలోచనలను రేకెత్తించడం.
- సృజనాత్మకతను పెంపొందించడం.

**పనివిద్య మూల్యాంకనం:**

ఉత్పత్తి స్వరూపం ఆధారంగాగాని, చేసిన సేవలనుగానీ, మాపనం చేయకూడదు. విద్యార్థి అభ్యసన ప్రక్రియలో పొందిన జ్ఞానాత్మక, సామాజిక మరియు భావాత్మక సామర్థ్యాలను మాపనం చేయాల్సి ఉంటుంది.

**మూల్యాంకన సూత్రాలు:**

- పనివిద్యలో బోధనా లక్ష్యాలు, పిల్లలు పొందాల్సిన సామర్థ్యాలు మరియు వారికందించిన అభ్యసనానుభవాలను దృష్టిలో ఉంచుకొని మూల్యాంకనం చేయాలి.
- నిరంతర, సమగ్ర మూల్యాంకనం చేయాలి. ప్రతి కృత్యం/ ప్రాజెక్టు/ యూనిట్ పూర్తి చేసిన వెంటనే మూల్యాంకనం చేయాలి.
- విద్యార్థులకు మూల్యాంకనం తరవాత పరిపుష్టినివ్వాలి.
- నిర్ణయించిన సూచికల ఆధారంగా మూల్యాంకనం చేయాలి.
- ఉపాధ్యాయులు మూల్యాంకన ప్రక్రియను సున్నితమైనదని, కష్టమైనదని అనుకోకుండా క్రమక్రమంగా అనుభవాన్ని పొందుతూ నిబద్ధతను చూపాలి.

**మూల్యాంకనం - సూచికలు:**

వివిధ రంగాలలో పేర్కొనబడిన సామర్థ్యాల ఆధారంగా పనివిద్యలో విద్యార్థుల ప్రగతిని మూల్యాంకనం చేయాలి. పని - కంప్యూటర్ విద్యలో విద్యార్థుల ప్రగతిని నిరంతర సమగ్ర మూల్యాంకనము ద్వారా మూల్యాంకనము చేయాలి. ఇందుకు ఉపాధ్యాయుడు పని విద్యకు సంబందించిన ఈ క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1. పనివిద్య అంశాల పట్ల పిల్లల అవగాహన
2. ఉత్పాదక కార్యక్రమాల్లో వ్యక్తిగతంగా, జట్లలో పాల్గొనే తీరు
3. కార్య క్రమాలలో విద్యార్థులు ప్రదర్శించే నైపుణ్యాలు, అభిరుచులు
4. రూపొందించి / తయారు చేసిన వస్తువుల గురించి వివరించే నైపుణ్యాలు

పై అంశాలతో బాటుగా పిల్లల నివేదికలు, రూపొందించిన వస్తువులను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు మార్కులు, గ్రేడులు ఇవ్వాలి. ఇందుకొరకు పని విద్యలో సాధించాల్సిన విద్యా ప్రమాణాలు

1. పనిముట్ల వినియోగము, వస్తువుల తయారీ
2. కార్యక్రమాల్లో పాల్గొనడం, బాధ్యతలు నిర్వర్తించడము, అంతర్ కర్రికులమ్ కార్యక్రమాలు
3. సామాజిక సేవా కార్యక్రమాలు - శ్రమదానం

ఉపాధ్యాయుడు పై విద్యా ప్రమాణాల సాధనకు కల్పించిన అభ్యసన అనుభవాలను ఆధారంగా చేసుకొని పరిశీలన ద్వారా నమోదు చేయాలి. దీనికి రాతపరీక్ష ఉండదు. సంగ్రహణాత్మక మూల్యాంకనములో (సంవత్సరానికి 3 సార్లు S.A-I, S.A-II, S.A-III) నమోదు చేయాలి. మార్కులు, గ్రేడులతో పాటుగా క్యుములేటివ్ రికార్డులో వివరణాత్మక సూచికలను కూడా నమోదు చేయాలి.

| గ్రేడు | వివరణాత్మక సూచికలు |
|---|---|
| A1 | వివిధ రకాల పరికరాలను ఉపయోగించి వస్తువులు, నమూనాలను తయారు చేసి ప్రదర్శించడం. సామాజిక సేవా కార్యక్రమాల్లో, శ్రమదానంలో పాల్గొనడం. |
| A2 | వివిధ రకాల వస్తువులు, నమూనాలు తయారుచేసి పాఠశాల కళావేదికలో ప్రదర్శించడం. |
| B1 | వస్తువులు తయారీ కార్యశాలలో పాల్గొన్నాడు. పనివారి పట్ల గౌరవభావం కలిగి ఉండడం. |
| B2 | పని కార్యక్రమాల పట్ల అవగాహన ఉంది. జట్లలో పనిచేయడంలో ఆసక్తి కనబరచడం. |
| C1 | సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం. |
| C2 | పరికరాలను వినియోగించడం, భద్ర పరచడంలో ఆసక్తిని, మెళకువలను ప్రదర్శించడం. |
| D1 | పని కార్యక్రమాలకు హాజరయ్యాడు. సామాగ్రిని గుర్తించగలగడం. |
| D2 | పని విద్య పట్ల అభిరుచి తక్కువ. ఇతరుల సహాయముతో కృత్యాలు చేయగలగడం. |

పని – విద్యలో పిల్లల ప్రగతిని తరగతి వారీగా రిజిష్టరులో నమోదు చేసుకోవాలి.

పనివిద్య మరియు కంప్యూటర్ విద్య రెండింటి గ్రేడుల సగుటును కలిపి ఒకే గ్రేడుగా వేయాలి.

| S. No. | విద్యార్థి పేరు | M / G | SA-I | | | | | | SA-I | | | | | | SA-I | | | | | | వార్షిక ఫలితం | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 | 5 | T | 1 | 2 | 3 | 4 | 5 | T | 1 | 2 | 3 | 4 | 5 | T | 1 | 2 | 3 | 4 | 5 | T |
| 1. | రవి | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| 2. | రమ | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | |

# ఉపాధ్యాయులకు సూచనలు

ఈ కరదీపిక 3 నుండి 5 తరగతుల విద్యార్థులకు వివిధ కృత్యాలు నిర్వహించుటకొరకు ఉద్దేశించబడినది. ఈ కృత్యాలు నిర్వహించుటకు 10 ప్రధాన అంశములు ఎంచుకోవడము జరిగినది.

ప్రతి ప్రధాన అంశమునకు సంబంధించిన వివరణను కరదీపిక మొదటి భాగములో పొందుపరచడమైనది. వివరణతో పాటుగా Mind Map ఇవ్వడం జరిగినది. ఉపాధ్యాయుడు మొదట వివరణ చదివిన తర్వాత Mind Map కు సంబంధించిన అంశాలు రాబట్టేలా విద్యార్థులతో చర్చించి ఆ అంశంపై పూర్తి అవగాహన కల్పించాలి. తర్వాత ఆ ప్రధాన అంశములోని కృత్యములను పిల్లలతో చేయించాలి. ప్రతి ప్రధాన అంశానికి ఒక పూర్తి పీరియడ్‌ను కేటాయించాలి. ఒక్కొక్క కృత్యమునకు ఒక్కొక్క పీరియడ్‌ను కేటాయించాలి.

- ఉపాధ్యాయుడు పిల్లల అభిరుచి మేరకు ఒక తరగతిలోని కృత్యాలు, ఇంకొక తరగతి విద్యార్థులకు కూడా నిర్వహించవచ్చు.
- ఉపాధ్యాయుడు తను నిర్వహించవలసిన కృత్యమునకు కావలసిన ప్రణాళికను ముందురోజే తయారు చేసుకొని తగు సూచనలు విద్యార్థులకు ముందుగానే ఇవ్వాలి.
- విద్యా సంవత్సరము పూర్తి అయ్యేలోగా ఆయా తరగతులలో ఉన్న కృత్యాలన్నింటినీ చేయించాలి.
- కొన్ని కృత్యాలు చేసేటపుడు కృత్యానికి అనుగుణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రతి విద్యా సంవత్సరములో విద్యార్థులచే కృత్యాలు నిర్వహించుటకు కావలసిన స్థానికంగా లభించే వనరులు, వ్యక్తులకు సంబంధించి ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- పనివిద్యా కృత్యాలలో పిల్లలు సహజంగా పాల్గొనాలేకాని ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదు.
- మూల్యాంకనము రిజిష్టరులో "పని - కంప్యూటర్ విద్యా" ఒకే అంశంగా తీసుకున్నందున పనివిద్య, కంప్యూటర్ విద్యలో పొందిన మార్కులు, గ్రేడుల సగటును సంబంధిత రిజిష్టరులో నమోదు చేయాలి.
- పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యా సంవత్సరములో "పనివిద్య" కు సంబంధించి తయారుచేసిన నమూనాలు, వస్తువులు ప్రదర్శించాలి. మరియు కృత్యాలకు సంబంధించిన నివేదికను సమర్పించాలి.
- ఉపాధ్యాయుడు తన అనుభవములోని అదనపు కృత్యాలను కూడా జోడించి పిల్లలచే కృత్యాలు చేయించవచ్చు.
- స్థానికంగా అందుబాటులో ఉండే వృత్తి నైపుణ్యం కల, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చేతివృత్తులవారిని పాఠశాలకు ఆహ్వానించి వారిచే తమ అనుభవాలు, తయారుచేసే విధానము, జాగ్రత్తలు మొ॥ అంశాల గురించి చెప్పించాలి.
- కృత్యాలు చేయించడంలో వివిధ వ్యూహాలను అమలుపరచాలి. అవి : ప్రశ్నలు - చర్చ, ఉపాధ్యాయుడు చేసి చూపించి విద్యార్థులచే చేయించడము, వస్తుసేకరణ - ప్రదర్శన, సమాచార సేకరణ-విశ్లేషణ మరియు చర్చ, అనుభవాలను చెప్పించడము, వివిధ వ్యక్తులను పిలిపించి వారిచే ఉపన్యాసాలు ఇప్పించడం.
- వారంలో పనివిద్యకు ఒక పీరియడ్ ఉంటుంది. కావున దానికి అనుగుణంగా ఉపాధ్యాయుడు కార్యాచరణ రూపొందించుకోవాలి.

# పనివిద్య - ప్రధాన అంశములు


## 1. పౌష్టికాహారము

మనం తీసుకునే ఆహారాన్నిబట్టి మనిషి యొక్క శారీరక, మానసిక, ఎదుగుదల ఉంటుంది. ఆహారాన్ని వండ కుండా తినేవి, వండి తినేవి, ఎండబెట్టి ఆహారంలో వినియోగించేవిగా వర్గీకరించవచ్చు. వరిఅన్నం, గోధుమలు, జొన్న, రాగి, సజ్జ మొ॥వి ప్రధాన ఆహారంగానూ, ఆకుకూరలు, కూరగాయలు, మొ॥వి వాటిలో కలుపుకొని తినేవి గానూ ఉంటాయి. కందులు, శెనగలు, పెసలు మొ॥ వాటిని కూడా పప్పుగా వండి తింటాము. టమాట, దోస, క్యారట్ మరియు పండ్లను వండకుండానే తినవచ్చు. బాదం, జీడిపప్పు మొదలైన వాటిని మరియు పశువుల నుండి లభించే పాలు, పాల సంబంధిత పదార్థాలను కూడా మనం ఆహారంగా తీసుకుంటాము.

ఏయే ఆహారపదార్థాలను వండితింటే వాటిలోని పోషకాలు నశిస్తాయి, వేటిని వండకుండా తినడం వలన వివిధ పోషకాలు లభిస్తాయి, పాల ఉత్పత్తులను తయారుచేయడం, వాటిలోని పోషకాలను తెలుసుకోవడం, వివిధ ఆహార పదార్థాలను నిలువచేసే పద్ధతులు, నిలువచేయుటకు గల కారణాలను ఈ అధ్యాయంలో తెలుసుకుంటారు.

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి ఎదిగే వయస్సులో ఉంటాడు కాబట్టి వారి శారీరక పెరుగుదలకు, అభివృద్ధికి దోహదం చేసే వివిధ ఆహారపదార్థాలను గురించి వారు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఏయే ఆహారపదార్థాలను మనం ఆహారంగా తీసుకుంటామో, వాటిలో ఉండే వివిధ అంశాలు, శక్తినిచ్చే ఆహారపదార్థాలు, పెరుగుదలకు తోడ్పడే ఆహారపదార్థాలు మొదలగు వాటిగురించి విద్యార్థులకు తెలియచేయాలి. ఈ స్థాయిలో విద్యార్థి ఆహారపదార్థాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు మొదలగునవి గుర్తించడంతోపాటు ధాన్యాలు, పప్పుగింజలు, మసాల దినుసులను కూడా వర్గీకరించగలడు మరియు వారు ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పైవన్నీ ఉంటాయని గ్రహించగలరు. ఆహారంలో వివిధ పోషకాలను తెలుసుకొని తాము తీసుకునే ఆహారంలో వివిధ పోషకాలుండేలా చూసుకుంటారు. వీటన్నింటితోపాటు విద్యార్థులకు క్రింది విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- కూరగాయలను, ఆకుకూరలను కోయడానికి ముందే కొద్దిసేపు ఉప్పునీటిలో నానబెట్టి శుభ్రపరచాలి.
- వాటిని మరీ చిన్న ముక్కలుగా తరగకూడదు.
- వీలైనంతవరకూ ఆవిరిలో వండిన ఆహారపదార్థాలను తినడం మంచిది.
- ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్ళీ, మళ్ళీ వాడకూడదు.
- వండిన ఆహారపదార్థాలను సరియైన విధంగా నిల్వచేయాలి.
- బజారులో లభించే నిల్వ ఆహారపదార్థాలలో రసాయనిక, కృత్రిమ పదార్థాలుంటాయి కాబట్టి వీలైనంత వరకూ వీటిని వాడకూడదు.
- ఎక్కువకాలం నిలువవుండే ఆహారపదార్థాలు మరియు ఉప్పు, చక్కెరలు అధికంగా ఉండే ఆహారపదార్థాలను తినడానికి ప్రోత్సహించకూడదు.
- పోషకవిలువలు లేని ఆహారపదార్థాలను తినడం / త్రాగడం తగ్గించాలి.
- ప్యాక్ చేయబడిన పదార్థాలనుపపయోగించే ముందు ఉపయోగించుటకు నిర్దేశించిన సమయం, తయారు చేయడానికుపయోగించిన పదార్థాలను చూసిన తర్వాత మాత్రమే వినియోగించాలి.
- తగినన్ని, సురక్షితమైన మంచినీరు తీసుకోవాలి. కలుషితనీరు అని అనుమానమున్నప్పుడు వాటిని మరగకాచి, చల్లార్చి వడకట్టి త్రాగాలి.
- సంప్రదాయకంగా ఇళ్ళలో తయారుచేయబడ్డ ఆహారం తీసుకోవడానికే ప్రాధాన్యతనివ్వాలి.
- తినడానికి ముందు పండ్లను బాగా శుభ్రపరచాలి.
- కూరగాయల సలాడ్‌లు, సూప్‌లు, రసాలు, రాగిజావ మొదలగునవి త్రాగడాన్ని ప్రోత్సహించాలి.


పౌష్టికాహారం
ఆహారపు అలవాట్లు
కుటుంబ పరంగా
సంస్కృతి పరంగా
భౌగోళిక పరంగా
ఆధునిక పరంగా
కాలాను గుణంగా (seasonal)
ఆహారం-శుభ్రత
పరిసరాల శుభ్రత
వ్యక్తిగత శుభ్రత
వంటగది, వంటపాత్రల శుభ్రత
ఆహార పదార్థాల శుభ్రత
ఆహారం-పోషకాలు
పిండిపదార్థాలు
మాంసకృత్తులు
క్రొవ్వులు
ఖనిజలవణాలు
నీరు
పీచుపదార్థాలు
ఆహారం-వంటపాత్రలు
ఆహారము-ఆరోగ్యము
అపోహలు - లోపాలు
ఆహారము-అపోహలు
ఆహారం-నిలువ
ఎండబెట్టడం, ఉప్పుకలపడం మొ॥వి.
ఆహారము-రకాలు
ఆహారపదార్థాలు
ధాన్యాలు
చిరుధాన్యాలు
పప్పులు
నూనెగింజలు
మసాలాదినుసులు
ఆకుకూరలు
కూరగాయలు
పండ్లు
తొందరగా పాడయ్యేవి (Pereshable Food)
ఎక్కువకాలం నిలువ ఉండేవి (Non-Pereshable Food)
వండి తినేవి
వండకుండా తినేవి
ఇంట్లో తయారుచేసేవి
మార్కెట్‌లో లభించేవి
వృక్ష సంబంధ మైనవి
జంతు సంబంధ మైనవి

# 2. ఆరోగ్య విద్య

'ఆరోగ్యమే మహా భాగ్యం'

ఆరోగ్యకరమైన వాతావరణంలో ఆరోగ్యంగా ఉన్న మానవుడు ఏ పనినైనా సులభంగా, ఫలవంతంగా, ప్రయోజనకరంగా చేయగలడు. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఏ సమ్యసలు లేకుండా ప్రశాంతంగా జీవించడమే ఆరోగ్యకరమైన జీవనము.

మన విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన కర్తవ్యం మనదే. కాబట్టి ఆరోగ్యంగా ఉండి, చలాకీగా, ఉత్సాహంగా పనిచేసే ప్రతీ విషయం కూడా విద్యార్థి చదువుకు, ప్రగతిని అభివృద్ధిపరచడానికే ఉపయోగపడుతుంది. విద్యార్థులు శారీరకంగా, దృఢంగా ఆరోగ్యంగా ఉండాలంటే వారు చేయవలసిన కార్యక్రమాలు, ఇంటిలో, బడిలో నిర్వర్తించవలసిన అంశాల గురించి తెలియజెప్పాల్సి ఉంటుంది.

శారీరకంగా బలంగా ఉండడానికి పోషకాహారం తీసుకోవడం. ఆరోగ్య సూత్రాలు పాటించడం. మంచి ఆహారపు అలవాట్లు కల్గి ఉండడం, ఇంటిలోను, ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రమైన వాతావరణం ఉండేటట్లుగా చూసుకోవాలి. దురలవాట్లకు లోనుకాకుండా ఉండడం. మానసిక ప్రశాంతతకు యోగాభ్యాసాలు, వ్యాయామం అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం. ప్రథమచికిత్స మొదలగు అంశాలపై ప్రాథమిక స్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు గల విద్యార్థులకు అవగాహన  కావాలి.

### ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి యొక్క లక్షణాలు:

శారీరకంగా మానసికంగా, ఆరోగ్యంగా ఉండేవ్యక్తి చురుకుగా, ఉత్సాహంగా ఉంటాడు. కళ్ళు కాంతివంతంగా ఉంటాయి. చర్మము పొడిబారిపోకుండా ఉండడం. గోళ్ళు గులాబిరంగులో ఉండి పెళిసిపోకుండా ఉండడంవంటి లక్షణాలు.

### మంచి అలవాట్లు – స్వీయ శుభ్రతకు మెలకువలు

ప్రతిరోజు పండ్లు తోముకోవడం, వాడిన బ్రష్‌ను నెల / రెండు నెలలకొకసారైనా మార్చడం. గోళ్ళను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవడం (గోళ్ళ కత్తిరతో మాత్రమే), మగపిల్లలు జుట్టు కత్తిరింపు, క్రాప్ చేసుకోవడం, ప్రతిరోజు స్నానం చేయడం, ఉతికిన బట్టలు ధరించడం, యూనిఫామ్ (రెండుజతలు)ను రోజూ మార్చి రోజు / రెండు రోజులకొకసారి ధరించడం. వీధిలోకి వెళ్ళివచ్చిన తర్వాత కాళ్ళు కడుక్కోవడం, కాళ్ళకు చెప్పులు ధరించడం, మరుగుదొడ్డికి వెళ్ళిన తర్వాత చేతులను బూడిద / సబ్బుతో కడుక్కోవడం. అన్నం తినేముందు, తిన్న తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం, తిన్న తర్వాత నోటిని పుక్కిలించడం. శరీరమంతా మురికి, దుమ్ము లేకుండా స్నానము చేసేటప్పుడు స్నానపు సబ్బును ఉపయోగించడం లేదా సున్నిపిండి వాడుకుని శుభ్రంచేసుకోవడం, తడిలేకుండా తుండుగుడ్డ (టవల్)తో తుడుచుకోవడం, మిఠాయి, చాక్‌లెట్లు వంటి వాటిని తిన్న తర్వాత పండ్ల సందులలో ఆహారపు తునకలు లేకుండా నోటిని పుక్కిలించడం, చెవులలో పుల్లలు పెట్టుకోకపోవడం.

విద్యార్థులకు – ఆరోగ్య విద్య, శుచి శుభ్రతల గురించి ఆరోగ్య సూత్రాలు

నాటకీకరణంగా తోలుబొమ్మల ప్రదర్శన, నమూనా బొమ్మల ద్వారా తెలియజేయడం.

దంతపరీక్షలు, కంటిపరీక్షలు ఎప్పటికప్పుడు వైద్యుని పర్యవేక్షణలో నిర్వహింపజేయడం కంటిచూపు బాగుండడానికి

విటమిన్ 'ఎ' గల పండ్లను, కూరగాయలను, ఆకుకూరలను ప్రతిరోజు తీసుకునే ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలని తల్లిదండ్రులకు తెలియజెప్పేటట్లు కార్యక్రమం నిర్వహింపజేయడం. శారీరక లోపాలు ఉన్న విద్యార్థులను గమనించి వారికి సరియైన చికిత్స అందేటట్లు చూడడం.

ప్రాథమికస్థాయి విద్యార్థుల నుండి కూడా చుట్టుపక్కల పరిసరాల ప్రభావంవల్ల పాన్‌పరాగ్, గుట్కా వంటి పాకెట్లు తీసుకోవడం తినడానికి అలవాటు పడుతున్నారు. ఆ విద్యార్థులపై వాటి ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం.

పాఠశాల / తరగతి గదులలో అద్దం, దువ్వెన, సబ్బు, నీళ్ళతో ఉన్న బకెట్టు, చెంబు వంటివి అందుబాటులో ఉంచడం.

### మానసిక ఆరోగ్యం:

యోగ, ధ్యానం వంటి ప్రక్రియలు బడిలో నేర్పుతున్న వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా నిర్వహింపబడేటట్లు చేయడం. తన తరగతికి తానే బాధ్యత వహిస్తూ కొద్ది నిమిషాల సమయాన్ని కేటాయించి విద్యార్థులలో మంచి ఆలోచనలు రావడానికి, చదువు – పని లో పాల్గొనడానికి వీలుగా నేర్పించడం. ప్రతిరోజు ప్రార్థనా సమయానికి విద్యార్థులు కచ్చితంగా హాజరయ్యేటట్లు చూడడం. ప్రతి విద్యార్థి సూక్తి చెప్పడం ప్రార్థనాగీతాలు పాడడంతో వ్యక్తిగతంగా / సామూహికంగా పాల్గొనడం.

### శాస్త్రీయ భావన:

ఈ అధ్యాయం ద్వారా విద్యార్థులకు పోలికలను గుర్తించడం, తేడాలను గ్రహించడం విషయాన్ని అవగాహన చేసుకోవడం పరిశీలించడం, సాధారణీకరణం ద్వారా వర్గీకరించడం, విశ్లేషించడంపట్ల సమగ్రంగా తెలుస్తుంది.

### జాగ్రత్తలు:

ఆహారాన్ని శుచిగా వండడం. కాయగూరలను, ఆకుకూరలను శుభ్రమైన నీటిలో కడిగి, తరగడం. పెద్ద ముక్కలుగా తరగడం, తక్కువ సెగలో వండడం.

### సూచనలు:


వండకుండా తినేవి – పండ్లు కొన్ని రకాల కూరగాయలను శుభ్రమైన నీటిలో బాగా కడిగి తినాలి. కార్బైడ్ పదార్థాలను కలిపిన పండ్లను శుభ్రంగా కడుక్కోవాలి. వివిధ రకాల పండ్ల ముక్కల ఫ్రూట్‌సలాడ్ వినియోగించుకోవడం ఆయా కాలాలలో లభించే తాజా పండ్ల రసాలు తీసుకోవడం.

### ప్రథమ చికిత్స:

అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డాక్టరు వచ్చేలోగా చేసే వైద్యాన్ని ప్రథమచికిత్స అంటారు. తగిలిన గాయాలకు చీముపట్టకుండా, గాయం పెద్దదిగా కాకుండా, తగిన నేర్పుతో కొద్దిపాటి శిక్షణను కల్పించడం.

ప్రథమచికిత్స అంటే ఏమిటో తెలియజేస్తూ అందులో ఉండే పదార్థాల గురించి, జాగ్రత్త గురించి, వినియోగించే పద్ధతి తెలియజేయడం.

ప్రాథమికస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు గల విద్యార్థులకు స్థాయిని బట్టి వారి వయస్సు ఆధారంగా ప్రథమచికిత్సను చేసే పద్ధతిని నేర్పించడం.



ఆరోగ్య విద్య
ఆరోగ్య సేవలు
ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు
108 వాహనం
ప్రభుత్వ ఆసుపత్రి
పరిసరాలు
కాలుష్యం-ప్రభావం
ఋతువులు-మార్పిడి ఆరోగ్యంపై ప్రభావం
ఆహారం
సమతులాహారం
ఆహారం - శుభ్రత
సంస్కృతి
వైద్యం
ఆరోగ్యం- అపోహలు
ఆహారపు అలవాట్లు
ఆరోగ్యపు అలవాట్లు
వ్యక్తిగత శుభ్రత
పరిసరాల శుభ్రత
ఆటపాటలు-విశ్రాంతి

# 3. జనాభా విద్య

ఒకానొక సమయంలో ఒక ప్రదేశంలో నివసించే జీవులను ఒక జనాభాగా చెప్పవచ్చును. ఇది మనుషులకు సంబంధించినది కావచ్చు, జంతు వృక్షాలకు సంబంధించి కూడ ఉండవచ్చును.

జనాభాకు సంబంధించిన అంశాలు తెలుసుకోవటం చాలా అవసరం. ఒక సమాజము యొక్క అభివృద్ధి అక్కడ ఉండే జనాభాపై ఆధారపడుతుంది. జనాభాలో ఒక తరం నుండి ఇంకో తరం మారుతుంది. ప్రత్యుత్పత్తి అనే ప్రక్రియ జనాభాను పూరిస్తుంది.


ఒక సమాజ నిర్మాణంలో జనాభా అంశాలు చాలా ముఖ్యమైనవి. ఉదాహరణకు ఒక ప్రాంతంలో ఉండే మొత్తం ప్రజలెంతమంది, వారిలో స్త్రీ పురుషులు సంఖ్య ఎంత? వృద్ధుల సంఖ్య, చిన్నపిల్లల సంఖ్య మొ॥గు అంశాలు ఎలాంటి మార్పులకు గురిఅవుతున్నాయో కూడ చాలా ముఖ్యమైన అంశము.

సమాజ అభివృద్ధిలో కూడ జనాభా ప్రాధాన్యత ఎంతోవుంది. ప్రణాళికల తయారీ మరియు కార్యక్రమాల అమలు అన్నీ కూడ జనాభాను దృష్టిలో ఉంచుకునే జరుగుతాయి. వలసలు కూడా జనాభాలో చాలా ముఖ్యమైన అంశము. ఈ విషయాలన్నీ కూడ విద్యార్థులకు అవగాహన కలగాలి. అందుకని జనాభా అంశాలకు సంబంధించిన కొన్ని కృత్యాలను వివిధ తరగతులలో విద్యార్థుల స్థాయినిబట్టి చేర్చడం జరిగింది.

పిల్లలకు జనాభాలో ఉండే వైవిధ్యము తెలియాలి. ఒక ప్రాంతంలో ఉండే జనాభా ఏవిధంగా ఆర్థిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారో తెలియాలి. జనాభా పెరుగుదల మరియు తరుగుదల సమాజ అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలియాలి.

మనుషుల జనాభాతోపాటు జంతు వృక్షాలకు సంబంధించిన విషయాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఒక ఆవాసంలో ఉండే వివిధ జనాభాల మధ్య ఉండే సమన్వయం గురించి కూడా అవగాహన అవసరం. ఆవాసప్రాంతంలో జరిగే మార్పులు, ఆ మార్పులకు కారణాలు, మార్పుల పర్యవసానాలు అనే అంశాలు కూడా విద్యార్థులు తెలుసుకోవాలి.

ఇప్పటివరకూ మనము అధిక జనాభాను ఒక భారంగా భావించేవాళ్ళం. ప్రస్తుతం ప్రపంచీకరణలో భాగంగా జనాభా అనేది ఒక వనరుగా మారింది. మనదేశంనుండి ఎంతోమంది విదేశాలకు వెళ్ళి అక్కడ వారు తమ సేవలందించి ఎంతో డబ్బును తిరిగి దేశానికి పంపడం నిజంగా ఒక అద్భుత అవకాశం. కావున సమర్థత ఉన్న జనాభా భారము కాదనే సత్యాన్ని మనం ఈరోజు గమనిస్తున్నాం. దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రజలందరికీ కావలసిన సదుపాయాలు సమకూర్చుకోవాలి. పట్టణీకరణను అదుపుచేయుటకు గ్రామాలను అభివృద్ధిచేయాలి.


జనాభా విద్య
ప్రభుత్వ సేవలు
మాతాశిశు సంరక్షణ
వృద్ధాప్య పెన్షన్లు
వలసలు
వలస వెళ్ళడం
వలస రావడం
జనాభా గణాంకాలు
బాలురు
బాలికలు
స్త్రీలు
పురుషులు
వికలాంగులు
జనాభా అంశాలు
జననాలు
మరణాలు
వనరులపై ఒత్తిడి
నీరు
భూమి
సౌకర్యాలు
జనాభా విస్తరణ
గ్రామాలు
పట్టణాలు
నగరాలు
కుటుంబం
వ్యష్టి కుటుంబాలు
సమిష్టి కుటుంబాలు
సంస్కృతి
బాల్యవివాహాలు
బహుభార్యత్వం
మగపిల్లలకు ప్రాధాన్యత

# 4. సాంస్కృతిక వైవిధ్యం - వినోదము

మన శరీరంలో జీర్ణవ్యవస్థ, రక్తప్రసరణ వ్యవస్థ, శ్వాసవ్యవస్థ, విసర్జకవ్యవస్థ, అస్థిపంజర వ్యవస్థ, కండర వ్యవస్థ, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, నాడీ, అంతస్రావీ వ్యవస్థలాంటివి భిన్న వ్యవస్థలైనప్పటికీ, అవన్నియు ఒక దానితోనొకటి, కలిసి మెలసి, సమన్వయంతో పనిచేయడంవల్లనే మనం ఒక మనిషిగా బ్రతుకగల్గుతున్నాం. ఆరోగ్యంగా జీవించగల్గుతున్నాం.'భిన్నత్వంలో ఏకత్వం' 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సత్యాలను మన శరీరం పనిచేసే విధానాన్ని చూసి నేర్చుకోవచ్చు.

మన చుట్టూ ఉన్న ప్రకృతిలో వివిధ రకాలైన మొక్కలు, జంతువులు, మరియు గాలి, నీరు, నేల, నిప్పు, శక్తి ఒకదానితో ఒకటి సమన్వయ, సంకీర్ణ నియమాలతో, భిన్నత్వంలో ఏకత్వంలా పనిచేయడంవల్లనే మన ప్రకృతి ఒక ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుంది. అలా లేనట్లయితే ప్రళయం, వినాశనము మనం చవిచూడవలసి వస్తుంది.

సువిశాలమైన మన భారతదేశం భిన్న జాతులు, తెగలు, కులాలు, మతాలు, భాషలు, ఆచార వ్యవహారాలు, వినోదం సంస్కృతులలో కూడుకున్నది. ఇవి అన్నియు బాహ్యంగా ఒకదానితో ఒకటి భిన్నంగా కనబడినప్పటికి అంతర్గతంగా వాటి యొక్క మూలభావనలు, ఉద్దేశ్యాలు మాత్రం ఒకే అంశము. నియమము, సూత్రము మీద ఆధారపడియుండటం విశేషం. ఇది సత్యము, వాస్తవం. అయితే కాలానుగుణంగా, దేశ, కాల, సామాజిక పరిస్థితులనుబట్టి అవన్నియు వేర్వేరుగా ఆవిర్భావం కావడంవల్ల అవి ఒకదానికొకటి భిన్నంగా కనబడుతున్నాయి. దురదృష్టవశాత్తు ఆ భిన్నత్వాన్నే ప్రధానంగా పెట్టుకొని మనం జీవించడంవల్ల మన సంఘజీవనంలో ఒకరిపట్ల మరొకరికి వైషమ్యం ఏర్పడుతుంది. సామాజిక ఆనందాన్ని కోల్పోతున్నాం! కానీ వాటి ఆవిర్భావంలోని మూలభావనలను, ఉద్దేశ్యాలను అర్థంచేసుకొని ఒకదానితో మరొకటి అంతర్లీనంచేసి, అన్నింటిని చూడగల్గితే, సహనశీలత ఉంటే, మానవజీవితం ఆనందమయమవుతుంది. ఈ ప్రపంచం ఒక వసుధైక కుటుంబంగా విలసిల్లుతుంది. ఈ భూమి ఒక స్వర్గతుల్యమవుతుంది. పరస్పర అవగాహన, గౌరవం పెరుగుతుంది. మానవ జీవితం కళ్యాణవంతమవుతుంది. అందుకు మనమేం చేయాలి? మనం చేయాల్సిందల్లా ఒక్కటే! మానవ జీవితానికి సంబంధించిన ఈ క్రింది అంశాలపై మనం పరస్పర అవగాహన, గౌరవము, ప్రేమ పెంపొందించుకోవాలి. ఉదాహరణకు

- భాషలు
- పండుగలు నిర్వహించుకొనడం
- వివాహాలు, జనన, మరణ దినోత్సవము నిర్వహించుకొనుట
- వ్యక్తిగత అలంకరణలు – ఆచారాలు
- ఆచార వ్యవహారాలు
- వేషధారణలు – దుస్తులు – అలవాట్లు
- ఆహారపు అలవాట్లు
- వికలాంగులను, వృద్ధులను ఆదరించడం
- దేశభక్తి

మన దేశంలో భిన్న జాతులు, మతాలు, కులాలు, తెగలు, భాషలు, వేషధారణలు, పండుగలు, వ్యక్తిగత అలంకరణలు, ఆహారం – ఆరోగ్యం అలవాట్లు ఉన్నాయి. వాటిని వివరంగా పరిశీలిద్దాం!

**జాతులు – తెగలు:**

మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో, వివిధ ప్రాంతాల్లో, వివిధ హరిజన, గిరిజన జాతులున్నాయి. ప్రధానంగా భారతదేశం వ్యవసాయకదేశం. వివిధ ప్రాంతాలలో భిన్న భిన్న జాతులను మచ్చిక చేసుకొని తను జీవన విధానాన్ని కొనసాగిస్తున్నాం. జీవన విధానాల్లో తేడాలు ఉన్నప్పటికి వాటిమధ్య సారూప్యత కనబడుతుంది. సంఘీభావన అర్థమవుతుంది. ఇది మానవ జీవితం యొక్క విశిష్టత. అయితే వివిధ జాతులు తెగలు మధ్య వర్గబేధాలు, వైషమ్యాలు తలెత్తుతుంటాయి. వివక్ష కనబడుతుంది. అలాంటిది లేకుండా అందరూ కలిసిమెలసి ఉండేందుకు మనం ప్రయత్నించవలసిన అవసరం ఉంది. ఆ నైపుణ్యాల్ని పెంపొందించుటకు వివిధ కృత్యాల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించాలి.

**వేషధారణలు – వ్యక్తిగత అలంకరణలు**

మన దేశం ముఖ్యంగా భిన్న వేషధారణలకు, వ్యక్తిగత అలంకరణలకు పెట్టిందిపేరు. ఒక్కొక్క ప్రాంతంలోని పురుషులు, స్త్రీలు ధరించే దుస్తులు ఒక్కోరకంగా ఉంటాయి. అవి ప్రధానంగా వారు నివసించే ప్రాంతాలయొక్క శీతోష్ణస్థితి పరిస్థితులను, అక్కడి సాంఘిక పరిస్థితులను, వారి ఆర్థికస్థితిగతులను, ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తుంటాయి. అలాగే ఈ వేషధారణలు, దుస్తులు, అలంకరణ కోసం గానీ, లేక వ్యక్తిగత రక్షణకోసంగాని ఉంటాయి. వారు ధరించే వస్తువులు, ఆభరణాలు, ఆయుధాలు వారి మతాలు, నమ్మకాలు, హోదాబట్టి ఉంటాయి. ఉదాహరణకు భిన్న మతాలవారు, కులాలవారు ధరించే దుస్తులు, అలంకరణ, వారుపెట్టుకొనే బొట్లు, తిలకాలు, కాటుక దిద్దడాలు, శరీరంపై పొడిపించుకునే పచ్చబొట్లు, రక్షణకోసం సిక్కులు ధరించే కత్తులులాంటి ఆయుధాలు (కృపాణము) మున్నగునవి హిందువులు, మహ్మదీయులు, సిక్కులు, జైనులు, బౌద్ధులకు భిన్న భిన్న విధాలుగా ఉంటాయి. ఏవేవి ఎన్నెన్ని ఉన్నప్పటికి, ఒకరు మరొకరి ఆచారాలను, అలవాట్లను, అలంకరణను గౌరవించడం అనేది నాగరికతకు అర్థం. అలాంటి నైపుణ్యాల్ని లక్షణాల్ని, ప్రశాంతమైన, ఆనందదాయకమైన సంఘజీవనంకోసం మనం పెంపొందించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**భాష**

భాషలు అనేకము. ఒక్క మన భారతదేశంలోనే సుమారు 800 భాషలకు పైగా ఉన్నాయి. అందులో లిపిలో భాషలున్నవి కొన్ని మాత్రమే. అందులో అధికార భాషలుగా ఆంధ్రరాష్ట్రంలో మాట్లాడే ఒక్క తెలుగు భాషలోనే కోస్తాఆంధ్ర, సర్కారు, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలవారు మాట్లాడే తెలుగు భాషలో చాలావైవిధ్యం మనకెరుక. అంతేకాదు ఒక్క జిల్లాలోనే నాలుగు మూలల్లో మాట్లాడేవారి తెలుగు భాషలో, భాష యొక్క యాసలో వారు ఉపయోగించే పదాలలో చాలా భిన్నత్వం కనబడుతుంది.


ఉదాహరణకు కర్నూలు జిల్లాలోనే ఒక వ్యక్తి ఒక వస్తువును తనతోపాటు తీసుకెళ్ళినాడు అనే అర్థం వచ్చే పదానికే తీసుకెళ్ళినాడు, వెంటబెట్టుకొని పోయినాడు, పట్టుకెళ్ళినాడు, కొండబోయినాడు అనే పలురకాల పదాలుపయోగిస్తారు. అలా జిల్లాలవారీగా, ప్రాంతాలవారీగా, రాష్ట్రాలవారీగా, దేశాలవారీగా పరిశీలిస్తే ఎన్ని వందల, వేల రకాల భాషలో! భాషలోనే యాసలో తేడాలు, వైవిధ్యాలు గోచరిస్తాయి. ఏది ఏమైనప్పటికి అన్ని ప్రాంతాలవారి భాషలను, అర్థంచేసుకొని,

ఆనందించి, అనుభవించి,అభిమానించి గౌరవం పొందగల్గే సంస్కారము, లక్షణాలు, నైపుణ్యాలు మనము కలిగివుండటం అవసరము. అప్పుడే అందరము కలిసిమెలసి హాయిగా ఉండగల్గుతాము. సాంఘిక సమన్వయం, సంకీర్ణత సాధించగల్గుతాము.

**ఆహారపు అలవాట్లు**

మన చుట్టూ లభించే కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలు ఇతర ఆహారపదార్థాలు ఎన్నెన్నో. అయితే అందరు అన్నింటిని ఉపయోగించరు. ఒక్కొక్కరు ఇష్టపడే ఆహారాపదార్థాలు, అలవాట్లు ఒక్కొక్క రీతిలో ఉంటాయి. ఒక్క ఆహారపదార్థాన్ని ఒక్కొక్కప్పుడు ఒక్కో రీతిలో వండుతుంటారు. ఎవరు, ఏ యే ఆహారపదార్థాలని, వారికిష్టమొచ్చిన రీతిలో ఎలా తయారుచేసుకున్నా మనం తీసుకునే ఆహారపదార్థాలు ఉదా: అల్లం, జీలకర్ర, వాము, మెంతులు, ఉల్లి, పసుపు మరియు కొన్ని రకాల ఆకుకూరలు కొన్ని ప్రత్యేకమైన వైద్యపు, ఔషధ విలువలను కలిగివున్నాయి. అది ఒక్కొక్క ప్రాంతంలో, ఒక్కొక్క రీతిలో వాడుకలో ఉంటాయి. కాని అన్ని ప్రాంతాల, అన్ని రకాల వంటకాలను, ఆహారపదార్థాలను ఇష్టపడగల్గడం, ప్రీతితో తినగల్గడం, అనేది మన నైపుణ్యం, సామర్థ్యం అవుతుంది. సంపూర్ణ నాగరికత అర్థమవుతుంది. భిన్నత్వంలో ఏకత్వంను 'రుచి'ని చూడగల్గిన అదృష్టవంతులవుతాము.

పాఠశాల స్థాయినుండి పిల్లలందరిలో మన సంస్కృతి సాంప్రదాయాలపట్ల గౌరవం కలిగివుండేటట్లు, అదేమాదిరి ఇతరుల సంస్కృతిని కూడా గౌరవించేవిధంగా అవగాహన కలిగించడానికి వివిధ కృత్యాలు చేర్చడం జరిగింది. ప్రతి కుటుంబానికి ఒక జీవన వైవిధ్యం ఉంటుంది. అలాగే గ్రామము, ఒక ప్రాంతము, ఒక దేశానికి కూడా ప్రత్యేక వైవిధ్యము ఉంటుంది. ఇది పూలమాలలోని దారంలాంటిది. దీనిని ప్రజలు అర్థంచేసుకోవాలి మరియు వారి జీవనవిధానంలో భాగం చేసుకోవాలి. అందుకోసం ఉపాధ్యాయులు ఈ సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుతూ ముందు తరాలకు తీసుకెళ్ళే గురుతరబాధ్యతను చేపట్టాలి.


సాంస్కృతిక వైవిధ్యం - వినోదం
వినోదము
ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, విలువలు
మతం
ఆహారం
వేషధారణ
నివాసం
కళలు
పండుగలు
వృత్తులు
భాష
సాహిత్యం

# 5. సామాజిక అంశాలపై అవగాహన స్పందన

మానవుడు సంఘజీవి. పాఠశాల సమాజంలో ఒక భాగం. పిల్లలు కుటుంబంలో తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకొనే నైపుణ్యాలను అందిస్తాయి. వీటితోబాటు వృత్తి నైపుణ్యాలను కూడ పూర్వకాలంలో అందించేవి. కుటుంబం నుండి ఇరుగుపొరుగువారితో ఆడుకునే సమయంలో – సహకారము, కలిసి పనిచేయడం అందులోని ఆనందాన్ని గ్రహిస్తారు. పాఠశాల విద్యార్థులను ఒక పరిపూర్ణ సంఘసభ్యులుగా తయారుచేయడంలో తర్ఫీదునిస్తుంది. ఒక వ్యక్తి తన అవసరాలను తీర్చుకుంటూ, ఏదో ఒక వృత్తిని చేపడుతూ తన ఆర్థిక అవసరాలు తీర్చుకోవడంతోబాటు, సమాజ అభివృద్ధికి కూడా సహాయపడతారు. ఈవిధంగా సమాజంలోని సభ్యులందరి సమిష్టి ఆలోచనలే సమాజ అభివృద్ధికి తోడ్పడతాయి.

ప్రతి వ్యక్తి తన అభివృద్ధిని ఏవిధంగానైతే సమాజ సహకారం తీసుకుంటున్నాడో అదేవిధంగా ముందుతరాల అభివృద్ధికి కూడ తనవంతు సహాయ సహకారాలు సమాజానికి అందించాల్సి ఉంటుంది. అంటే సమాజ అభివృద్ధికి తనవంతు సహకారం అందించడాన్ని సామాజికస్పృహ, సామాజిక అంశాలపై స్పందన అంటాము.

ప్రస్తుతం మనం ఉన్న సమాజం యొక్క స్థితికి, ఎంతోమంది ఎన్నో తరాలనుండి, తమ ఆలోచనలను ఆచరణలో పెట్టడం వలనే ఈ అభివృద్ధి సాధ్యమైనది. ప్రతి సమాజంలో కొంతమంది సమాజ అభివృద్ధికి, మానవ సుఖసంతోషాలకు ఆటంకాలు కలిగించేవారు కూడా లేకపోలేదు. ఐనప్పటికీ సమాజము అభివృద్ధి చెందుతూనే ముందుకు పయనిస్తుంది.

విద్యార్థులకు పాఠశాల స్థాయినుండీ సామాజిక అంశాలపై స్పందించే స్పృహను కలిగించి వారిని వివిధ కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా సంసిద్ధులను చేయడమే దీని లక్ష్యము.

సామాజిక స్పృహ ఇంటినుండే మొదలవుతుంది. ఇంట్లో ఉన్న వృద్ధులకు సహాయసహకారాలు అందించడం, ఇంట్లోవుండే పెంపుడు జంతువులకు కావల్సిన నీరు, ఆహారము సమకూర్చడం, సహాయ సహకారాలకోసం ఇంటికి వచ్చిన వారికి సహాయపడటం.

పిల్లలు పాఠశాలలో చేరినప్పుడు, తరగతిలో గల, పాఠశాలలో వివిధ కుల, మత, సాంస్కృతిక నేపథ్యము నుండి వచ్చిన పిల్లలతో కలిసిమెలిసి ఉండే అవకాశం లభిస్తుంది. కావున పాఠశాల విద్యార్థులను ఒక మంచి పౌరులుగా తీర్చిదిద్దవల్సిన అవసరం ఉపాధ్యాయులమీద ఉంది. పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా కలిసి జీవించడంలో ఉండే ఆనందాన్ని విద్యార్థులు గ్రహించే విధంగా కార్యక్రమాలను నిర్వహించి సామాజిక సమస్యలపై సరియైన అవగాహనను పెంపొందింప జేయాలి.

ఇంటినుండి సమాజము వరకు – ఒక వ్యక్తి సుఖసంతోషాలతో జీవించాలంటే వ్యక్తిగతంగా మనం ఏం చేయాలి అనే అంశాన్ని విద్యార్థులతో చర్చించాలి. కుటుంబంలో ఒక వ్యక్తి ఏవిధంగా సహాయసహకారాలు అందించగలడో, అదేమాదిరి పాఠశాలలో, క్రమంగా సమాజంలో తన వంతును నిర్వర్తిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి ఏవిధంగా ఉపకరించగలడో – తెలియజేయాలి.

లింగవివక్ష నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ, లంచగొండితన నిర్మూలన, అత్యాచారాలు రూపుమాపడం, సామాజిక సంపదను పరిరక్షించుట, పర్యావరణ పరిరక్షణ; ప్రజలందరి కనీస అవసరాలు తీర్చుట; వృద్ధుల, వికలాంగుల సంరక్షణ వంటి అంశాలలో సరియైన అవగాహన కలిగి ఉండేటట్లు విద్యార్థులను తయారుచేయుట. సమాజంలో పనిచేసే వివిధ స్వచ్ఛందసంస్థలలో పనిచేసి పై కార్యక్రమాల అమలులో కృషిచేయుట.

**ఇందులోని అంశాలు :**

- తరగతిలో తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడము
- కుటుంబంలో తల్లి, దండ్రులకు పనుల్లో సహాయపడడము
- పెద్దలపట్ల గౌరవభావము కల్గి ఉండడం
- వికలాంగులు, వృద్ధులకు తనవంతు సహాయం చేయడము.
- నీరు, విద్యుత్, ఆహారము, గ్యాసు మొ॥ వాటిని పొదుపుగా అవసరమైనంత వరకే ఉపయోగించాలి. దాని గురించి విస్తృత ప్రచారము చేయడము.
- పర్యావరణ పరిరక్షణ కొరకు కృషిచేయడము తద్వారా ప్రకృతిని, వనరులను సమతుల్యంగా ఉంచడము.
- ప్రభుత్వ ఆస్తుల పట్ల పరిరక్షణకై అప్రమత్తంగా ఉండడం.
- సంస్కృతీ, సంప్రదాయాలు పరిరక్షించడానికి వాటిని ఆచరించాలి పదుగురు ఆచరించేలా చూడాలి.
- చారిత్రక కట్టడాలు సంరక్షణలో తన వంతు బాధ్యత నిర్వర్తించడం.
- భూమిలో కలిసిపోని వస్తువులు Reduse, Reuse, Recycle ద్వారా పున:వినియోగము, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం.
- పాఠశాలలో, ఇంటి దగ్గర, వీధిలో మొక్కలు నాటడం మరియు వాటిని పరిరక్షించడం.
- పై తెల్పిన అంశాలన్నింటినీ స్వయంగా ఆచరించడం ఇతరులకు ఆదర్శంగా ఉండటం.
- పునరుద్ధరింపలేని వనరులు (కొండలు, పెట్రోలు, గ్యాసు, బొగ్గునిక్షేపాలు మొ॥నవి) పై తనకు మాత్రమే కాక భావితరాలకు అవసరమని గుర్తించడం.
- పొదుపుగా వాడటానికి, అవసరానికి మించి వాడటానికి మధ్యగల తేడాను గుర్తించాలి, ఇతరులకు వివరించగలగాలి.
- సమాజము అంటే తను తన కుటుంబం మాత్రమే కాదు యావత్ ప్రపంచము కూడా, “వనరులు ఒక్కరిది కాదు అందరివి” అనే విశాల దృక్పథం అలవడాలి అప్పుడే సామిజిక అంశాల పట్ల హక్కులతో పాటుగా బాధ్యతలు మరింతగా నిర్వర్తించుటకు వీలవుతుంది.

1. తరగతి గదిలో కసువు/ చెత్త ఊడ్చటం, దానిని ఎత్తి సంబంధిత ప్రదేశంలో వేయడం.
2. ఇంటర్వెల్, భోజన విరామం సమయాల్లో తమ చుట్టూ పడ్డ చిన్న కాగితాలు ఏరి కసువుబుట్టలో వేయడం.
3. పాఠశాలలోని బోరు/కుళాయి నీరు పాఠశాలలోని మొక్కలకు పారేలా చేయడం.
4. మధ్యాహ్న భోజన సమయంలో తగినంతగా ఆహారాన్ని పెట్టించు కోవాలి, క్రిందపడిన వాటిని శుభ్రంగా తీసి కంపోస్టుగుంతలో వేయాలి.

5. ఇంటిదగ్గర తల్లిదండ్రులు, పెద్దలకు వారి పనులలో సహాయం చేయాలి.

6. వృద్ధులు, మహిళలు, పెద్దలు, వికలాంగులను గౌరవించాలి, తగు సందర్భాలలో వారికి సహాయపడాలి.

7. తమ గ్రామంలోను, పాఠశాలలోను మొక్కలు నాటడం, సంరక్షించడము చేయాలి.

8. ప్రభుత్వ ఆస్తులు (పాఠశాల, ఆసుపత్రులు మొ॥నవి) వాహనాలు, రహదారులు, సమ్మె, ధర్నాలు చేయు సందర్భాలలో ధ్వంసం చేయకుండా ఉండడం / కాపాడటం.

9. తమ ఇంట్లో వాడే ఆహారము, నీరు, విద్యుత్ మరియు ఇతర వనరులు అవసరమైనంత మేరకే వినియోగించాలి. దుబారాగా ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు.

10. అవసరం లేకున్నా ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్స్, టి.వి. మొ॥నవి ఆన్ చేసి ఉంచరాదు.

11. తమచుట్టూ ఉన్న పర్యావరణమును పరిరక్షించడములో తనవంతు పాత్ర సక్రమంగా నిర్వహించాలి.

12. భూమిలో కలిసిపోని వస్తువులు (ప్లాస్టిక్‌బ్యాగులు, వస్తువులు మొ॥నవి) బదులుగా కాగితము, బట్ట సంచులు ఉపయోగించాలి. 3Rs పాటించాలి. (Reduse, Reuse, Recycle)


13. ప్రార్థనా మందిరాలు, చారిత్రక కట్టడాలు మొ॥ వాటిని సంరక్షించుకోవాలి.

14. సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి, భావితరాలకు వాటిని అందించి కొనసాగేలా కృషిచేయాలి.

15. పునరుద్ధరించలేని వనరులు అవసరమైనంత మేరకే వాడి, భావితరాల కొరకు వాటిని మిగల్చడము అన్న భావనను పెంపొందించుకోవాలి.

16. పొదుపుకు దుబారాకు తేడా గుర్తించాలి.

17. దోచుకోవడం కంటే దాచుకొని ఇతరుల మేలుకు, వనరుల వినియోగంలో ఉన్న తృప్తిని ఆస్వాదించాలి.


సామాజిక అంశాలు - అవగాహన స్పందన
విద్యుత్ సక్రమ వినియోగం
నీటి సక్రమ వినియోగం
వనరుల పరిరక్షణ
సామాజిక సేవ
వృద్ధులు, పిల్లలు, మహిళలపట్ల సానుకూల దృక్పథం
పాఠశాలలో
గృహములో
బాధ్యతలు
సమాజంలో
తరగతిలో
పర్యావరణ పరిరక్షణ
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ
సంస్కృతి పరిరక్షణ
చట్టాలు, నియమాల పట్ల గౌరవం
హక్కులు

# 6. సమాచారము - డాక్యుమెంటేషన్

మన నిత్యజీవితంలో ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి. ఈ సంఘటనలకు, విషయాలకు సంబంధించిన సమాచారము కొన్నిరోజుల తరువాత మనం మరిచిపోతుంటాము. అయితే ఆ సంబంధిత విషయాలకు సంబంధించిన అంశాల గూర్చి తెల్సుకోవాలంటే దానికి ఆధారాలు ఉండాలి. అందుకని ముఖ్య విషయాలను అచ్చు రూపంలో అంటే కరపత్రాలు, పోస్టర్లు, బుక్‌లెట్స్, గోడపత్రికలు, ఫోటోల రూపంలో గాని మరియు వీడియోల రూపంలో కాని భద్రపరచవచ్చు.

సమాచారాన్ని డాక్యుమెంటేషన్ చేయడమనేది చాలా ముఖ్యమైన అంశము. విద్యార్థులకు ఈ అంశంలో కొంత ప్రవేశం కల్పించడం కోసం దీనిని పని విద్యలో చేర్చడం జరిగింది. ప్రతి ముఖ్యఅంశాన్ని డాక్యుమెంటేషన్ చేసినట్లైతే తిరిగి దానిని ఎప్పుడైనా తిరిగి ఉపయోగించుకోవడం కాని, దీనిని ఎవరికైనా సమర్పించడానికి కాని ఉపయోగపడుతుంది. డాక్యుమెంటేషన్‌లో కళాత్మక అంశాలకు మరియు భాషకు ప్రాధాన్యత ఉంటుంది. లేఔట్ డిజైన్‌కూ ప్రాధాన్యత ఉంటుంది.

ప్రాథమిక స్థాయినుండి విద్యార్థులకు డాక్యుమెంటేషన్‌పై ప్రత్యేకమైన తర్ఫీదు ఇచ్చినట్లైతే వారి తదుపరి జీవితంలో ఉపయోగించుకోవడానికి ఆస్కారముంది. పాఠశాలలో జరిగే చిన్న చిన్న కార్యక్రమాలకు సంబంధిత సమాచారాన్ని రికార్డు చేయడమే డాక్యుమెంటేషన్ సమాచారాన్ని ఇతరులకు తెలియజేయడం కూడ చేయవచ్చును. దీనిని వివిధ రూపాలలో అంటే నోటీసులు, కరపత్రాలు, పోస్టర్ల రూపంలో కూడ తయారుచేయవచ్చు. అయితే ఎక్కువమందికి ఆసక్తి కలిగించడానికి తక్కువ సమయంలో ఎక్కువ ప్రచారానికి. వాటి లేఔట్ డిజైన్ మరియు భాషపై ప్రభావితం చేస్తాయి.

తరగతిగదిలో జరిగే కార్యక్రమాలలో, పాఠశాలలో జరిగే కార్యక్రమాలలో – సమాచార మరియు డాక్యుమెంటేషన్ చేయడానికి విద్యార్థులకు కావల్సిన నైపుణ్యాలను కల్పించాలి.


ఏదైన కార్యక్రమం జరిగిన తరువాత దానికి సంబంధించిన విషయాలను క్రమపద్ధతిలో రాయించవచ్చు. తల్లిదండ్రుల సమావేశానికి సంబంధించిన నోటీసు తయారుచేయడం మరియు సమావేశ అంశాలను (మినిట్స్‌ను) కూడ రికార్డు చేయవచ్చు.

పాఠశాల వార్షికోత్సవ సందర్భంలో జరిగే కార్యక్రమాలలో, వీడ్కోలు సమావేశాలతో ముందుగా కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో అనే అంశాలను ముందుగా తయారుచేసుకోవచ్చును. దీనిని Agenda item అనికూడ అంటాం. కార్యక్రమాలు వివిధ వ్యక్తులు మాట్లాడిన అంశాలను కూడ రికార్డు చేయవచ్చును.

విద్యార్థుల సృజనాత్మక అంశాలకు సంబంధించిన వాటిని కూడ డాక్యుమెంటేషన్ చేయవచ్చు. విద్యార్థులు రాసిన కథలు, గేయాలు, చిత్రపటాలు, ఇతర సృజనాత్మక అంశాలను కూడ డాక్యుమెంటేషన్ ద్వారా భద్రపరచవచ్చును. గోడపత్రికలో ఉంచిన అంశాలనన్నిటిని కూడా ఒక పుస్తకరూపంలో తయారుచేసి తరగతి మాస సంచికగా కూడ విడుదల చేయవచ్చును.

విద్యార్థులు వ్యక్తిగత సమాచారం ఉ॥ తమ కుటుంబ వంశవృక్షము పటం గీచి అందరిపేర్లు సేకరించి కూడ భద్రపరచవచ్చును. ఒక గ్రామచరిత్రను, చారిత్రక విషయాలను కూడా తెలుసుకొని, డాక్యుమెంటేషన్ చేయవచ్చు. ఒక సంఘటనకు సంబంధించిన చిత్రపటాలు, పేపర్‌కటింగ్స్ కూడ ఒక పుస్తకరూపంలో తీసుకురావచ్చును. ఉ॥ ఎలక్షన్ విషయాలు, వరదలు, తుఫానులు, కరువుకాటకాల, వందేళ్ళ సినిమా, మొ॥.

డాక్యుమెంటేషన్ అనేది ప్రతి ఒకరి జీవితంలో చాలా ముఖ్యమైన అంశము. దీనిని కళాత్మకంగా చేయడం కూడా చాలా ముఖ్యమైన అంశము.


సమాచారం - డాక్యుమెంటేషన్
సమాచారం-రూపాలు
గోడపత్రిక
ప్రకటనలు
నోటీసులు
ఆహ్వానపత్రికలు
పోస్టర్లు
పాఠశాల కార్యక్రమాలు
సమావేశాలు
ఉత్సవాలు
సన్మాన సభలు
డాక్యుమెంటేషన్ రకాలు
ఎలక్ట్రానిక్
వ్రాతపూర్వక మరియు ముద్రణ
డాక్యుమెంటరీ అంశాలు
కుటుంబపరమైన
సంస్కృతి పరమైనవి
సామాజిక, సాంఘిక పరమైనవి
పరిసరాలు

# 7. వస్తువులు - నమూనాల తయారీ

వస్తువులు – నమూనాల తయారీ ద్వారా పిల్లలో సృజనాత్మకత పెంపొందించటం, వ్యర్థపదార్థాల నుండి వస్తువులు తయారు చేయుటం, తక్కువ ఖర్చుతో రోజువారీ వస్తువులు తయారుచేయటం, విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తిని పెంపొందించడం వారిలోని నైపుణ్యాల ప్రదర్శనకు, ఇతరుల నైపుణ్యాన్ని ప్రశంసించుటకు, పనిచేసేటప్పుడు పనిలో నిమగ్నమవడం ద్వారా ఏకాగ్రతను పెంపొందించడం, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ మొదలైనవి అభివృద్ధి చేయడానికి ఉద్దేశించబడినది.


ఈ అంశంలో చేసే కార్యక్రమాలన్ని కూడా పిల్లలకు వ్యక్తిగతంగాను, ఆర్థికంగాను, సామాజికం గాను, పర్యావరణ పరిరక్షణకు మరియు నైపుణ్యాలు మెరుగుపరచుకొనుటకు సహాయపడతాయి. అలాగే భవిష్యత్తులో తామెంచుకునే రంగానికి పునాదిగా ఉపయోగపడతాయి.

**కృత్యాలు :**

- మట్టితో విద్యార్థులు వంటపాత్రలు, జంతువులు, వ్యవసాయ పనిముట్లు, మనుషుల బొమ్మలు, దేవతలు, ప్రదేశాల నమూనాలు తయారు చేయవచ్చు.
- అంకెలు, అక్షరాలతో రకరకాల పదాలు, అంకెలు, ఆకారాలు తయారుచేయవచ్చు. పిల్లలతో వాటిని గుర్తింపచేయడంతో పాటు ఇతర ప్రక్రియలు చేయవచ్చు.
- కాయలు, గింజలతో వివిధ ఆకారాలు తయారుచేయవచ్చు, కొన్నిరకాల అలంకరణ సామాగ్రి తయారుచేయవచ్చు.
- కాగితంతో పడవలు, దుస్తులు, ఆటవస్తువులు, పెన్‌స్టాండు, కాఫీ కప్పులుతో దండలు, ద్వారానికి మాలలు మొ॥నవి తయారుచేయవచ్చు.
- వాడిపారేసిన వ్యర్థాలతో, ప్లాస్టిక్ డబ్బాలతో పూలకుండీలు, వాటర్ బాటిల్స్‌లో మట్టినింపి చిన్న చిన్న గోడలు, మొక్కలు, చెట్ల చుట్టూ రక్షణ గోడలు నిర్మించవచ్చు.
- పిల్లలు కుట్లు, అల్లికలు నేర్చుకోవడం ద్వారా వైరు బుట్టలు, బట్ట సంచీలు, కిటికీల ద్వారాలకు రకరకాల తోరణాలు, దుస్తులపై అలంకరణలు చేయవచ్చు.
- చిన్న చిన్న చిరుగులు, కుట్టుకోవడం, గుండీలు కుట్టుకోవడం తమ స్కూలు బ్యాగులు కుట్టుకోవడం.
- రంగుకాగితాలతో వివిధ ప్రత్యేక దినములు / సందర్భములలో గృహము / పాఠశాలను అలంకరించుటకు కాగితాలను కత్తిరించుట ద్వారానూ, అలంకరించుట ద్వారా శోభను తీసుకు రావచ్చు.
- అగ్గిపుల్లలు, బెండు, సైకిల్‌వాల్వ్‌తో రకరకాల ఆకృతులు పిల్లలకిష్టమైనవి పండ్లు, వాహనాలు, బొమ్మలు తయారుచేయవచ్చు.
- పగిలిన చేతిగాజులు వేడిచేసి అతికించుట ద్వారా ద్వారముల అలంకరణకు కోడిపుంజు, మనిషి మొ॥ ఆకారాలు పేర్చి అతికించవచ్చు.
- అలాగే డోర్‌మ్యాట్స్, రాఖీలు, పూలదండలు, బొకేలు కూడా వ్యర్థపదార్థాలు, ఆకులు, పూలు ఉపయోగించి తయారుచేయవచ్చు.

- క్యాండిల్సు, వ్యాజిలిన్, చాక్‌పీసులు మొ॥నవి తయారు చేయవచ్చు.
- బైండింగ్, ప్యాడ్లు తయారీ, అట్టలు తయారీ, కవర్లు తయారీ చేయవచ్చు.
- ఈ విధంగా వ్యర్థాల నుండి అర్థవంతమైన వస్తువులు, నమూనాలు తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో క్రింది అంశాలు అభివృద్ధి అవుతాయి.

1. సృజనాత్మకత
2. ఆనందము
3. సంతృప్తి
4. పర్యావరణ పరిరక్షణ
5. ఆర్థిక స్వావలంబన
6. జట్టు భావన
7. నాయకత్వ లక్షణాలు
8. ఏకాగ్రత
9. సంస్కృతి పరిరక్షణ


వస్తువులు - నమూనాల తయారీ
ఆకృతులు
కాగితాలతో
వేలిముద్రలతో
అంకెలు, అక్షరాలతో
బంకమట్టితో
అలంకరణ వస్తువులు
పూలదండలు
డోర్‌మ్యాట్స్
రాఖీలు
పదార్థాల తయారీ
వ్యాజిలీన్ తయారీ
క్యాండిల్స్ తయారీ
కుట్లు, అల్లికలు
చిరుగులు కుట్టుకోవడం
గుండీలు కుట్టడం
బుట్టలు, మంచాలు
వాడిన/వ్యర్థపదార్థాల నుండి వస్తువుల తయారీ
కాగితాలతో కవర్లు
ప్లాస్టిక్ డబ్బాలతో పూలకుండీలు

# 8. గృహయాజమాన్యం

ఒక వ్యకిగానీ లేక ఒక వ్యవస్థగానీ తమ దగ్గరున్న వస్తువులను, వసతులను, వనరులను ఒక క్రమమైన పద్ధతి/ మార్గంలో అమర్చుకొని, నిర్వహించి వినియోగించుకున్నప్పుడే, నిర్వహణ మరియు ఆచరణాత్మక క్రియావిధానంలో ఎటువంటి వృధా లేకుండా సకాలంలో తమ లక్ష్యాలను పనులను నిర్వర్తించుకొనగల్గుతారు. ఇలా చేయబడే, నిర్వహించబడే విధానాన్ని 'యాజమాన్యం' (Management) అని అంటారు. యాజమాన్యం అనేది ఒక వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి, దేశానికి సంబంధించినది కావచ్చు.

- మనకు అందుబాటులోఉన్న నీటిని వృధాకాకుండా, మన అవసరాలన్నీ నెరవేర్చుకునే విధంగా నీటిని సద్వినియోగం చేస్తే దాన్ని 'నీటి యాజమాన్యం' (Water Management) అని అంటాం.

- అలాగే మన ఇంటిలోని వస్తువులను, వనరులని సక్రమముగా అమర్చుకొని, ఎక్కడా ఎలాంటి వృధా లేకుండా, మన పనులు చక్కగా, సక్రమంగా నిర్వహించుకోగల్గినట్లు మన ఇంటిలోని ప్రతిఒక్కరు వారి వారి పనులు చేసుకొనగల్గినట్లయితే దాన్ని 'ఇంటి యాజమాన్యం' (House Management) అని అంటాము.

- మన గృహనిర్వహణలో కొన్ని రకాల అంశాలు ప్రధానంగా చోటుచేసుకుంటాయి. అవి ఉదా:

  ఆర్థిక యాజమాన్యం Financial Management

  భౌతిక యాజమాన్యం Physical Management

  సాంఘిక యాజమాన్యం Social Management

  భావావేశ యాజమాన్యం Emotional Management

**ఆర్థిక యాజమాన్యం (Financial Management)**

ఒక కుటుంబయజమాని తన ఆదాయంలో ఏ యే పనులకు, ఏ యే అవకాశాలకు, ఎంతెంత ఖర్చుపెడుతుంటాడు, వివిధ అంశాలు, అవసరాలపై చేసే ఖర్చుల పట్ల విశ్లేషణాత్మక వివరణ అవగాహన కల్గియుండాలి. అప్పుడే అందులోని లోటుపాట్లను సరిచేసుకొని ఆ ఇంటి యజమాని విజయవంతంగా గృహనిర్వహణా బాధ్యతను నిర్వహించగల్గుతాడు. ఇలాంటి విషయాలపై పిల్లలకు కూడ అవగాహన కల్పించడం అవసరం.

**భౌతిక యాజమాన్యం (Physical Management)**

ఇంటిలోని వస్తువులు, వనరులు, అందరికి సరిపోయే విధంగా, అందరు సమానంగా పంచుకోవాలి! అందరి అవసరాలు తీరేవిధంగా ఉపయోగించుకోవాలి.

## సాంఘిక యాజమాన్యం (Social Management)

అందుబాటులో ఉన్న సాంఘిక, సామాజిక అంశాలలో సమర్థవంతంగా పాల్గొని వ్యక్తిగత లక్ష్యాలను మరియు సామాజిక లక్ష్యాలను సాధించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించగల్గితే దాన్ని Social Management సాంఘిక యాజమాన్యం అంటారు.


## భావావేశ యాజమాన్యం (Emotional Management)

ఒక ఇంటిలోని ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పరం కోపంతో ఘర్షణలు చోటుచేసుకుంటాయి. ఆ సందర్భంలో ఎవరైనా మూడవవ్యక్తి ఆ సన్నివేశంలో ప్రవేశించి ఆ తగువును పరిష్కారం చేయవలసి ఉంటుంది. కోపావేశాలు మితిమీరిపోతే కుటుంబ ఐకమత్యంకు అనేక విపరీతాలకు దారితీస్తాయి. అలాగే కుటుంబం బయట విషయాల్లో కూడా భావావేశ సమతుల్యం పాటించవలసి ఉంటుంది.

## గృహయాజమాన్యం (HomeManagement)

సాధారణంగా మన ఇళ్ళల్లో నిత్యం మనం వాడుకునే ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్ మరియు గృహోపకరణ వస్తువులు చెడిపోతుంటాయి. వాటిని రిపేర్‌చేయవలసి ఉంటుంది. అలాంటి చిన్న చిన్న రిపేర్స్ కూడా మనం స్వయంగా చేసుకొనలేక ఇతరులపై ఆధారపడవలసి ఉంటుంది. అది కేవలం నిస్సహాయులకు నిదర్శనం. కానీ అలాకాక మన ఇంటిలో చెడిపోయిన చిన్న చిన్న వస్తువులను మనం రిపేర్ చేసుకోగల్గితే మనం హాయిగా స్వయంప్రతిపత్తితో బ్రతకగల్గుతాము. సమయాన్ని, డబ్బును, శ్రమని ఆదా చేసినవారమవుతాము. కరంటు ఫీజు పోవడం, స్విచ్‌లు బిగించడం, నీటి కుళాయి వదులు (లూజు) అయితే బిగించడం, లేకపోతే మనం చేయదగిన విధంగా చిన్న చిన్న రిపేర్‌లు ఏమైనా వస్తే వాటిని మనమే చేసుకొనగల్గితే, ఎంత బాగుంటుంది. అందుకు అవసరమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ప్లంబింగ్ కిట్టులకును ప్రతి ఒక్కరు తమ ఇంటిలో మెయింటేన్ చేయగల్గితే ఎటువంటి రిపేరు వచ్చిన మనమే స్వయంగా, సులభంగా చేసుకొనగల్గుతాం.

అంతేగాక, మన ఇంటిలోని వస్తువులను, దుస్తులను, అలంకరణాత్మక వస్తువులను, పుస్తకాలను, చెప్పులను ఇతర వస్తువులను సక్రమంగా వరుసక్రమంలో స్థలం వృధా కాకుండా అమర్చుకొనుట అలవాటు చేసుకోవాలి. అలాగే వంట ఇంటిలోని ఇతర వస్తువులు, బెడ్‌రూమ్, స్టోర్ రూములోని వివిధ రకాల సామగ్రిని, ఎవరికి సంబంధించిన సామగ్రిని వారు వారు స్థలం వృధా కాకుండా, అలంకరణాత్మకంగా, ఆకర్షణీయంగా అమర్చుకొనగలిగే నైపుణ్యాల్ని మనం అలవరచుకొనడం. మన పిల్లలకు నేర్పించడం ఎంతైనా అవసరం. అప్పుడే ఇల్లు పరిశుభ్రంగా, అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. అందుకు మనం ఏమి చేయాలి? అందుకు కావలసిన నైపుణ్యాల్ని మన పిల్లల్లో పెంపొందించడం ఎలా? ఆలోచించండి. మార్గాలను అన్వేషించండి.



గృహయాజమాన్యము
ఇంటి బడ్జెట్
ఇంటి ఆదాయం తెలుసుకోవడం
ఖర్చు వివరాలు
విద్యుత్ బల్బు అమర్చడం
గృహోపకరణాల మరమ్మత్తులు
ఇల్లు-పనిముట్లు వాడకం - భద్రత
చాకును ఉపయోగించడం
కత్తెర ఉపయోగం
ఇల్లు, పరిసరాల శుభ్రత
ఇల్లును శుభ్రంగా ఉంచడం
పరిసరాలలో చెత్తవేయకుండా ఉండడం
ఇంట్లో వస్తువుల అమరిక
ఇంట్లో వస్తువులను వాడిన తర్వాత సరియైన స్థానంలో పెట్టడం
మొక్కల పెంపకం
మొక్కలను కుండీలలో పెంచడం
కుండీలు తయారుచేయడం
వనరుల వినియోగం
విద్యుత్తు వృధాను అరికట్టడం
నీటి సద్వినియోగం
ఇంటిభద్రత
డాబాపై నీరు నిలువ ఉండకుండా చేయడం
గోడలపై పిచ్చి రాతలు రాయకుండా ఉండడం

# 9. వినియోగదారుల విజ్ఞానము

ఒక వ్యక్తి ఏదేని ఒక వస్తువును కాని ఉత్పత్తులను కాని కొన్నప్పుడు అతనిని 'వినియోగదారుడు' అని అంటారు. వినియోగదారుడికి తాను కొన్న వస్తువుయొక్క ధరకు తగినటువంటి పరిమాణము, నాణ్యత, ఆ వస్తువు సక్రమంగా పనిచేయుకాలము లాంటి విషయాలను తెలుసుకునే హక్కు ఉంటుంది. ఆ ఉత్పత్తి తయారుచేసి మార్కెట్‌లోనికి వదిలిన ఉత్పత్తిదారుడు, వినియోగదారుడుకి బద్ధుడై, సమాధానపరుడై ఉంటాడు. ఉత్పత్తిదారుడు ఒక ఉత్పత్తిని తయారుచేసి ప్యాకింగ్ చేసిన తరువాత ఆ పాకెట్‌పై ఆ వస్తువు లేదా ఉత్పత్తి యొక్క ఖచ్చితమైన ధర (ఎమ్.ఆర్.పి.), బరువు, తయారుచేసిన తేది, ఆ ఉత్పత్తులను ఎంతకాలం వరకు వినియోగించుకోవచ్చు మరియు ఉత్పత్తిదారుని యొక్క వివరములు, ముద్రించబడి ఉంటాయి.

ఉత్పత్తులు లేక వివిధరకాల సేవలకు సంబంధించిన అంశాలలో కూడ వినియోగదారునికి హక్కులు ఉన్నాయి. ఉదా॥ వైద్యసేవలు, బ్యాంకుసేవలు, విద్యాసంస్థల సేవలు, వివిధరకాల ప్రభుత్వసేవలు అంటే టెలిఫోన్, కరెంట్ మొదలైనవి.

అలాగనే, ఒక వినియోగదారుడు కూడ, మార్కెట్‌లో ఏదేని ఒక ఉత్పత్తిని (వస్తువు) కొనేటప్పుడు దాని పాకెట్‌పైన ఉన్న వివరములన్ని చదువుకుని, కనుక్కొనవలసిన అవసరం బాధ్యత తనపై ఉంటుంది. పై వివరాలను తెలుసుకొని తాను సంతృప్తిపడిన తర్వాత ఆ వస్తువును కొనుక్కునే అవసరముంది. అలా కొనుక్కొన్న తర్వాత ఉత్పత్తికి సంబంధించిన విషయాలలో ఏమైన పొరపాటు జరిగిన వినియోగదారుడు, ఉత్పత్తిదారుడిని చట్టరీత్యా ప్రశ్నించే హక్కు ఉంటుంది. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు ఒక వ్యవస్థ ఉంటుంది. దాన్నే 'వినియోగదారులఫోరమ్' (Consumer form) అని అంటారు. వినియోగదారుడు, ఏదేని ఒక వస్తువును (ఉత్పత్తిని) కొన్న తర్వాత, దానియొక్క ఖచ్చితమైన ధర (ఎమ్.ఆర్.పి.) లో తేడా ఉన్న లేక దాని పరిమాణం, బరువు, గుణము లాంటి విషయాల్లో తేడావున్న (లేక) ధరకు తగ్గ విలువ దానిలో లేకపోయినా ఆ ఉత్పత్తి సక్రమంగా ఉపయోగపడకపోయినా లేక పనిచేయలేకపోయిన, లేక నిర్దేశిత కాలం కన్నా ముందే ఆ ఉత్పత్తి నిరుపయోగమైన అలాంటి విషయాలపైన మోసపోయిన, ఏదైనా సేవలు అనుకున్నప్రకారం అందకున్న వినియోగదారుడు న్యాయంకోసం, వినియోగదారుల ఫోరంకు రిపోర్టుచేసే అవకాశం, హక్కు కల్గివుంటాడు. వాస్తవాలను విచారించిన తర్వాత వినియోగదారులు ఫోరమ్ ఉత్పత్తిదారుడిపై తగు క్రమశిక్షణ చర్య తీసుకొని, వినియోగదారుడికి, ఉత్పత్తిదారుడిని బద్ధుడనుచేసి, వినియోగదారునికి మేలు, సాయంచేసే అవకాశం ఉంది. ఈ విషయం ఏదేని ఒక వస్తువు, ఉదా: టూత్‌పేస్ట్ దగ్గర నుంచి, అన్ని రకాల కాస్మోటిక్స్, మందులు (మెడిసిన్) ఎలక్ట్రానిక్ పరికరములు, వాహనములు ఏదేని ఇతర దైనందిన అవసరాల అన్నింటిపైన వర్తిస్తుంది. ఇలాంటి వినియోగదారుల ఫోరమ్, ముఖ్యమైన పట్టణములలో, జిల్లా కేంద్రాలు మరియు రాష్ట్ర కేంద్రాలలో ఉంటాయి. దాని చిరునామా వివరాలను తెలుసుకొని దాని సేవలు వినియోగదారుడు పొందవచ్చును. అందుకని ప్రతి వస్తువు తాను మార్కెట్‌లో కొనుక్కునే మునుపు ఉత్పత్తికి సంబంధించిన విషయాలు, వివరాలు తెలుకొనవలసిన అవసరముంది. అందుకు సంబంధించిన నైపుణ్యాలను, వినియోగదారుడు పెంపొందించుకొనవలసిన అవసరం ఉంది. వీటిని ఎలా పెంపొందించాలి. సామాన్య ప్రజలకు ఈ విషయాల గురించి అవగాహన ఎలా కల్గించాలి?



వినియోగదారులు - విజ్ఞానము
కొనుగోలులో ప్రాధమ్యాలు (Priorities)
కనీస అవసరాలు
విలాసవంతము
వినియోగదారులు హక్కులు
గడువు తేదీ
బరువు
ధర
కొలత
కల్తీ
విజయగాథలు
T.V/వార్తాపత్రికలు
స్థానిక ఉదాహరణలు
నాణ్యతా ప్రమాణాలు
ISI మార్కు
AGMARK
మోసపోయే సందర్భములు
కల్తీలు
పేరులో మోసాలు
పరిమాణము
ఒకటి చూపి ఇంకొకటి ఇవ్వడం

# 10. పర్యావరణ విద్య

ప్రకృతిలోని పంచభూతాలతో (గాలి, నీరు, నేల, వేడి, ఆకాశం, వాతావరణంలోను) మన నివాసం, మనచుట్టూ ఉండే పరిసరాలు, మన బడి, బడి చుట్టుపక్కల ఉండే పరిసరాలు, అలాగే మన గ్రామం, మండలం, జిల్లా, దేశం, చెట్లు, జంతువులు, పశుపక్షాదులు, కొండలు, నదులు, సముద్రాలు ఒకటేమిటి ఇవి అన్ని కలిపితే మన పర్యావరణం అంటాం.

మానవ జాతికి భూమి, నీరు, గాలి అనే మూడు ముఖ్యవనరులు అందుబాటులో ఉంటాయి. జనాభా, వనరులు, పర్యావరణం మధ్య పరస్పర సంబంధాలు చాలా క్లిష్టమైనవి. పెరుగుతున్న జనాభా మౌలికావసరాలను తీర్చడం అనేది ఆరోగ్యమైన పర్యావరణం మీద ఆధారపడి ఉంటుంది.

పర్యావరణం మానవ ఉనికికి, జీవనానికి మాత్రమే కాదు, అభివృద్ధికి కూడా మూలాధారం. అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమస్త ముడిపదార్థాలేకాక (ఖనిజాలు, వృక్ష జంతు ఉత్పత్తులు), అవసరమైన సేవలు (వర్షపాతం, నేలలోని పోషకాలు, గాలి పునరుద్ధరణ) పర్యావరణం నుంచే అందుతాయి.

ఒక దేశం లేదా ప్రాంతం యొక్క అభివృద్ధి గురించి చెప్పాలన్నా అంచనా వేయాలన్నా అక్కడి రోడ్లు, కట్టడాలు, డ్యామ్‌లు, పరిశ్రమలు, ఉద్యోగ, వ్యాపార అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటారు. వీటివల్ల వస్తువు, సేవల ఉత్పత్తి, సరఫరా సాధ్యమవుతుంది. దేశ ఆర్థికసంపదను పెంచుతాయి. కానీ మధ్యకాలంలో ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలపై నిరసనలు కానవస్తున్నాయి. ఈ కార్యక్రమాలు, పర్యావరణంలోని వనరులను అధికంగా వెలికితీయడమేకాక హానికరమైన పదార్థాలను విడుదల చేస్తున్నాయి.

ఉత్పత్తి, సేవల వినియోగం అధికం కావడాన్ని, కట్టడాలను, నిర్మాణాలను అభివృద్ధిగా పరిగణిస్తున్నారే తప్ప, సహజవనరుల సంరక్షణను, మెరుగుదలను, దానికి అవసరమైన అవగాహన కల్పించడాన్ని అభివృద్ధికి అవసరమైన ఒక ముఖ్య అంశంగా గుర్తించడంలేదు. పర్యావరణం క్షీణించిపోవడం లేదా కలుషితం కావడం వంటి వాటిని భవిష్యత్తులో అభివృద్ధిని కుంటుపరిచేవిగా పరిగణించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా నేడు గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర తరిగిపోవడం, జీవన వైవిధ్యం అంతరించపోవడం వంటి పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నాం. అంతేకాక గాలి, నీరు, నేల కాలుష్యం, నేలకోత, ఆవాసలు దెబ్బతినడం వంటి స్థానిక సమస్యలు ప్రజల్ని సతమతం చేస్తున్నాయి. కావున పర్యావరణం, ఆవాసాలు, పర్యావరణ సమస్యలపై అవగాహన కల్గించుటకు; పర్యావరణ సమస్యలు – అభివృద్ధి సమస్యలు రెండు విభిన్నంకావని, రెంటికి మధ్యగల సంబంధాన్ని గుర్తించేలా, విద్యార్థులకు 9, 10 తరగతులలో పనివిద్య – ప్రధానాంశం.

ప్రకృతి రీత్యా మారే ఋతువులు, కాలాలను బట్టి పెరిగే వృక్షాలు, సహజంగా ఉండే నదులు, సముద్రాలు, కొండలు వేటికవే ప్రత్యేక లక్షణాలను కల్గిఉంటాయి. పర్యావరణంలో మనుగడ సాగించే జీవులన్నీ సమతుల్యాన్ని పాటిస్తాయి. కాని మనిషి తాను చేసే స్వార్థపూరిత పనులవల్ల పర్యావరణాన్ని కాలుష్యపరుస్తున్నాడు

మన పాఠశాల, నివసించే ఇల్లు, చుట్టుపక్కల ప్రదేశాలు, గ్రామాన్ని పరిశీలించినట్లయితే మనమేవిధంగా ఆహ్లాదకర వాతావరణం కల్పించగలమో చూడవచ్చు. మొక్కలను పరిరక్షించడం, మొక్కలను పెంచడం, పెరటితోట ఏర్పాటు, గ్రామాలలో కొంత స్థలాన్ని ఉద్యానవనాభివృద్ధికి, పట్టణాలలో కొన్ని కూడళ్ళలో చెట్ల పెంపకం చేపట్టడం వంటివి.

మన పాఠశాలలోని ఆవరణలో చెట్లను పెంచడం, వర్షాకాలంలో కొత్త మొక్కలను నాటడం, విత్తనాలు జల్లడం వంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా పాఠశాల చూడముచ్చటగా ఉండడమేకాక చల్లని గాలిని ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తుంది. పిల్లలు బడికి రావడానికి ఆనందంగా, ఆహ్లాదకరంగాను ఉండే వాతావరణంలో ఆకర్షితులౌతారు.

బడితోట పెంపకంలో తీసుకునే సోపానాలు, జాగ్రత్తలు మెలకువల గురించి విద్యార్థులకు తెలియజేయాలి. బడి ఆవరణలో ప్రహరీ చుట్టూ వేసే పెద్ద మొక్కలు వాటిని పశువుల బారినుండి రక్షించడానికి కంచె ఏర్పాటు చేయడం. నీటిపారుదల ఏర్పాటు వంటివి విద్యార్థులకు చెప్పాలి. ఏ ఏ మొక్కలను పెంచాలో నిర్ణయించుకోవాలి. బడి ప్రారంభంనుండి బడి మూసివేసే రోజు వరకు విద్యాసంవత్సరంలో బడితోటకు చేపట్టవలసిన కార్యాచరణాన్ని పూర్తిచేయాలి.

## పర్యావరణం - కాలుష్యం

"ఉండకూడని పదార్థం ఉండకూడని పరిమాణంలో ఉండకూడని చోటులో ఉండడమే కాలుష్యం"

గాలి, నీరు, శబ్ద కాలుష్యాలతో మన నిత్యజీవితంలో అనేక బాధలు పొందుతున్నాం. ఆరోగ్యం పాడవుతుంది. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులలో ఆహార పదార్థాలను ఉపయోగించిన తర్వాత బయట చెత్తలో వేసినప్పుడు పశువులు వాటిని నేరుగా తీసుకోవడంవల్ల, వాటి జీర్ణాశయంలో ప్లాస్టిక్ పేరుకుపోయి అంతరాంగ వ్యవస్థ పాడైపోయి వాటి మరణానికి కారణమవుతుంది.

అలాగే భూమిలో పడవేసిన ప్లాస్టిక్ పదార్థాలు ఎంతోకాలం వరకు అలాగే ఉండడంవల్ల భూమిపై ప్లాస్టిక్ గుట్టలు గుట్టలుగా పేరుకుపోతుంది. మురుగునీటి కాల్వలలోను, మంచినీటి చెరువుల్లోను ఇవి చేరి నీటి ప్రవాహానికి ఆటంకపరుస్తాయి. ముంపులు వస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించని ప్లాస్టిక్ వస్తువులలో నిల్వచేసిన ఆహారపదార్థాలు విషపూరిత రసాయనాలతో కలుస్తాయి. వ్యర్థపదార్థాలను మరల మరల శుద్ధిచేసి ఎరువుల రూపంలో వాడేటట్లుగా ప్లాస్టిక్ వినియోగపడదు.

ప్లాస్టిక్ వినియోగించకపోవడమే దీనికి పరిష్కారం. క్రమానుగత చర్యల ద్వారా భూమిలో కలిసిపోయే వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. నిరాడంబరంగా జీవించడం, పొదుపుగా వస్తు వినియోగం చేయాలి. వస్తూత్పత్తులు పెంచాలి. వాడిన వాటిని వేరొక రూపంలో మార్చుకునే ప్రక్రియలు చేయాలి.

## మనమేం చేయాలి?

చెట్లను పెంచడం, వేసుకునే దుస్తుల్లో మార్పులు, ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవడం, సముద్ర తీర ప్రాంతాల్లో అడ్డుకట్టలు, గోడలు మొదలైనవి నిర్మించడం ద్వారా వాతావరణ వైపరీత్యాల నుండి రక్షణ. తుఫాను / వరదల హెచ్చరిక వ్యవస్థను మెరుగుపరచడం, మారుతున్న ఋతువులకు అనుగుణంగా పంటలను పండించడం. జంతువులు, పక్షులు అనుకూలమైన ప్రదేశాలకు వలస వెళ్ళడానికి వీలుగా ఆ మార్గాలను సంరక్షించడం, మెరుగుపరచడం, నీటిని సమర్థవంతంగా వినియోగించడం ప్రత్యామ్నాయ నీటి వనరుల కొరకు ప్రయత్నం చేయడం, సాంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగించుకోవడం.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలో ఈక్రింది కార్యక్రమాలు నిర్వహించాలి.

## బడితోట

ఒక్కొక్క సోపానంగా పనులు చేసుకోవాలి. ముందుగా స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసిన స్థలాన్ని తవ్వి గుల్ల బారేటట్లు చూసుకోవాలి. విత్తనముల సేకరణ, నేలను దున్నిన ప్రాంతాన్ని మడులుగా చేసుకోవాలి. ప్రతి మడిలోను కావలసిన నారు వేసుకోవాలి. వచ్చిన నారును సిద్ధంచేసిన మడిలో నాటుకోవాలి. వేర్వేరు నారులకు వేర్వేరు ప్రాంతాలను ఎన్నుకోవాలి. ఆ మొక్కలను సురక్షితంగా ఉంచడం కోసం కలుపు మొక్కలు లేకుండా చూడాలి. ఏపుగా బలంగా పెరగడానికి సహజసిద్ధమైన ఎరువులను వాడాలి. సేంద్రియ ఎరువులకొరకు కంపోస్టు ఎరువును బడిలోనే సిద్ధం చేసుకోవాలి. అటవీశాఖ ఉద్యానవన విభాగం వారి ఉచిత మొక్కల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి. పూలు, కాయలు ఇచ్చే మొక్కల సంరక్షణ బాధ్యతను ప్రతి తరగతి విద్యార్థిని / విద్యార్థులకు జట్లుగా నియమించి నిర్వహింపచేయాలి. నీటిని పారించడానికి, నీటిని పోయడానికి కూడ విద్యార్థి జట్టు కృత్యంగా చేయాలి.


వారానికి ఒక తరగతికి కేటాయించిన కాలనిర్ణయ పట్టిక ప్రకారం బాధ్యతలను ప్రతి ఒక్క తరగతి విద్యార్థి చేసేటట్లు చూడాలి. ఏ తరగతి వారికి ఏ మొక్కల బాధ్యత పెట్టారో ఆయామొక్కలు ఉన్న ప్రదేశానికి ఆ తరగతిపేరు, విద్యార్థిపేర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలి. అంటే విద్యార్థులు తరగతి వారీగా జట్లలో ప్రతి మొక్కను దత్తత తీసుకునేటట్లు ప్రణాళికను రూపొందించుకోవాలి. ఆయా తరగతి ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో ఈ తోటపని నిర్వహణ ఉండాలి. నీటి పారుదల కొరకు బడిలో బోరింగు ఏర్పాటు / నీటితొట్టె / మున్సిపల్ వాటర్ వచ్చే ఏర్పాటును కల్పించుకోవాలి. నీటి గొట్టాల ద్వారా మొక్కలకు నీరు అందేటట్లు చూడాలి, బడి పని దినములలో విద్యార్థులు చేసే పనులకు తరగతి నాయకుణ్ణి నియమించాలి. బడి సెలవు దినాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవడం తప్పనిసరి. సెలవులలో బడి చుట్టుపక్కల, బడికి దగ్గరగా గల విద్యార్థులను ఈ పనిని అప్పచెప్పడం, గ్రామాలలోని కొంతమంది యువకులకు యువజన సంఘాలద్వారా బాధ్యతనివ్వడం. సమాజ భాగస్వామ్యంతో ఈ తోటపని నిర్వహణ నిర్విఘ్నంగా కొనసాగగలదు.

## కంపోస్ట్ ఎరువు తయారి:

బడిలో వచ్చే చెత్తను వినియోగించి కంపోస్ట్ ఎరువు తయారుచేయవచ్చు.

తరగతిగదిని పరిశుభ్రంగా ఉంచడంలోను, పాఠశాల ఆవరణను శుభ్రంచేయడంలోను తడి, పొడి చెత్తలు ఉంటాయి. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి, బడిలోని ఒక మూల ఆవరణలో గోతిని తవ్వి తడిచెత్తను అందులోవేసి మట్టిపొరవేసి, మరల చెత్తను, మట్టిపొరను కప్పి ఉంచుతూ గోతిని మట్టితో కప్పివేసినట్లయితే కొద్దికాలానికే అది కుళ్ళి సహజమైన ఎరువుగా మారుతుంది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగానే ముందుగా మన బడిలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన మరుగుదొడ్డిలో నీటివాడకం, పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలి. మురుగు ప్రదేశాలలో డి.డి.టి. వేయడం. దోమలు పెరగకుండా మురుగు కుంటలలో కిరసనాయిలు జల్లడం వంటివి చేయాలి.



పర్యావరణం
సహజ వనరులు
నేల
నీరు
గాలి
వృక్షాలు
కాలుష్యం
నేల కాలుష్యం
జల కాలుష్యం
వాయు కాలుష్యం
పర్యావరణ పరిరక్షణ
మొక్కలు నాటుట
ప్లాస్టిక్ వినియోగం తగ్గించుట
నీటిని పొదుపుగా వాడుట
జంతు సంరక్షణ
పర్యావరణ మార్పు-ప్రభావం
ఋతువు మార్పులు
అనారోగ్యం

# 3వ తరగతి

# పౌష్టికాహారం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆహారపదార్థాల – సేకరణ – వర్గీకరణ |
| **కృత్యము** | : | ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు మొదలగు ఆహారపదార్థాలను సేకరించడం, వర్గీకరించడం, ప్రదర్శించడం. |
| **సేకరించవలసిన ఆహారపదార్థాలు** | : | ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు మొదలగునవి. (స్థానికంగా లభించేవి) |
| **ఆశించిన ఫలితం** | : | ✤ సేకరించిన వివిధ ఆహారపదార్థాల పేర్లను చెప్పగలరు.<br>✤ విద్యార్థులు సేకరించిన ఆహారపదార్థాలను ఆకుకూరలు, కూరగాయలు, పండ్లుగా వర్గీకరించగలుగుతారు.<br>✤ స్థానికంగా లభించే, ఉపయోగించే వివిధ ఆహారపదార్థాల పట్ల అవగాహన కలుగుతుంది. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ స్థానికంగా తినే ఆహారపదార్థాల శాంపిల్స్‌ను తీసుకొని రమ్మని చెప్పడం. విద్యార్థులు వ్యక్తిగతంగాగాని, జట్లవారీగా గాని తీసుకుని రావచ్చు.<br>◆ ఆధారపదార్థాల వర్గీకరణ, ప్రదర్శన సమయంలో ఉపాధ్యాయుడు సహాయకారిగా వ్యవహరించడం. |
| **కృత్య విధానము** | : | ❖ వ్యక్తిగతంగాగాని, జట్లుగాగాని విద్యార్థులు సేకరించిన వివిధ ఆహార పదార్థాలను ఒకచోట ఉంచాలి.<br>❖ తరువాత, వాటిని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లుగా వర్గీకరించాలి.<br>❖ ఆయా ఆహారపదార్థాల పేర్లను రాసి ప్రదర్శించాలి.<br>❖ విద్యార్థులతో, ఆహారపదార్థాలపేర్లను చదివించడం మరియు రాయించడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. సేకరించి, వర్గీకరించిన ఆహారపదార్థాలు – కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మధ్యగల వ్యత్యాసాలేమిటి?<br>2. ఏఏ సీజన్లలో / కాలాలలో ఏఏ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు లభిస్తాయో జాబితా రాయండి. |
| **అదనపు కృత్యము** | : | 1. వివిధ ఆహారపదార్థాలు – ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల చిత్రపటాలను వ్యక్తిగతంగా గాని / జట్లుగా గాని సేకరించి స్క్రాప్‌పుస్తకం తయారు చేయించడం.<br>2. వంటగదిలో వాడే ముఖ్యమైన వంటపాత్రల పేర్లు చెప్పించడం. |

# ఆరోగ్యవిద్య

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | పారిశుధ్యం - వ్యక్తిగత శుభ్రత |
| **కృత్యము** | : | వ్యక్తిగత శుభ్రతను గురించి తెలుసుకోవడం మరియు పాటించడం |
| **ఆశించే ఫలితము** | : | ❖ శరీరభాగాలను పరిశుభ్రంగా ఉంచుకుంటారు.<br>❖ పరిశుభ్రత ఆవశ్యకతను తెలుసుకుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ చురుకుగా ఉండే విద్యార్థులచే ఆరోగ్య/పారిశుధ్య అలవాట్లకు సంబంధించిన అంశాలను ప్రదర్శింపజేయాలి. ఒక్కొక్క ప్రదర్శన తర్వాత విద్యార్థులను ప్రశ్నించి ఫలితాన్ని రాబట్టాలి.<br>◆ వ్యక్తిగత పరిశుభ్రత యొక్క లాభనష్టాలపై చర్చించాలి. |
| **విధానము** | : | ఈక్రింది అంశాలలో విద్యార్థులచే ప్రదర్శన ఏర్పాటుచేయాలి.<br>❖ దంతములు శుభ్రపరచుకొనుట<br>❖ స్నానము చేయుట (నటనద్వారా)<br>❖ గోర్లు కత్తిరించుకొనుట<br>❖ చేతులు కడుగుకొనుట<br>❖ తల దువ్వుకొనుట, దువ్వెన శుభ్రపరచుకొనుట<br>❖ మల, మూత్రవిసర్జన, నీరు వాడే విధానము, తదుపరి చేతులు శుభ్రంగా కడుగుకొనుట. (వివరించుట లేదా నటనద్వారా) |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | ఒక్కొక్క ఆరోగ్య అలవాటు ప్రదర్శన తర్వాత ప్రశ్నలు అడగాలి.<br>ఉదా : ✦ చిగుళ్ళనుంచి రక్తం కారేలా బ్రష్ చేయవచ్చా? ఎందుకు?<br>✦ గోర్లు కత్తిరించుకొనేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలి?<br>✦ చేతులు ఎప్పుడు కడుక్కోవాలి? ఎలా కడుక్కోవాలి?<br>✦ మల, మూత్ర విసర్జన ముందు, తర్వాత నీరు ఎందుకు ఎక్కువగా పోయాలి?<br>✦ ఉదయం స్నానంచేసిన తర్వాత మళ్ళీ ఎప్పుడు చేయాలి? ఎందుకు? |
| **అదనపు కృత్యములు** | : | 1. ఆరోగ్య అలవాట్లకు సంబంధించిన చిత్రపటముల ప్రదర్శన.<br>2. వివిధ సందర్భాలలో ఈ అలవాట్లు విద్యార్థులు పాటిస్తున్నారో లేదో తెలిపే "ఆరోగ్యపు అలవాట్ల కమిటీ" ని తరగతివారీగా ఏర్పాటుచేయడం పాఠశాల ప్రార్థన సమయంలో కమిటీ నివేదికలు చదివించుట<br>3. మంచి ఆరోగ్యపు అలవాట్లు పాటించే విద్యార్థులను అభినందించడం<br>4. వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడంవల్ల వచ్చే నష్టాలను చార్టుపై రాసి ప్రదర్శించడం. |

**వివిధ వ్యక్తిగత శుభ్రత పాటించవల్సిన అంశాలు :**

**బ్రషింగ్** :
- ✤ ప్రతిరోజూ ఉదయం ఒకసారి, రాత్రి భోజనం చేసిన తర్వాత ఒకసారి బ్రష్ చేయాలి.
- ✤ బ్రష్‌ని పైకి క్రిందకు కదుపుతూ, పళ్ళను శుభ్రం చేసుకోవాలి. 5 నిమిషాలు శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. శుభ్రం చేసుకోవడానికి ఇటుకపొడి వంటి గరుకు పదార్థాలు ఉపయోగించరాదు. నీటితో బాగా పుక్కిలించాలి.

**స్నానంచేయడం** :
- ◆ స్నానం చేసిన తర్వాత స్నానపుగదిని తర్వాత వచ్చేవారికి అనుకూలంగా శుభ్రంగా ఉంచాలి.
- ◆ రోజూ ఉదయం ఒకసారి, సాయంత్రం ఆటలాడిన తర్వాత (లేక) శారీరకశ్రమ తర్వాత తప్పక స్నానం చేయాలి.
- ◆ చల్లని నీళ్ళతో స్నానం చేయాలి.
- ◆ ఎక్కువ వేడిగాఉన్న నీటితో స్నానం చేయరాదు.
- ◆ పడుకునేముందు గోరువెచ్చని నీటితో స్నానంచేయడం మంచిది.
- ◆ స్నానపు సబ్బులో ఎక్కువ టి.ఎఫ్.యం. ఉండునట్లు చూసుకోవాలి.

**చేతులు కడుక్కోవడం** :
- ✦ ప్రతిరోజు తినేముందు, తిన్నతర్వాత; ఏవైనా పనులు చేసిన తర్వాత, మలమూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- ✦ గోర్లలో ఉండే మట్టి తొలగిపోయేలా చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- ✦ మలమూత్ర విసర్జన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

**గోర్లు కత్తిరించుకొనుట:**
- ✤ గోర్లలో మట్టి చేరకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ✤ గోర్లను కత్తిరించేటప్పుడు చిగుర్లు దెబ్బతినేలా లోతుగా కత్తిరించరాదు. నైల్‌కట్టర్ ఉపయోగించి వారానికి ఒకసారి గోర్లు కత్తిరించుకోవాలి.
- ✤ కత్తిరించిన గోర్లను చెత్తకుండీలో వేయాలి.

**మలమూత్ర విసర్జన** :
- ◆ మలమూత్ర విసర్జన ముందు, తర్వాత Toilet Basin లో నీరు ఎక్కువగా పోయాలి. తద్వారా దుర్వాసనను దూరం చేయవచ్చు.
- ◆ Toilets లో దుర్వాసన, రోగకారక క్రిములు దూరంచేయుటకు సంబంధిత Acids, Toilet cleaners వాడాలి. Toilets లో వాసన రాకుండా Toilets వాడిన ప్రతిసారి Basin లో నీరు పోయాలి. శుభ్రంగా ఉంచుకోవాలి.
- ◆ Toilets కు వెళ్ళి వచ్చిన తరువాత సబ్బుతో చేతిని శుభ్రంగా కడుగుకోవాలి.

**తలదువ్వుకోవడం** :
- ❖ ప్రతిరోజు జుట్టును దువ్వుకోవాలి. అప్పుడప్పుడు తలకు నూనె అంటించాలి.
- ❖ దువ్వెన పళ్ళసందుల్లో ఉన్న మట్టిని తొలగించి కడిగి శుభ్రంగా ఉంచుకోవాలి.
- ❖ ఇతరుల దువ్వెనలుకాక స్వంతంగా దువ్వెన వాడటం మంచిది.
- ❖ వారానికి రెండుసార్లు తలకు నూనె రాసి శుభ్రంగా తలస్నానం చేయాలి.

# జనాభా విద్య

**ఉపఅంశం** : తరగతి – జనాభా

**కృత్యము** : 'తరగతి' లోని విద్యార్థుల సంఖ్య, బాలబాలిక సంఖ్యను లెక్కించడం.

**ఆశించిన ఫలితం** : 'జనాభా' అనే భావనను తెలుసుకుంటారు, తరగతిగదిలోని విద్యార్థులకు అన్వయిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ✤ విద్యార్థులకు 'జనాభా' భావనకు సంబంధించిన సమాచారాన్ని అందించడం.
- ✤ విద్యార్థులను జట్లుగా విభజించడం.
- ✤ తరగతి జనాభా మరియు కుటుంబ జనాభా సేకరణకు సంబంధించిన వివరాలను అందించడం.
- ✤ జనాభాలోని అంశాలు వాటిమధ్య సంబంధం తెలుసుకుంటారు.

**కృత్య విధానము** :
- ◆ విద్యార్థులు తమ తరగతికి మరియు కుటుంబ జనాభాకు సంబంధించిన వివరాలను తెలుసుకొని క్రింది నమూనాపత్రం (Proforma) లో పొందు పరుస్తారు.
- ◆ విద్యార్థులు నింపిన సమాచారంపై తరగతిగదిలో చర్చించాలి.

a) **తరగతిగది :**

| వ.సంఖ్య | పేరు | తరగతి | బాలుడు/బాలిక | వయస్సు |
|---|---|---|---|---|
| | | | | |

b) **కుటుంబం :**

| వ.సంఖ్య | పేరు | స్త్రీ / పురుషుడు | కుటుంబ యజమానితో సంబంధం |
|---|---|---|---|
| | | | |

**అదనపు కృత్యములు** :
1. విద్యార్థుల సమీప కుటుంబాలలో స్త్రీ, పురుష జనాభా సేకరణ
2. చిన్న, పెద్ద, సమిష్టి కుటుంబాలను గుర్తింపచేయుట. ఆ కుటుంబాలలో గల సభ్యుల సంఖ్య నమోదు చేయించుట.
3. స్త్రీ, పురుష సంఖ్యలో వ్యత్యాసాన్ని గుర్తింపచేయుట. జనాభాలో తేడాలవల్ల కలిగే పర్యవసానాలను చర్చించుట.
4. ఏ విద్యార్థి కుటుంబం సమిష్టికుటుంబమో గుర్తింపచేయుట.
5. సమిష్టి కుటుంబము వలన వారు పొందుతున్న లాభము/నష్టము చెప్పించుట.

# సాంస్కృతిక వైవిధ్యము - వినోదం

**ఉపఅంశం** : ఇల్లు – తరగతిగది అలంకరణ

**కృత్యము** : అవసరమైనపుడు ఇంటిని, తరగతి గదిని అలంకరించడం

**ఆశించిన ఫలితము** :
- ✤ ఇంటిని, తరగతి గదిని మరియు బడిని అలంకరించడం నేర్చుకుంటారు.
- ✤ మట్టిఇళ్ళను అలుకుతారని, గుమ్మాలకు పసుపుకుంకుమలు రంగులతో అద్దుతారని, ఇంటికి సున్నాలువేస్తారని, రంగులువేస్తారని తెలుసుకుంటారు.
- ✤ విద్యార్థులు వారికి చేతనైనంతవరకు ఎక్కడి సామాను అక్కడే సర్దేటట్లు ప్రోత్సాహం పొందుతారు.
- ✤ అలంకరణలో వైవిధ్యాన్ని గుర్తిస్తారు, ఆనందాన్ని పొందుతారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : ఇల్లు – అలంకరణ చేసి చూపించే పద్ధతిలో చెప్పాలి. విద్యార్థుల ద్వారా చెప్పించాలి.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. ఇంటిముంగిట ప్రతిరోజు శుభ్రంగా ఉంచుకోవడం ఎందుకు?
2. ముగ్గులు ఎందుకు పెడ్తారు?
3. ప్రతిరోజూ ఇంటిని చీపురుతో ఊడ్వకపోతే ఏమౌతుంది?
4. పోగుచేసిన దుమ్ము, ధూళి, చెత్తను ఏంచేస్తారు?
5. పండుగలలో, వేడుకలలో ఇంటిని ఎట్లా అందంగా ఉంచుతారు?
6. మీ ఇంట్లో ఏఏ వేడుకలు జరుపుతారు?
7. ఇల్లు శుభ్రంగా, అందంగా ఉంచడానికి మీరేం చేస్తారు?

**కృత్య విధానము** :
- ✦ బృందాలవారీగా విద్యార్థులు పనులు చేసేటట్లు పాఠశాలలో నాటకీకరణ ద్వారా చేయించవచ్చు. ఇంటిని అలంకరించడంలో ఏమేమి చేయాలో చెప్పించాలి.

**ఇంటిని శుభ్రంగా అందంగా ఉంచడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు**
- ◆ ప్రతిరోజు ఇంటి ముంగిట తుడిచి, కల్లాపిజల్లి, ముగ్గుపెట్టడం.
- ◆ ప్రతిరోజు తడిబట్టపెట్టి గదులను తుడుచుకోవాలి. వారానికొకసారైనా శుభ్రంగా నీటితో కడగాలి. అవసరమైన సమయాలలో కొద్ది చుక్కల ఫినాయిల్ నీటిలో కలిపి కడగాలి.
- ◆ గది గోడలకు పట్టిన బూజును దులుపుకోవడం.
- ◆ మామిడాకుల తోరణాలు కట్టడం
- ◆ పక్కబట్టలను వారానికొకసారైనా ఉతికించాలి. ఉతికి ఇస్త్రీచేసిన బట్టలను వాడుకోవాలి. ఇంట్లో పెద్దవారి సాయంతో ఆయా పనులను తమకు చేతనైనంత మేరకు చేయాలి.
- ◆ ఇంటి అలంకరణలు మరియు శుభ్రంగా ఉంచుకోవడంపై వారు చేసే పనులను వారి అనుభవాలను చెప్పించడం, చర్చ జరపడం.

**అదనపు కృత్యాలు** :
1. సంప్రదాయ విధానాలలో, ఆచారవ్యవహారాలను పాటిస్తూ ఇంటిని అలంకరించడం.
2. ఆయా మతాల పద్ధతులతో అలంకరణ
3. పుట్టినరోజు వేడుకలకు ప్రత్యేక అలంకరణ
4. పండుగ దినాలలో ఆయా పండుగ విశేషాలతో అలంకరణ చేయడం.

# సాంస్కృతిక వైవిధ్యము - వినోదం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | తరగతిగది అలంకరణ |
| **కృత్యము** | : | జాతీయ దినోత్సవాలలో, పాఠశాల వార్షికోత్సవం వంటి సమయాలలో, ప్రతిరోజు కూడ పాఠశాల/తరగతిగది అలంకరణ చేయడం. |
| **ఆశించిన ఫలితము** | : | ✤ తరగతిగది/పాఠశాలను అలంకరణ చేయడంలో ఉత్సాహం కల్గిఉంటారు.<br>✤ కలిసి పనిచేయడంలో కలిగే ఆనందాన్ని గ్రహిస్తారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | విద్యార్థులను జట్లుగా చేసి ఒక్కొక్క పనిని ఒక్కొక్క జట్టుకి అప్పగించాలి. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. జాతీయదినోత్సవాలలో తరగతిగదులను ఎందుకు అలంకరించాలి?<br>2. గది అలంకరణ / పాఠశాల అలంకరణ అంటే ఏమేమి చేస్తారు?<br>3. ప్రతిరోజు తరగతిగదిని/పాఠశాలను శుభ్రం చేయాల్సిన అవసరముందా? |
| **కృత్య విధానము** | : | ◆ జట్లుగా పనిని విభజించాలి. తరగతిగదిని శుభ్రంచేయడం. చీపురుతో ఊడ్వడం, నీళ్ళతో కడగడం. రంగుకాగితాలతో అలంకరించడం. రకరకాల డిజైన్లతో గోడలకు అతికించడం. రంగుల ముగ్గులు వేయడం.<br>◆ స్వాగత బ్యానర్లను తమ స్థాయికి తగ్గవిధంగా తయారుచేసుకోవడం.<br>◆ పాఠశాల ఆవరణమంతటా, తరగతిగది గుమ్మాలకు మామిడాకుల తోరణాలు కట్టడం. విద్యార్థులచే మామిడితోరణాలు తయారుచేసి కట్టించడం, ప్రదర్శించడం. (ప్రత్యేక దినాలలో)<br>◆ పాఠశాలలో లభించే పూలు, ఆకులలో పుష్పగుచ్ఛాలను తయారుచేసుకొని అలంకరించడం.<br>◆ పూలమాలలతో అలంకరించడం, దండలు కట్టడం.<br>◆ రంగుకాగితాలలో పూలు, పూలమాలలు అల్లడం మొదలగునవి. |
| **అదనపు కృత్యాలు** | : | 1. పాఠశాల ఆవరణను దుమ్ము పైకి లేవకుండా నీటినిజల్లి చెత్తకాగితాల వంటి వాటిని ఊడ్వడం.<br>2. బడిలో ఉన్న పూలమొక్కలకు, పండ్లమొక్కలకు నీరు పోయడం. |
| **పాఠశాల మరియు తరగతిగది పరిశుభ్రంగా ఉంచడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు** | : | ✦ ప్రతిరోజూ పాఠశాల ఆవరణను శుభ్రంచేసుకుంటే పిల్లలు ఆడుకునే ఆవరణ పరిశుభ్రంగా ఉంచవచ్చును.<br>✦ ఆవరణంలో ఉమ్మివేయడం, చీదడం వంటి పనులను ఎవరూ చెప్పిన మానుకునే అవకాశం కల్పించడానికి ప్రతి విద్యార్థిచే శుభ్రతా నియమాలను పాటింపచేయడం.<br>✦ తాను ప్రతిరోజు కూర్చునే బెంచీలను, గదులను పరిశుభ్రంగా ఉంచుకొని, చక్కగా అలంకరిస్తే పాఠాలను కూడ ఆహ్లాదకరమైన వాతావరణంలో వినగల్గుతారు.<br>✦ పాఠశాలను శుభ్రపరచడం కేవలం పిల్లలచే చేయించడం కాకుండా ఉపాధ్యాయులు కూడా వారితో పాటుగా పనిచేయాలి. |

# సామాజిక అంశాలపై అవగాహన - స్పందన

**ఉపఅంశం** : కుటుంబంలో వ్యక్తిగత బాధ్యత

**కృత్యము** : కుటుంబంలో వ్యక్తిగత బాధ్యతలను తెలుసుకోవడం మరియు నిర్వర్తించడము.

**ఆశించిన ఫలితము** :
- ❖ కుటుంబంలో తమ పనులను తెలుసుకుంటారు. వాటిని బాధ్యతగా నిర్వర్తిస్తారు.
- ❖ కుటుంబంలో తమ వంతు పనులు చేయడంలో ఆనందం పొందుతారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ❖ విద్యార్థులను వారి వారి కుటుంబ సంబంధిత పనులను పరిశీలించి తెలుసుకునేలా చేయడం.
- ❖ కుటుంబంలో వారు ఏఏ పనులు నిర్వర్తించగలరో/చేయగలరో గుర్తించేలా చేయడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు:**
1. కుటుంబంలో ఆడ, మగ చేసే పనులలో తేడాలేమైనా ఉన్నాయా?
2. కుటుంబంలో ఎవరు ఎక్కువ పనిచేస్తారు? ఎందుకు?
3. కుటుంబ సభ్యులంతా పనులలో ఎందుకు పాల్గొనరు?

**కృత్య విధానము** :
- ◆ విద్యార్థులు వారి వారి కుటుంబాలలో జరిగే పనులను పట్టికలో రాయించాలి.
- ◆ కుటుంబంలో వారు చేయగల పనుల జాబితాను తయారుచేయించాలి.
- ◆ కుటుంబంలో వారు చేయగల పనులు గుర్తించి, ఏమి చేయగలరో చెప్పించాలి, రాయించాలి.
- ◆ తరగతిలోని పిల్లలు, వారి కుటుంబంలో ఏఏ పనులు చేయగలరో చెప్పించాలి. పనులు చేసేవారిని, బాధ్యతలను తీసుకునేవారిని టీచర్ అభినందించాలి.

**అదనపు కృత్యాలు** :
1. సహవిద్యార్థులు, స్నేహితులు వారి కుటుంబంలో తమ వ్యక్తిగత బాధ్యతలను నిర్వహిస్తున్నారా లేదా అని వారితో చర్చించడం.
2. వారు చేస్తున్న పనులు చెప్పించడం, రాయించడం, చర్చించడం.
3. గత వారంరోజులలో – ఇంట్లో తాము చేసిన పనులు రాయించడం.

**కుటుంబంలో విద్యార్థి వ్యక్తిగత బాధ్యతలు :**

- ✦ తన పనులు తాను చేసుకోవడం. (తలదువ్వుకోవడం, స్నానం చేయటం, దుస్తులు ధరించడం మొ॥వి).
- ✦ ఉతికి, ఆరవేసిన బట్టలను మడతబెట్టుకొని భద్రపరచుకోవడం.
- ✦ తన పాదరక్షలను (చెప్పులు, బూట్లను) శుభ్రంచేసుకోవడం. వాటిని సరైన స్థలంలో భద్రపరచుకోవడం.
- ✦ విడిచిన దుస్తులను, తల్లిదండ్రుల సలహా మేరకు ఉతకడానికి వేయడమో లేదా మడతబెట్టి అమర్చుకోవడమో చేయడం.
- ✦ తమ వస్తువులను, బట్టలు, పుస్తకాలు, ఆటవస్తువులు ఒక క్రమపద్ధతిలో ఉంచడం.
- ✦ ఇంటికి కావలసిన సరుకులను తీసుకురావడంలో సహాయపడడం.
- ✦ నీళ్ళు పట్టడంలో, ఇల్లు శుభ్రంచేయడంలో భాగం పంచుకోవడం. వంటలో సహాయం చేయడం.
- ✦ పెరటిలోగాని, కుండీలలోగాని మొక్కలు ఉంటే వాటికి నీరుపోయడం, ఎరువు వేయడం.
- ✦ భోజన సమయంలో, తల్లిదండ్రులకు సహకరించడం. తిన్న తరువాత తన పళ్ళెం కడిగి, సరైన స్థానంలో ఉంచడం, మొదలైనవి.
- ✦ Toilet ఉపయోగించిన తరువాత, నీటిని పోసి పరిశుభ్రంగా ఉంచడం.

# సమాచారము - డాక్యుమెంటేషన్

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | గోడపత్రిక – నిర్వహణ |
| **కృత్యము** | : | గోడపత్రికను నిర్వహించడం |
| **ఆశించిన ఫలితము** | : | గోడపత్రిక తయారుచేస్తారు. వివిధ అంశాలను ప్రదర్శించుటకు దానిని ఉపయోగిస్తారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ❖ గోడపత్రిక తయారీలో విద్యార్థులకు తగు సలహాలు, సూచనలు ఇస్తూ తయారు చేయించాలి.<br>❖ పిల్లలు రాసిన కథలు, పాటలు, సూక్తులు, గీసిన బొమ్మలు ప్రదర్శింపచేయాలి.<br>❖ గోడపత్రిక నిర్వహణ కమిటి ఏర్పాటుచేయాలి. |
| **కావలసినవి** | : | ❖ రబ్బరుషీటు, రంగువస్త్రము, పిన్నులు, అల్యూమినియం ఫ్రేమ్, మెరుపు కాగితం |
| **కృత్య విధానము** | : | ◆ పిల్లలు రాసిన అంశాలు,; వార్తాపత్రికలలో సేకరించిన అంశాలు గోడపత్రికలలో ప్రదర్శించాలి.<br>◆ తరగతిగదిలో స్థలాన్ని బట్టి 4 × 3 సైజులో రబ్బరుషీటును/కార్డుబోర్డు/అట్టముక్కను కత్తిరించి దీనిపై ముదురురంగు గల వస్త్రాన్ని అతికించి మెరుగు కాగితాన్ని చుట్టూ బార్డర్‌గా అతికించాలి. ఫ్రేమ్ కొరకు అల్యూమినియం రేకు, చుట్టూ అమర్చవచ్చు. ఇప్పుడు గోడపత్రిక తగిలించుటకు ఫోటోఫ్రేమ్ ఉంచే హ్యాంగర్స్ అమర్చాలి. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. గోడపత్రికలో ఏఏ అంశాలు ప్రదర్శించాలి?<br>2. ప్రదర్శించిన అంశాలను ఎలా భద్రపరచాలి?<br>3. గోడపత్రిక వల్ల లాభాలేమి? |
| **అదనపు కృత్యాలు** | : | 1. పిల్లల ప్రదర్శన, సేకరణలు ప్రదర్శించాలి, భద్రపరచాలి.<br>2. గోడపత్రికలో ఉంచిన అంశాలతో ఒక బుక్‌లెట్ తయారుచేసి, దానికి ఒక పేరుపెట్టి కవర్‌పేజిపై అందంగా రాయాలి. ఈవిధంగా తరగతి మ్యాగజైన్‌గా తయారుచేయాలి, దానిని తరగతిలో చిన్న కార్యక్రమం నిర్వహించి రిలీజ్ చేయాలి. |

# వస్తువులు - నమూనాల తయారీ

**ఉపఅంశం** : ఆకృతులు – నమూనాలు

**కృత్యము** : బంకమట్టితో, కాగితాలతో, అగ్గిపుల్లలతో, బెండుతో, సైకిల్ వాల్వ్‌తో వివిధ ఆకృతులను తయారుచేయడం.

**ఆశించిన ఫలితము** :
- ✤ వివిధ పదార్థాలు, వస్తువులనుపయోగించి రకరకాల ఆకృతులను తయారుచేయ గల్గుతారు.
- ✤ కలిసి పనిచేయడంలో ఉండే ఆనందాన్ని గ్రహిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ బంకమట్టి, కాగితం, అగ్గిపుల్ల మొ॥వి ఉపయోగించి వివిధ ఆకృతులను తయారు చేసి చూపించడం.
- ◆ అవసరమైన వివిధ సామాగ్రిని సేకరించి విద్యార్థులకు అందుబాటులో ఉంచడం.
- ◆ విద్యార్థులను జట్లుగా విభజించి, వివిధ వస్తువులను తయారుచేయించి వాటిని అంశాలవారిగా ప్రదర్శించటం.
- ◆ వివిధ వస్తువులను తయారుచేయడంలో అనుభవం ఉన్న విద్యార్థుల సహకారం తీసుకోవడం.

**కృత్య విధానం** :
- ❖ విద్యార్థులను జట్లుగా విభజించి బంకమట్టి, కాగితం (కాగితం టోపి), అగ్గిపుల్లలు మొ॥వి ఉపయోగించి వివిధ ఆకృతులను తయారుచేయించడం.
- ❖ వారికిష్టమైన బొమ్మలు, వస్తువులు, పండ్లు, వాహనాలు మొ॥వి తయారు చేయమనడం.

**అదనపు కృత్యాలు** :
1. వ్యర్థకాగితాలనుపయోగించి వివిధ ఆకృతులను తయారుచేయించడం (ఓరిగామి).
2. పుష్పాలతో వివిధ ఆకృతులను తయారుచేయించడం.
3. పాడైపోయిన/పాత గుడ్డలతో డోర్‌మ్యాట్స్ తయారుచేయించడం.
4. వ్యర్థకాగితాలతో కవర్లు, గ్లాసులు తయారుచేయడం.
5. సైకిల్ వాల్‌తో వివిధ గణిత ఆకృతులను తయారుచేయుట.

గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు ఆడే ఆటవస్తువులను గురించి తెలుసుకొని వాటిని పాఠశాలలో ఆడేవిధంగా ప్రోత్సహించాలి.

ఉదా॥ బొంగరంతో ఆట, నాపరాయిబిళ్లకి దారంకట్టి తిప్పేఆట, కట్టెలతో టైర్లనుగాని, గుండ్రటి చక్రాలనుగాని తిప్పటం.

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆకృతులు |
| **కృత్యము** | : | అలంకరణ వస్తువులు తయారీ (గాజు, కాగితము, పాతబట్టలు, వాడిపారేసిన రకరకాల వస్తువులు) |
| **ఆశించిన ఫలితము** | : | పాతవస్తువులు, వాడిన వస్తువులతో అలంకరణ వస్తువులు తయారుచేయడము. తద్వారా ఆనందం, సృజనాత్మకత, సహకార భావనలు పెంపొందుతాయి. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులకు శనివారము సాయంత్రము తగు సూచనలు, సలహాలు, జాగ్రత్తలు, (ఉపాధ్యాయుడు అలంకరణవస్తువుల తయారీ గురించి.) ఇవ్వాలి. సోమవారము వచ్చునప్పటికి వాటిని తీసుకుని రమ్మని తెలపాలి.<br>◆ ఇంటిదగ్గర పెద్దవారితో వ్యర్థపదార్థాలనుండి వస్తువులు ఎలా తయారుచేయాలో తెలుసుకొని నోటుబుక్‌లో రాయమని చెప్పాలి. |
| **కృత్య విధానం** | : | ✤ విద్యార్థులు జట్లలోను, ఇండ్లదగ్గర పెద్దవారిని, అక్కలు, అన్నలను అడిగి తెలుసుకొని రకరకాల అలంకరణ వస్తువులు తయారుచేసి తీసుకుని వచ్చి తరగతిగదిలో ప్రదర్శిస్తారు.<br>✤ విద్యార్థులు తెచ్చిన వివిధ రకాల వస్తువులతో ఈక్రింది నమూనాలు చేయించాలి.<br>**కాగితము :** రంగు కాగితములతో రకరకాల దండలు, జెండాలు, వేడుకలకు డిజైన్ పేపర్ దండలు తయారుచేయుట.<br>**గాజులముక్కలు :** పగిలిన గాజులు కొద్దిగా వేడిచేసి చైన్‌లింగ్‌లాగా అతికించి ప్రవేశ ద్వారమునకు అలంకరణగా వ్రేలాడదీయవచ్చు.<br>**కాగితపు కప్పులు :** వీటిని కట్ చేసి మాలలుగా తయారుచేసి ఫోటోలకు, కిటికీలకు మాలలుగా అలంకరించవచ్చు.<br>**పాతబట్టలు :** రంగురంగులవి కత్తిరించి ద్వారములకు, కిటికీలకు, సంచులకు డిజైన్‌లుగా తయారుచేయవచ్చు. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. పాతపడిన, పారేసిన వస్తువులతో కూడా రకరకాల అలంకరణసామాగ్రి/వస్తువులు ఎలా తయారుచేస్తావు?<br>2. సృజనాత్మకంగా అలంకరణ వస్తువుల తయారీకి నీకు ఏమేమి అవసరమని భావిస్తున్నావు?<br>3. మనం రోజూ వాడిపారేసే వస్తువులు ఏవి? వాటిని తిరిగి ఎలా ఉపయోగించుకోవచ్చు? |
| **అదనపు కృత్యాలు** | : | 1. కాగితపు గ్లాసులు, కప్పులు కత్తిరించి Pen stand తయారుచేయించాలి.<br>2. వాడిన బల్బులనుపయోగించి FlowerVases తయారుచేయించాలి.<br>3. పాతబట్టలనుపయోగించి Door Curtains తయారుచేయించాలి. |

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆకృతులు |
| **కృత్యము** | : | ఎండుకాయలు, గింజలతో ఆకృతులు తయారుచేయడం. |
| **ఆశించిన ఫలితము** | : | మన చుట్టూ ఉన్న ఎండుకాయలు, గింజలతో రకరకాల ఆకృతులు తయారు చేస్తారు. ఆ తయారీలో ఆనందాన్ని, సృజనాత్మకతను, పరస్పర సహకారం మొ।। భావనలు విద్యార్థులు పెంపొందించుకుంటారు. ప్రకృతిలో కాయలు, గింజల ఆకృతిలో వైవిధ్యాన్ని ప్రశంసిస్తారు. ప్రకృతిలో వైవిధ్యాన్ని గమనిస్తారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులు ముందురోజు సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత తమ గ్రామంలో, పరిసరాలలోని ఎండుకాయల గింజలు, వివిధ పప్పుధాన్యాల గింజలు సేకరించి తరగతిగదికి తీసుకునివచ్చి వివిధ ఆకృతులు తయారుచేసేలా ఉపాధ్యాయుడు సూచనలివ్వాలి.<br>◆ విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా ఆకృతులు చేయించి, ప్రదర్శించాలి. |
| **కృత్య విధానం** | : | పాఠశాల తరగతిగదిలో విద్యార్థులు జట్లుగా చేరి ఎండుకాయలు, గింజలతో ఒక్కొక్క జట్టు రకరకాలుగా ఆకృతులు తయారుచేస్తారు. వినూత్నమైన ఆకృతులు తయారుచేసిన వారిని, వారితోపాటుగా తయారుచేసిన అందరినీ ప్రదర్శించినందుకు ప్రశంసించాలి, ప్రోత్సహించాలి.<br><br>ఉదా : గిలక, హారము, చెవి లోలకులు, పాఠశాలపేరు, వివిధ ప్రదేశాలు (దేవాలయం, చర్చి, మసీదు, చార్మినార్, తాజ్‌మహల్ పాఠశాల, గణిత ఆకృతులు మొ।।నవి) ఆకృతుల్లో గింజలను పేరుస్తారు. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. మొక్కలలోని కాయలు, గింజలలో ఇంత వైవిధ్యము ఉండటం వలన ఉపయోగమేమి?<br>2. ప్రకృతి గొప్పతనాన్ని నీవు ఎలా ప్రశంసిస్తావు?<br>3. అన్ని మొక్కల కాయలు, గింజలు ఒకే ఆకృతి, ఆకారం, బరువు సైజు ఎందుకు లేవు? ఉండినచో ఏం జరిగేది? |
| **అదనపు కృత్యాలు** | : | 1. చెట్ల ఎండిన కాయలు, గింజలతోనేకాక వివిధ వస్తువులతో వివిధ ఆకృతులు తయారుచేయించాలి.<br>2. గింజలను నాటి క్రొత్త మొక్కలు మొలకెత్తేలాగాను, మొలకెత్తే విధానాన్ని పరిశీలించేలాగానూ కృత్యాన్నివ్వాలి.<br>3. ప్రకృతిలో కాయలు, గింజల ఆకారము, బరువు, అంచుల ఆకారము మొ।। వైవిధ్యాన్ని గురించి తమ అనుభూతులను స్వంతమాటల్లో రాయించాలి.<br>4. వివిధ గింజలను కాగితంపై అతికించి వివిధ ఆకృతులను తయారుచేయుట. |

ఉప అంశం : బంకమట్టితో ఆకృతులు

కృత్యం పేరు : బొమ్మలు చేద్దాం

ఫలితం : వివిధ రకాల ఆకృతులు తయారుచేయడంలో పరిమాణం ఆకారం లాంటి నైపుణ్యాలు సాధిస్తారు.

కావలసిన పదార్థాలు : బంకమట్టి, నీరు, రంగులు

చేయువిధానం: :
- ✤ తరగతిలోని విద్యార్థులను గ్రూపులుగా విభజించాలి.
- ✤ బంకమట్టిని తీసుకురమ్మని పిల్లలకు చెప్పాలి.
- ✤ బంకమట్టికి తగినంత నీటిని పోసి ముద్దలా తయారుచేయాలి.
- ✤ గ్రూపులలో విద్యార్థులు బంకమట్టిని తీసుకొని వారికి నచ్చిన, ఇష్టమైన బొమ్మలు తయారుచేయమని చెప్పాలి. ఎండినతరువాత వాటికి రంగులు వేయాలి.
- ✤ తయారుచేసిన వాటిని తరగతిలో ప్రదర్శించాలి.
- ✤ జంతువులు, వాహనాలు పండ్లు వంటి నమూనాలు చేయండని ప్రోత్సహించవచ్చును.

---

ఉప అంశం : పూలదండ (మాల) తయారుచేయడం

కృత్యం పేరు : దండలు అల్లుదాం

ఫలితం : Computing Competency, కళాత్మక సౌందర్యగుణం నైపుణ్యాలు అలవర్చుకుంటారు.

కావలసిన పదార్థాలు : దారం, వివిధ రకాల పూలు, మెరుగుకాగితం, సూది, పేపరు

చేయువిధానం :
- ✤ తరగతిలోని విద్యార్థులందరిని అక్కడ లభించే వివిధ రంగుల పుష్పాలు సేకరించమనాలి.
- ✤ గ్రూపులుగా విభజించి పూలు అన్నింటిని సూది, దారం సహాయంతో కూర్పు చేయాలి.
- ✤ వరుసలుగా ఉన్నవాటిని 2, 3 వరుసలు కలిపితే ఒక పెద్ద పూలమాల తయారవుతుంది.
- ✤ దీనికి తగరపు పేపరు అక్కడక్కడ అతికించవచ్చు.
- ✤ ఇవేకాకుండా రంగు కాగితాలతో, చెక్క పొట్టుతో విభిన్న రకాలుగా పూలమాలలు అల్లి పాఠశాలలోని దేశనాయకుల చిత్రపటాలకు వేయండి.

| | | |
|---|---|---|
| **ఉప అంశం** | : | పూలు / పుష్పాలతో ఆకారాలు |
| **కృత్యం పేరు** | : | అందమైన బొకేలు |
| **ఆశించిన ఫలితం** | : | పరసరాల వినియోగం, సృజనాత్మకత నైపుణ్యం పెంపొందించుకుంటారు. |
| **కావలసినవి** | : | వివిధ అందమైన రంగు రంగుల పుష్పాలు కాండం ఉన్నవి, దారము, టేపు, చార్టు, మెరుపు కాగితం. |

**చేయువిధానం** :

- ✤ వివిధ రంగులు గల పుష్పాలు కొమ్మలు కల్గినవి.
- ✤ గడ్డి లేక ఇతర సుబాబుల్ చెట్టు ఆకులు.
- ✤ పూలకాండాలు గడ్డి / చెట్ల ఆకులు ఒకే సైజ్‌లో కత్తిరించి దారంతో గట్టిగా బిగించాలి.
- ✤ దారం కనబడకుండా టేపు అతికించి పైన మెరుగు కాగితం అంటించాలి.
- ✤ అందమైన బొకే అతిథులకు ఇవ్వడానికి సిద్ధం.
- ✤ పై డిజైన్ ప్లాస్టిక్ కాగితం కప్పి ఉంచితే బాగుంటుంది.

---

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | అగ్గిపుల్లలతో ఆకారాలు |
| **కృత్యం పేరు** | : | గణిత ఆకారాలు తయారుచేయటం |
| **ఆశించిన ఫలితం** | : | విద్యార్థులకు గణిత ఆకారాలపై అవగాహన ఏర్పడడం మరియు గణితంపై అభిరుచి పెరుగును. సృజనాత్మకత పెంపొందును. |
| **కావలసినవి** | : | అగ్గిపుల్లలు, సైకిల్ వాల్వ్‌ట్యూబ్ |

**చేయువిధానం** :

- ✤ 1.5 సెం.మీ. పొడవుగా సైకిల్ వాల్వ్‌ను కత్తిరించుకోవాలి. అగ్గిపుల్లకు ముందు భాగంలో సల్ఫర్ రసాయనం బ్లేడును ఉపయోగించి తొలగించాలి.
- ✤ అగ్గిపుల్లలను వాల్వ్ సహాయంతో అతికించాలి.
- ✤ అగ్గిపుల్లలు వాల్వ్ సహాయంతో కోణాలు ఏర్పడతాయి.
- ✤ మనకు త్రిభుజం కావాలన్నపుడు 3 అగ్గిపుల్లలు, 3 సైకిల్ వాల్వ్‌లను సమాంతరంగా ఏర్పరుస్తాయి.
- ✤ ఒక ఆకారాన్ని మడిచినపుడు ఇంకో కొత్త ఆకారం ఏర్పడుతుంది.

# గృహ యాజమాన్యం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఇల్లు వస్తువుల అమరిక |
| **కృత్యము** | : | ఇంట్లోని వస్తువులను వాటి వాటి స్థానాల్లో ఉంచడం, వాడిన తర్వాత సర్దుకోవడం. |
| **ఆశించిన ఫలితము** | : | ✤ ఇంట్లోని వస్తువులను సరైన రీతిలో, సరైన స్థానాల్లో అమర్చుకుంటారు. దీనిని తమ బాధ్యతగా గుర్తిస్తారు.<br>✤ శుభ్రత యొక్క అవసరాన్ని తెలుసుకుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | విద్యార్థులను జట్లుగా చేసి ప్రశ్నించాలి. అవగాహన కల్పించాలి. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. మీ పుస్తకాలు, పుస్తకాలసంచి, చెప్పులు, యూనిఫామ్‌ను ఎక్కడెక్కడ అమర్చుతారు?<br>2. వీటన్నింటికి ప్రత్యేకమైన చోట్లు ఉన్నాయికదా! వాటిని అమర్చే సాధనాల పేర్లను తెల్పండి.<br>3. మీ/మన ఇంటిలో, వంటపాత్రలు, స్టవ్, పెట్టెలు, పక్కబట్టలు, ఇతర దుస్తులు, సబ్బులు, బక్కెట్లు మొ॥వి ఎక్కడ ఉంటాయి? |
| **కృత్య విధానం** | : | పట్టికలో వస్తువులపేర్లు, ఉంచే చోటును రాయమనాలి. పెట్టె; బీరువా; అల్మారా; సొరుగులు, ర్యాక్‌లు, చెక్కషెల్ఫులు, సిమెంటుగూళ్ళు/అల్మారాలాంటి వాటిలో – ఉంచే వస్తువులను చెప్పమనాలి. |
| **అదనపు కృత్యాలు** | : | 1. పాఠశాలలో, వారి తరగతిగదిలో, గృహంలో గల వస్తువుల అమరికను నమూనాగా ప్రదర్శన చేయుట.<br>2. పాఠశాలలో తమకు సంబంధించిన బెంచీలు, బల్లలు చక్కగా అమర్చుకోవడం, శుభ్రంగా ఉంచడం, పుస్తకాలను సరియైన పద్ధతిలో పెట్టుకోవడం, చేయించడం. |

**ముఖ్యాంశాలు**

- ✤ విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, ఇతర సామగ్రి నిర్దేశించిన స్థలంలో శుభ్రంగా అమర్చడం.
- ✤ తక్కువ స్థలంలో ఎక్కువ వస్తువులు అమర్చే ప్రణాళిక.
- ✤ వస్తువు సర్దినవెంటనే తీసుకోవడానికి అందుబాటులో ఉండేలాగ అమర్చే విధానం.
- ✤ వ్యక్తిగత శ్రద్ధ అలవరచుకోవడం.
- ✤ ఇతరులు/మిత్రులు తమ గదిని లేదా తాము సరైన విధానాన్ని గమనించినట్లయితే ప్రోత్సహించే విధంగా అమరిక ఉండాలని జాగ్రత్తపడడం.
- ✤ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆదేశాలమేరకు ఆటవస్తువులు, గ్రంథాలయపుస్తకాలు విజ్ఞానశాస్త్ర పరిశోధన శాలల్లోని పరికరాలను సక్రమంగా భద్రపరచడం, అమర్చడంలో జాగ్రత్తలు తీసుకుంటారు.
- ✤ ఇంట్లోకూడా అమ్మనాన్న సాయంతో వివిధ సామాన్లను చక్కగా సర్దగల్గుతారు.

# వినియోగదారుల విజ్ఞానము

**ఉపఅంశం** : వస్తువులు - ధరలు

**కృత్యము** : వివిధ రకాల వస్తువుల యొక్క ధరలను గుర్తించడం.

**ఆశించిన ఫలితము** : వివిధ వస్తువుల ధరలు, వాటి తయారీ స్థలం, తయారీ తేది, వాడవల్సిన చివరి తేది తెలుసుకుంటారు. వస్తువులు కొనేముందు వివరాలను చదవాలని తెలుసుకుంటారు. వస్తువులు కొనేముందు పాటించాల్సిన మెలకువలను తెలుసుకుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ✤ విద్యార్థులను దగ్గరలో ఉన్న దుకాణమునకు వెళ్ళి రకరకాల వస్తువుల రేపర్లు ముందురోజే సేకరించి తీసుకురమ్మని చెప్పాలి. వాటి ధరలను కూడ నోటుపుస్తకంలో నమోదుచేసుకొని రమ్మని చెప్పాలి.

**కృత్య విధానం** : విద్యార్థులు ముందురోజే రకరకాల బిస్కట్లు, చాక్లెట్లు, సబ్బులు, తినుబండారాలు మొ॥ వాటికి సంబంధించిన రేపర్లను సేకరించుకొని పట్టికలో నమోదుచేసుకుని వస్తారు.

| వ.సం. | వస్తువు పేరు | ధర | బరువు | కంపెనీపేరు | తయారీ తేది | గడువు తేది |
|---|---|---|---|---|---|---|
| 1 | | | | | | |
| 2 | | | | | | |
| 3 | | | | | | |
| 4 | | | | | | |

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
- ✤ వస్తువు కొనేముందు ఏఏ అంశాలు గమనించాలి?
- ✤ వస్తువు ధరకు, వస్తువు విలువకు గల సంబంధమేమి?
- ✤ వస్తువు కొనేముందు తయారీతేది, గడువుతేది ఎందుకు చూడాలి?

**అదనపు కృత్యాలు** :
1. దుకాణము, సంతలు, మొ॥ ప్రదేశాలకు తమ తల్లిదండ్రులు, స్నేహితులవెంట వెళ్ళి వస్తువుల ధరలు – నాణ్యత– కొనుగోలు ఎలా జరుగుతుందో గమనించండి? అడిగి తెలుసుకోండి?
2. దుస్తులు / వస్తువులు షాపుయజమాని మొదట ఎక్కువధర చెప్పి తర్వాత తగ్గించి ఇస్తారు ఎందుకు?
3. కొన్ని దుకాణాల్లో స్థిరమైన ధర ఎందుకుంటుంది?
4. ఇంటిలోను / స్నేహితుల ఇంటిలో బజారులో కొనిన ఏవేని (10) వస్తువులకు, కవర్లలో ఉంచబడిన, ప్యాక్ చేయబడిన వస్తువుల ధరలను, వివరాలను చదివించడం. వరుసక్రమంలో కాగితంపై రాయించడం.
5. విద్యార్థులు కొనిన (10) వస్తువులపైన తయారీ తేది, గడువు తేదీని చదివి, నమోదు చేయించడం.
6. విద్యార్థులు కొన్న (10) వస్తువుల యొక్క బరువును తూచి పాకెట్, కవరుపై రాయబడిన బరువుతో పోల్చడం, తేడాలను గుర్తించడం.

# పర్యావరణ విద్య

**ఉపఅంశం** : జీవకారుణ్యం

**కృత్యము** : పెంపుడు జంతువులను సంరక్షించడం పట్ల అవగాహన. సంరక్షించడంలో బాధ్యతలు తీసుకోవడం.

**ఆశించిన ఫలితము** :
- ✤ పెంపుడు జంతువుల పట్ల అవగాహన కల్గుతుంది.
- ✤ వాటిపట్ల దయ, సానుభూతి చూపిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ✤ పెంపుడు జంతువులు అంటే ఏమిటో తెలియజేయాలి.
- ✤ జంతువులు ప్రకృతిలో భాగమనే విషయంలో అవగాహన కల్గించాలి.
- ✤ పెంపుడు జంతువులను దత్తత తీసుకొని, వాటిని సంరక్షించుటకుగాను విద్యార్థులను ప్రోత్సహించాలి.
- ✤ పెంపుడు జంతువులకు, మనుషులకు ఉండే సంబంధాలు, ఉదాహరణలతో చర్చించటం.

**కృత్య విధానం** :
- ✤ విద్యార్థులు తాము పెంచుకుంటున్న లేదా తమ ఇంట్లో ఉన్న జంతువుల సంరక్షణ ఏవిధంగా చేస్తున్నారో తమ అనుభవాలను రాయమనడం, చెప్పమనడం.
- ✤ పెంపుడు జంతువులకు షెల్టర్, ఆహారం అందించమనడం.
- ✤ అవి జబ్బుపడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులతో చర్చించాలి.

**అదనపు కృత్యాలు** :
1. దగ్గరలోని జంతుప్రదర్శనశాలకు విద్యార్థులను తీసుకువెళ్ళడం.
2. పర్యావరణాన్ని పరిరక్షించుటకు ఎన్విరాన్‌మెంటల్ రన్/వాక్ నిర్వహించడం.
3. జంతు పరిరక్షణపై నినాదాలు రాయమనడం.
4. మనుషులతో పాటుగా జంతువులు ఇంట్లో పెంచుకుంటున్న వారి అనుభూతులు/ అనుభవాలను అడిగి సమాచారాన్ని రాసుకొని రమ్మనడం.
5. పెంపుడు జంతువులు/పక్షులపై తమ అనుబంధాన్ని, అనుభవాలను రాయించి వాటిని ఒక బుక్‌లెట్ రూపంలో తీసుకురావడం.

# 4వ తరగతి

# పౌష్టికాహారం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆహారపదార్థాల - సేకరణ - వర్గీకరణ |
| **కృత్యము** | : | ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులను సేకరించడం, వర్గీకరించడం మరియు ప్రదర్శించడం. |
| **సేకరించవలసిన ఆహారపదార్థాలు** | : | ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులు మొదలగునవి. |
| **ఆశించిన ఫలితం** | : | ✤ సేకరించిన ఆహారపదార్థాలను ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులను గుర్తించి, పేర్లను చెప్పగలుగుతారు మరియు వాటిని వర్గీకరించగలుగుతారు.<br>✤ వారు తీసుకునే ఆహారంలో ఆయా పదార్థాలున్నాయని గ్రహిస్తారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ వివిధ రకాల ధాన్యాలను, పప్పుగింజలు, మసాలదినుసుల శాంపిల్స్‌ను వ్యక్తిగతంగా గాని / జట్లుగా గాని తీసుకునిరావలసిందిగా విద్యార్థులకు ముందుగా చెప్పడం.<br>◆ ఆహారపదార్థాల వర్గీకరణ, ప్రదర్శన సమయంలో ఉపాధ్యాయుడు సహాయకారిగా (facilitator) వ్యవహరించడం.<br>◆ ప్రతిరోజు తినే ఆహారంలో ఈ పదార్థాలు ఉండవలసిన అవసరాన్ని పిల్లలు గుర్తించేలా చేయడం. |
| **కృత్య విధానము** | : | ❖ విద్యార్థులు సేకరించిన వివిధ రకాల ఆహారపదార్థాలను ఒకచోట ఉంచాలి.<br>❖ తరువాత వాటిని ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులుగా వర్గీకరించాలి.<br>❖ ఆయా ఆహారపదార్థాల పేర్లను రాసి వాటిని సూచించే విధంగా ప్రదర్శించాలి.<br>❖ విద్యార్థులచే వివిధ ఆహారపదార్థాల పేర్లను చదివించడం మరియు రాయించడం.<br>❖ వివిధ రకాల ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులను చిన్న పాకెట్లలో భద్రపరచి ప్రదర్శించడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు మొదలైన ఆహారపదార్థాలకు; ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులు వంటి ఆహారపదార్థాలకు గల తేడా ఏమిటి?<br>2. మీ ప్రాంతంలో పండే ఆహారపదార్థాలు ఏవి? వాటి పంటకాలమెంత? |
| **అదనపు కృత్యము** | : | 1. వివిధ రకాల ధాన్యాలు, పప్పుగింజలు, మసాలదినుసులను చిన్న పాకెట్లలో భద్రపరచి వాటి పేర్లు రాసి ప్రదర్శించడం.<br>2. ఆహారపదార్థాల ధరల పట్టికను తయారుచేయుట. (1 కిలోకి) |

# ఆరోగ్యవిద్య

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | పారిశుధ్య అలవాట్లు – పరిసరాల శుభ్రత |
| **కృత్యము** | : | చీపురు, బూజుకర్ర తయారుచేసి విద్యార్థులు తమ తరగతిగది, పాఠశాలను శుభ్రం చేయడం. |
| **ఆశించే ఫలితము** | : | చీపురు, బూజుకర్రల తయారీలో మరియు ఉపయోగించడంలో మెళకువలు తెలుసుకుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | పాఠశాల సమీపంలో దొరికే వస్తువులతోనే బూజుకర్ర, చీపురు తయారుచేసేలా ప్రోత్సహించాలి. |
| **విధానము** | : | ప్రతిరోజూ మరియు పాఠశాల దినోత్సవము / ఆగష్టు 15 / జనవరి 26 / నవంబర్ 14 మొ॥ సందర్భములలో తరగతిగదులు శుభ్రపరచుకొనుట. |
| **చీపురు తయారి** | : | ✤ కందికట్టె (ఎండు) తో చీపురు తయారీ<br>✤ కొబ్బరి ఎండుఆకుల ఈనెలతో చీపురు తయారీ<br>✤ ఈతఆకులతో / గడ్డి ఈనెలతో / తాటిఈనెలతో చీపుర్లు తయారీ |
| **బూజుకర్రతో చీపురు తయారి** | : | ◆ పొడవాటి ఎండుకర్రకు వాడిన చీపురుతో బూజుకర్ర తయారీ<br>◆ పొడవాటి ఎండు కందికట్టె/కొమ్మలతో బూజుకర్ర తయారీ<br>◆ ఈత, కొబ్బరి, తాటాకులతో చీపుర్లు తయారీ<br>◆ ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే వస్తువులతో చీపురు, బూజుకర్ర తయారు చేసుకోవాలి. |
| **సూచనలు** | : | విద్యార్థులను తమ తరగతిగదులను శుభ్రపరచుకొనుటలో 'టీచరు సహాయపడాలి, తదుపరి కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుగుకునేలా చూడాలి. టీచరు చేసిచూపించి పాఠశాల శుభ్రపరచడంలో పాల్గొనాలి.<br>దుమ్ము రేగకుండా చీపురుతో గదులు చిమ్మేముందు మట్టినేలపై నీరు చిలకరించి తదుపరి చిమ్మటం. |
| **అదనపు కృత్యాలు** | : | 1. పరిసరాలలోని వస్తువులతోనే చీపురు, బూజుకర్రల తయారీ.<br>2. ప్రతిరోజూ పాఠశాలలో ఎవరి తరగతిగది వారు శుభ్రపరచుకునేలా వంతులు కేటాయించాలి.<br>3. బూజు దులిపేటప్పుడు కంట్లో, నోట్లో, ముక్కుల్లో దుమ్ము, ధూళి దూరకుండా ముక్కు, నోటికి చేతిరుమాలును కట్టుకోవాలి. |

# జనాభా విద్య

**ఉపఅంశం** : పాఠశాల - జనాభా

**ఆశించిన ఫలితము** : పాఠశాలలోని జనాభా-భావనపై అవగాహన పొందుతారు.

**కృత్యము** : పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, బాలబాలికల సంఖ్యను ఇతర జనాభా అంశాల గురించి సమాచారాన్ని సేకరించుట.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ విద్యార్థులను జట్లుగా విభజించడం.
- ◆ పాఠశాల 'జనాభా' భావనను అవగాహన కలిగించడం.
- ◆ తరగతులవారీగా విద్యార్థుల వివరాలను సేకరించడం, పట్టికలో నమోదుచేయడం.
- ◆ పాఠశాల బాలబాలికల సంఖ్యను పోల్చడం మరియు అవగాహన కలిగించడం.

**కృత్య విధానము** :
- ✤ విద్యార్థులను జట్లుగా విభజించి తరగతివారీగా, బాలబాలికలవారీగా పాఠశాల జనాభాను సేకరించడం.
- ✤ ఈక్రింది పట్టికలలో సమాచారం నింపించడం మరియు తరగతిగదిలో చర్చించడం

**తరగతి పట్టిక**

| వ.సం. | తరగతి | బాలుడు | బాలిక |
|---|---|---|---|
| | | | |

**పాఠశాల పట్టిక**

| వ.సం. | తరగతి | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|
| | | | | |

**ఆలోచించే ప్రశ్నలు** :
1. జనాభా యొక్క లక్షణాలు ఏవి?
2. జనాభా పెరగడంలో, తగ్గడంలో ఉన్న మంచి చెడులు ఏవి?

**అదనపు కృత్యాలు** :
1. వీధి, లేక గ్రామంలో బాలబాలికల వివరాల సేకరణ. వీరిలో వృద్ధుల, వికలాంగుల వివరాల సేకరణ.
2. విద్యార్థులను జట్లుగా విభజించి వారి వారి ప్రదేశంలో ఉండే జంతువులు, మొక్కల జనాభా గణించమనడం.

# సాంస్కృతిక వైవిధ్యము - వినోదం

**ఉపఅంశం** : కార్టూన్ చిత్రాల ప్రదర్శన మరియు కార్టూన్ కథల పఠనము.

**కృత్యము** : సంస్కృతిని ప్రతిబింబించే కార్టూన్ చిత్రాలను చూడడం, అందులోని పాత్రలను అనుకరించడం.

**ఆశించిన ఫలితము** :
- ❖ కార్టూన్ చిత్రాలను చూడటం, కథలను చదవడంలో ఉత్సాహం చూపుతారు. అనుకరణలో నైపుణ్యం సాధిస్తారు. ఊహాశక్తిని పెంపొందించుకుంటారు.
- ❖ తాము స్వంతంగా బొమ్మలను గీసి సంభాషింపచేస్తారు. కదిలే బొమ్మలు, ఆడే బొమ్మలను సృజనాత్మకతతో చేసి - మాట్లాడగల్గుతారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : కార్టూన్ చిత్రాలంటే ఏమిటో అవగాహన కల్పించడం. బృందాలలో చర్చింపజేయడం. వివిధ రకాల కార్టూన్ కథలను, న్యూస్‌పేపర్‌నుండి, మ్యాగజైన్‌లనుండి సేకరించడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. టి.వి.లో ఏఏ ఛానల్స్ చూస్తారు?
2. ఏ ఛానల్స్ అంటే మీకు ఎక్కువ ఇష్టం?
3. పోగో వంటి ఛానల్స్‌లో వీరహనుమాన్, రామాయణం, భీమ వంటి కథాచిత్రాలను ఎప్పుడైనా చూశారా?
4. దినపత్రికలోని బొమ్మల చిత్రాలు చదువుతారా? చూస్తారా?

**కృత్య విధానము** :
- ✦ కార్టూనులు, బొమ్మలు వేయించి వాటికి తగినట్లు వ్యాఖ్యలను రాయించడం.
- ✦ ఇవ్వబడిన కార్టూనులకు లేక చిత్రాలకు సంభాషణలను రాయించడం, చెప్పించడం.
- ✦ వివిధ పక్షి, జంతువుల బొమ్మలు పెట్టుకొని, అవి మాట్లాడినట్టుగా అభినయం చేయించడం.
- ✦ జట్లలో చేసిన అంశాలను విద్యార్థులతో చెప్పించడం.
- ✦ దిన/వారపత్రికలలోని కార్టూన్ బొమ్మల కథాచిత్రాలను సేకరించమనడం, వాటిపై మాట్లాడించడం.
- ✦ ఆంగ్లపత్రికలలో కార్టూన్ బొమ్మలతో కథాచిత్రాలపై అవగాహనకోసం వారికి ఊహించిన విధంగా చెప్పమనడం.
- ✦ హాస్య బొమ్మలతో, ఛలోక్తులతో ఉన్న అంశాలను చెప్పించడం.
- ✦ ఛానల్స్‌లోవచ్చే కథాచిత్రాలను ఆయా కార్టూన్ బొమ్మలవలె అనుకరణతో మాట్లాడించడం.

**అదనపు కృత్యాలు** :
1. కార్టూన్ బొమ్మలను చూపించి మాట్లాడించడం.
2. కార్టూన్ బొమ్మల మాదిరి పప్పెట్స్‌ని వినియోగింప చేయడం.
3. ప్రతిరోజు వచ్చే కార్టూన్ కథలను సేకరింపచేసి - వారి ఊహతో కథలల్లమనడం.
4. గ్రామీణ, పట్టణప్రాంత, రాజులనాటి చిత్రాల ప్రదర్శన

# సామాజిక అంశాలపై అవగాహన - స్పందన

**ఉపఅంశం** : తరగతిలో, పాఠశాలలో వ్యక్తిగత బాధ్యత

**కృత్యము** : తరగతిగదిలో, పాఠశాలలో చేసే పనుల పట్ల బాధ్యత వహించడం.

**ఆశించిన ఫలితము** : తరగతిలో, పాఠశాలలో వ్యక్తిగత పనులను తెలుసుకుంటారు. వాటిని బాధ్యతగా నిర్వర్తిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :

- ◆ తరగతిలో, పాఠశాలలో విద్యార్థుల బాధ్యతల గురించి చర్చించడం
- ◆ తరగతిలో, పాఠశాలలో విద్యార్థులు వారి వారి బాధ్యతలను తెలుసుకొనేలా చేయడం. (ఉదా : తరగతిగదిని శుభ్రంగా ఉంచుకోవడం, బెంచీలు, కుర్చీలు క్రమపద్ధతిలో వేసుకోవడం, క్రమశిక్షణతో మెలగడం, సహవిద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగడం, పాఠశాలకు సమయానికి రావడం, ప్రార్థనలో పాల్గొనడం, ఉపాధ్యాయులపట్ల గౌరవభావాన్ని కలిగివుండడం, వ్యక్తిగత, జట్టుపనులలో పాల్గొనడం మొదలైనవి)
- ◆ విద్యార్థుల బాధ్యతల (తరగతిగదిలో / పాఠశాలలో) జాబితాను తయారుచేసి, ప్రదర్శించడం.

**కృత్య విధానము** :

- ❖ విద్యార్థులు తరగతిలో, పాఠశాలలో తమతమ బాధ్యతలను నిర్వహించుటకు కమిటీలను ఏర్పాటుచేయడం. ఉదాహరణకు తరగతి పరిశుభ్రత కమిటి, పాఠశాల పరిశుభ్రత కమిటి. లైబ్రరి కమిటి; క్రమశిక్షణ కమిటి; ఆరోగ్య కమిటి.
- ❖ ప్రతి కమిటీకి ఒక నాయకుడు/లీడర్ని నియమించడం.
- ❖ తరగతిలోని కమిటీల పనితీరును తరగతి లీడరు పర్యవేక్షించడం. పాఠశాల కమిటీల పనితీరును పాఠశాల లీడరు పర్యవేక్షించాలి.
- ❖ తరగతి కమిటీలు క్లాస్‌టీచర్ సలహాలతో పనిచేస్తాయి. పాఠశాల కమిటీలు హెడ్‌మాస్టర్ సూచనలమేరకు పనిచేయాలి.

**ఆలోచింపజేసే ప్రశ్నలు** :

1. పాఠశాలలో ఎవరెవరు ఉంటారు? ఏం పనులు చేస్తారు?
2. అన్నిపనులు అందరు చేయగలరా? ఎందుకు? కారణాలు ఏమి?
3. ఎవరి పనులు వారు చేయకపోతే ఏమౌతుంది?
4. పాఠశాలలో ఒక విద్యార్థిగా మీరేం చేయాలి?

**అదనపు కృత్యాలు** :

1. కమిటీల పనితీరుపై రెండునెలలకొకసారి సమావేశమై సమీక్ష చెయ్యాలి.
2. ప్రతి కమిటీవారు చేసిన పనులపై నివేదికలు రాయించడం.

**పాఠశాలలో విద్యార్థుల వ్యక్తిగత బాధ్యతలు :**

- ✦ పాఠశాల నిబంధనలు పాటించడం – ప్రతిరోజు హాజరు అవడం. శుభ్రమైన దుస్తులు/స్కూల్ యూనిఫాం ధరించడం.
- ✦ ప్రార్థన సమయానికి పాఠశాలకు రావడం.
- ✦ పాఠశాల సమయం ముగిసిన తరువాతే ఇంటికి వెళ్ళడం.
- ✦ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావాన్ని కలిగివుండడం.
- ✦ క్రమశిక్షణ కలిగిఉండడం.
- ✦ పాఠశాల కార్యక్రమాలలో, జాతీయ పండుగలలో తప్పనిసరిగా పాల్గొనడం.
- ✦ అవసరమైనపుడు, ప్రధానోపాధ్యాయుని అనుమతితో ఇంటికి వెళ్ళడం.
- ✦ మధ్యాహ్న భోజన సమయంలో ఆరోగ్యపు అలవాట్లను పాటించడం. భోజనాన్ని అవసరమైనంత మేరకే పెట్టుకోవడం, తిన్న తరువాత పళ్ళాలను శుభ్రంచేసి / కడిగి యథాస్థానంలో ఉంచడం.
- ✦ పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను సరైనవిధంగా పారవేయడం.
- ✦ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం. వాటికి నీరుపోయడం, వాటిని సంరక్షించడం.
- ✦ తరగతిలో తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడం.
- ✦ స్వేచ్ఛగా, భయం, బిడియం లేకుండా ప్రశ్నలు అడగడం, నేర్చుకోవడం.
- ✦ లైబ్రరీ పుస్తకాలు తీసుకొని చదవడం, మంచి విషయాలు, ఇతర విద్యార్థులతో చర్చించుకోవడం.

**సమాజం పట్ల విద్యార్థుల బాధ్యతలు :**

- ✤ ఇతరుల పట్ల గౌరవభావం కలిగివుండడం.
- ✤ దురలవాట్లకు దూరంగా ఉండడం.
- ✤ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం.
- ✤ రోడ్లపై చెత్త వేయడం, ఉమ్మడం వంటివి చేయకుండా ఉండడం.
- ✤ ఆపదలో / కష్టాలలో ఉన్నవారిపట్ల సహానుభూతి కలిగిఉండడం, వారికి సహకరించడం.
- ✤ వృక్ష, జంతుజాలాలపట్ల ప్రేమను కలిగివుండడం / జీవహింసకు దూరంగా ఉండడం.
- ✤ చారిత్రాత్మక కట్టడాలను సంరక్షించడం.
- ✤ సహజవనరులను విచక్షణతో వినియోగించడం.
- ✤ సమాజాభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకోవడం.
- ✤ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం.

# సమాచారము - డాక్యుమెంటేషన్

**ఉపఅంశం** : పోస్టరు

**కృత్యము** : వివిధ రకాల అంశాలపై పోస్టర్లను తయారుచేయడం, మరియు ప్రదర్శించడం.

**ఆశించిన ఫలితము** :
- ✤ వివిధ అంశాలకు సంబంధించి సృజనాత్మకంగా పోస్టర్లు తయారుచేస్తారు.
- ✤ పోస్టర్లు తయారుచేయడంలో నైపుణ్యత పొందుతారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ వివిధ పత్రికలనుండి యాడ్స్ సేకరించి ఆయా సమయ సందర్భానుసారంగా పోస్టర్లు తయారుచేయించి గోడపత్రికలో ప్రదర్శింపజేయాలి, అందుకు సహకరించాలి.
- ◆ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను సేకరించాలి.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. మీరు చూసిన / చదివిన పోస్టర్ల గురించి చెప్పండి?
2. పోస్టర్లు ఉద్దేశ్యం ఏమిటి?
3. పోస్టర్లలో ఉండే అంశాలు ఏమిటి? ఆకర్షించే అంశాలు ఏవి?
4. పోస్టర్లలో భాష ఎలా ఉంటుంది? ఎందుకు?
5. పోస్టర్ల లేఅవుట్ ఎలా ఉంటుంది?

**కృత్య విధానము** :
- ✦ విద్యార్థులందరూ తమకు అందుబాటులో ఉన్న పోస్టర్లను మరియు వార్తాపత్రికలలోని ప్రకటనలను తీసుకురమ్మని ప్రోత్సహించడం.
- ✦ పోస్టర్లు తయారుచేయడానికి కావల్సిన అంశాలను ఎన్నుకొని దానికి తగినట్లు గ్రూపులలో పోస్టర్లు తయారుచేయడం.
- ✦ విద్యార్థులు ఎంచుకున్న అంశానికి సంబంధించిన లేఅవుట్‌పై మరియు భాషపై ఉపాధ్యాయుడు సలహాలు, సూచనలు ఇవ్వాలి.
- ✦ ఒక జట్టు ప్రదర్శించిన పోస్టరుపై ఇతర జట్లు తమ అభిప్రాయాలను, సూచనలను తెలియజేయాలి.
- ✦ ఆకర్షణీయమైన పోస్టర్లు తయారీలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గుర్తించుట.
- ✦ విద్యార్థులచే తాము చేసిన పోస్టర్ల ప్రదర్శన

**అదనపు కృత్యాలు** :
1. ఈక్రింది సందర్భాలలో / అంశాలలో పోస్టరుగా తయారుచేయించి గోడపత్రికలో ప్రదర్శింపచేయాలి. ఉదా॥ పండుగలు, తిరునాళ్ళు, దేశనాయకులు, జిల్లా ప్రముఖులు, ప్రాముఖ్య స్థలాలు, మీరు మెచ్చిన వ్యక్తి, పాఠశాలలో జరిగే కార్యక్రమాలపై సామాజిక అంశాలపై.
2. వివిధ సందర్భానుసారంగా విద్యార్థులచే కరపత్రాలను తయారుచేయించడం.

# వస్తువులు - నమూనాల తయారి

**ఉపఅంశం** : ఆకృతులు – నమూనాలు

**కృత్యము** : అక్షరాలు, అంకెలు, వేలిముద్రలు, గింజలు, ఆకులు, పువ్వులతో వివిధ ఆకృతులను తయారుచేయడం.

**ఆశించిన ఫలితము** : వివిధ పదార్థాలనుపయోగించి ఆకృతులను తయారుచేస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ అక్షరాలు, అంకెలు, వేలిముద్రలుపయోగించి వివిధ ఆకృతులను ప్రదర్శించాలి.
- ◆ పువ్వులతో వివిధ ఆకృతులను చేసి ప్రదర్శించాలి.
- ◆ కాగితపు టోపి తయారుచేసి ప్రదర్శించాలి.

**కృత్య విధానం** :
- ✤ విద్యార్థులను జట్లుగా విభజించి పువ్వులు, కాగితాలలో వివిధ ఆకృతులను తయారుచేయడం.
- ✤ తయారుచేయడంలో మెళకువలు నేర్పడం, అందరు విద్యార్థులు పాల్గొనేలా చూడడం.

**అదనపు కృత్యాలు** :
1. కాగితాలతో కవర్లు, చేతిసంచులు తయారుచేయించుట.
2. బొకేలు తయారుచేయించడం.
3. ఆకులతో వివిధ జంతు ఆకారాలు తయారుచేయుట.

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆకృతులు |
| **కృత్యము** | : | అలంకరణ వస్తువులు తయారీ (గాజు, కాగితము, పాతబట్టలు, వాడిపారేసిన రకరకాల వస్తువులు) |
| **ఆశించిన ఫలితము** | : | పాతవస్తువులు, వాడిన వస్తువులతో అలంకరణ వస్తువులు తయారుచేయడము. తద్వారా ఆనందం, సృజనాత్మకత, సహకార భావనలు పెంపొందుతాయి. |

**ఉపాధ్యాయునికి సూచనలు** :

- ◆ ఉపాధ్యాయులకు విద్యార్థులకు అలంకరణవస్తువుల తయారీ గురించి శనివారము సాయంత్రము తగు సూచనలు, సలహాలు ఇవ్వాలి. సోమవారము పాఠశాలకు వచ్చేటప్పుడు వాటిని తీసుకుని రమ్మని తెలపాలి.
- ◆ ఇంటిదగ్గర పెద్దవారితో వ్యర్థపదార్థాలనుండి వస్తువులు ఎలా తయారుచేయాలో తెలుసుకోమని చెప్పాలి.

**కృత్య విధానం** :

- ✤ విద్యార్థులు జట్లలోను, ఇండ్లదగ్గర పెద్దవారిని, అక్కలు, అన్నలను అడిగి తెలుసుకొని రకరకాల అలంకరణ వస్తువులు తయారుచేసి తీసుకుని వచ్చి తరగతిగదిలో ప్రదర్శిస్తారు.
- ✤ విద్యార్థులు తెచ్చిన వివిధ రకాల వస్తువులతో ఈక్రింది నమూనాలు చేయాలి.

  **కాగితము :** రంగు కాగితములతో రకరకాల దండలు, జెండాలు, వేడుకలకు డిజైన్ పేపర్ దండలు తయారుచేయుట.

  **గాజులముక్కలు :** పగిలిన గాజులు కొద్దిగా వేడిచేసి చైన్‌లింగ్‌లాగా అతికించి ప్రవేశ ద్వారమునకు అలంకరణగా వ్రేలాడదీయవచ్చు.

  **కాగితపు కప్పులు :** వీటిని కత్తిరించి మాలలుగా తయారుచేసి ఫోటోలకు కిటికీలకు మాలలుగా అలంకరించవచ్చు.

  **పాతబట్టలు :** రంగురంగులవి కత్తిరించి ద్వారములకు, కిటికీలకు, సంచులకు డిజైన్‌లుగా తయారుచేయవచ్చు.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :

1. పాతపడిన, పారేసిన వస్తువులతో కూడా రకరకాల అలంకరణసామాగ్రి/వస్తువులు ఎలా తయారుచేస్తావు?
2. సృజనాత్మకంగా అలంకరణవస్తువుల తయారీకి నీకు ఏమేమి అవసరమని భావిస్తున్నావు?
3. మనం రోజూ వాడిపారేసే వస్తువులు ఏమి? వాటిని తిరిగి ఎలా ఉపయోగించు కోవచ్చు?

**అదనపు కృత్యాలు** :

1. కాగితపు గ్లాసులు, కప్పులు కత్తిరించి Pen stand తయారుచేయించాలి.
2. వాడిన బల్బులనుపయోగించి Flowervases తయారుచేయించాలి.
3. పాతబట్టలనుపయోగించి Door curtains తయారుచేయించాలి.

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆకృతులు |
| **కృత్యము** | : | ఇసుక, గమ్, దారం, గాజులు, నార, పీచు, సీసాలు మొ॥గు వాటితో ఆకారాలు. |
| **ఆశించే ఫలితం** | : | ✤ నమూనాలలో ఆకృతులను ఏర్పరచడంలో విద్యార్థులు ఆనందాన్ని పొందుతారు.<br>✤ పనికిరాని వస్తువులతో కొత్త ఆకారాలను తయారుచేయగల్గుతారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | విద్యార్థులను జట్లుగా చేసి, ఒక్కొక్క ఆకృతి తయారీకి కావలసిన వస్తువులను ఇవ్వాలి. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. బెండకాయ ముక్కలు తరిగినవెంటనే గచ్చుపైన ముఖంవైపు ఉంచితే ఏమౌతుంది?<br>2. బెండముక్కలను ఇంకులో ముంచి కాగితంమీద ఒత్తితే ఏం జరుగుతుంది?<br>3. ఇసుకతో ఆడుతూ కాలితో ఇసుకగూడు కట్టావా? నీకేమన్పించింది. |
| **కృత్య విధానం** | : | ఒక్కో జట్టుకు ఒక పనిని అప్పజెప్పాలి.<br>✦ మొదటి జట్టుకు దారం, గమ్/ఫెవికాల్, కాగితం వంటి వస్తువులు ఇచ్చి అట్టపైగాని, కాగితంపైగాని గమ్ పూసి, దారాన్ని (ట్వైన్‌దారం, పూలదారం) రకరకాలుగా అమర్చుతూ రాసిన గమ్‌పై అతికేటట్లు చూడాలి.<br>✦ రెండవ జట్టువారు గాజులు, గమ్/ఫెవికాల్, దళసరిఅట్ట – మొ॥ వస్తువులు ఇచ్చి ఈ రెండవజట్టులోని విద్యార్థులచే గాజుముక్కలను అతికించడం కొరకు ముందుగా అట్టపై కావలసిన ఆకారాన్ని గీసుకుని దానిపై జిగురుపూసి, గాజుముక్కలను ఆకారానికి తగినట్లు అంటించాలి.<br>✦ మూడవజట్టు కొరకు కొబ్బరిపీచు, జనపనార, ఫెవికాల్/జిగురు, దళసరిఅట్టలను ఇచ్చి పీచును కావలసిన ఆకారంగా మలచుకొని – జిగురుపూసిన అట్టపై అతికించడం చేయించాలి.<br>✦ నాల్గవజట్టులోని పిల్లలను ఇసుక, అద్దాలు, మెరుపుబిళ్ళలు, కుందన్స్, జిగురు/ఫెవికాల్, దళసరి అట్ట/ఫ్రేములను ఇచ్చి ఇసుకను ఒక పొరగా పరచడానికి ఫ్రేమ్‌పై గమ్ రాసి ఇసుక పొరను వేయాలి. ఆతర్వాత ఇసుక పొరలోని రేణువులన్నీ అతికాయనుకున్న తర్వాత అక్కడక్కడ మెరుపుబిళ్ళలు, కుందన్స్, అద్దాలు గమ్ పూసి అంటించాలి. చక్కటి ఆకృతి ఏర్పడేవరకు పూర్తిచేయాలి.<br>✦ ఐదవజట్టువారు సీసాలు/హోమియోపతి సీసాలు, ఫెవికాల్, ఇసుక, గాజుపలక – వంటి వస్తువులను తెచ్చి ఆకృతులుగా మార్చమనాలి. చిన్న సీసాలలో ఇసుకపోసి ఆయా సీసాలను ఫెవికాల్ పూసిన గాజుపలకపై పెట్టి అతికించాలి. వివిధ రంగులను కలిపిన ఇసుక రేణువులు సీసాలలో కన్పించి వీటిని అతికించే విధానం – చక్కటి నిర్మాణంగా కన్పించేలాగా చేయాలి. |
| **అదనపు కృత్యాలు** | : | 1. డ్రాయింగ్ కాగితంపై వేసిన బొమ్మకు చక్కటి ఆకృతి రావడానికి గీసిన రేఖల వెంబడి జిగురు/ఫెవికాల్ పూసి చెమ్కీదారాలను అతికించి ఆకర్షణీయంగా చేయడం.<br>2. ఆకులతో జంతువుల ఆకారాలు చేయడం.<br>3. పూలరేకులను అమర్చి ఆకారాలను చేయడం. |

# గృహ యాజమాన్యం

**ఉపఅంశం** : ఇల్లు, ఇంటి పరిసరాలు శుభ్రత

**కృత్యము** : ఇల్లు - ఇంటి పరిసరాలు, స్నానాల గదులు మరియు మరుగుదొడ్లు - శుభ్రంగా ఉంచుకోవడం, ఇంట్లోని వస్తువులను శుభ్రపరచుకోవడం.

**ఆశించిన ఫలితము** :
- ✤ ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటారు. దీనిని తమ బాధ్యతగా గుర్తిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ విద్యార్థులను బృందాలుగా చేయాలి.
- ◆ బృందంలో గల నల్గురు/ఐదుగురి విద్యార్థులకు ఒక్కొక్క కృత్యాన్ని ఇవ్వాలి.
- ◆ చర్చించాలి.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. మన చుట్టూ ఉన్న పరిసరాలను ప్రతిరోజు శుభ్రంగా ఉంచకపోతే ఏమౌతుంది?
2. మనం భోజనం చేసే చోటు శుభ్రంగా ఎందుకు ఉండాలి?
3. మనం తినే కంచాలు, తాగే గ్లాసులు ప్రతిసారి ఎందుకు శుభ్రంగా కడగాలి?
4. మరుగుదొడ్లను వాడాక ఏవిధంగా శుభ్రంగా ఉంచాలి?
5. మూత్రశాలల్లో బాగా నీరెందుకు పోయాలి?
6. మన ఇంటిలోకాని మన తరగతిగదినికాని ప్రతిరోజు ఎందుకు ఊడ్చుకోవాలి?

**కృత్య విధానం** : జట్లలో ప్రతి వారికి ఒక్కొక్కపనిని కేటాయించాలి.
- ✤ తరగతిగదిని పరిశుభ్రంగా ఉంచడం.
- ✤ బల్లలు, బెంచీలను శుభ్రంగా తుడుచుకోవడం.
- ✤ దుమ్ము, ధూళి, బూజు లేకుండా శ్రద్ధ తీసుకోవడం.
- ✤ వాడే మరుగుదొడ్లు, మూత్రశాలల్లో నీటిని బాగా వినియోగించడంతోబాటు కొన్ని రకాల 'హార్పిక్' వంటి రసాయన సంబంధిత వస్తువులు బజారులో దొరుకుతాయి. వాటిని ఎలా వినియోగించాలో తెల్పడం.
- ✤ స్నానాలగది పరిశుభ్రతకు ఫినాయిల్ వాడకం గురించిన అవగాహన కల్పించడం.

ఆయా జట్లు ఆరోగ్య, పారిశుద్ధ్యకమిటీల సహాయంతో పాఠశాలల్లోను, అదేవిధంగా ఇంట్లో కూడ చేసుకునే అవకాశం పొందుతారు.

**అదనపు కృత్యాలు** :
1. వంటగదిలో ఏర్పడే చెత్తాచెదారంలో ఆకుకూరలు, కాయగూరలు తరిగేటప్పుడు వచ్చే తడిచెత్తను, దుమ్ము ధూళి చెత్తకాగితాలు, ఇతర పొడిచెత్తను వేర్వేరుగా వేయమనడం. వారి అనుభవాలను చెప్పించడం.
2. తడిచెత్తను ఇంటి పరిసరాలలోగల ఆవరణలో గోతిని తవ్వి - వేయడం, మట్టి పొరలుగా వేస్తూ కంపోస్టుఎరువు తయారికి సిద్ధంచేయడం లాంటివి చేయించడం.
3. పాఠశాలలో కూడ కంపోస్టు తయారి.

**ముఖ్యాంశాలు :**

- విద్యార్థులు తాము ఉపయోగించే ప్రదేశాలు, వస్తువులను శుభ్రంగా ఎలా ఉంచుకుంటున్నారో తెల్పుతూ, ఇతర విద్యార్థులకు కూడా అవగాహన కల్పించడం.
- తాను కూర్చునే ప్రదేశం బల్ల, బండ, కుర్చీ ఏదైనాకాని శుభ్రంగా ఉంచాలని తెలుసుకోవడం.
- మూత్రశాలల్లో, మరుగుదొడ్లలో నీరు ఎక్కువగాను, విసర్జనకు ముందు తర్వాత ప్యాన్‌లో నీరు బాగా పోయాలని తెలుసుకోవడం.
- తాను తిన్న కంచం, పాత్రలను శుచి శుభ్రంగా ఉంచుకోవడం, కిందపడిన ఆహారపదార్థాలు తినకూడదని తెలుసుకోవడం, తిన్నచోట శుభ్రపరచాలని తెలుసుకోవడం.
- వాడిన పాత్రలను శుభ్రంగా కడిగి, తుడిచి, వాటి స్థానాల్లో ఉంచడం.
- బల్లలు, ఫ్యాన్లు, ఇంట్లో బూజు, గూళ్ళలో దుమ్ము ధూళి లేకుండా శుభ్రపరచడం.
- తరగతిగది ప్రారంభంలో, మధ్యాహ్న సమయంలో, స్వల్ప విరామ, భోజన విరామ సమయాలలో కిందపడిన కాగితంముక్కలు, పెన్సిలుపొట్టు, చాక్‌లెట్ల రేపర్లు, కవర్లు వంటి వాటిని ప్రతిఒక్క విద్యార్థి ఏరి తరగతిగదిలో ఉంచిన చెత్తబుట్టలో వేయించాలి.
- పాఠశాల ఆవరణలోను తరగతిగది చుట్టుపక్కల ఉన్న చెత్తను చెత్తబుట్టలో వేయడం.
- నీరు – మురుగునీరుగా మారకుండా అడ్డంగా ఉన్న చెత్తను రాళ్ళురప్పలను తీసివేసి పేరుకుపోయిన మట్టిని తీసి పెరుగుతున్న మొక్కలకు ఆ నీటిని పారించడం చేయాలి.

# వినియోగదారుల విజ్ఞానము

**ఉపఅంశం** : వస్తువుల ధరలను పోల్చడము

**కృత్యము** : వస్తువులు కొనేముందు వివిధ దుకాణాలలో ధరలను వాకబుచేయడము, ఒక వస్తువు యొక్క ధరలలో గల వ్యత్యాసాలను గుర్తించడం.

**ఆశించిన ఫలితము** : వస్తువులు కొనేముందు ధరలను తెలుసుకుంటారు, ధరలలో గల వ్యత్యాసాలను గుర్తిస్తారు, అందుకు కారణాలు తెలుసుకుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : విద్యార్థులు తమ తమ కొనుగోలు అనుభవాలను, తమ తల్లిదండ్రుల అనుభవాలను తెలుసుకొని రమ్మని చెప్పాలి. తరగతిగదిలో చర్చించాలి.

**కృత్య విధానం** : ముందురోజే వివిధ దుకాణాలకు వెళ్ళి వస్తువులు-ధరలు వాకబుచేసి ఆ ధరకు కారణం తెలుసుకొని తమ నోటుపుస్తకాలలో రాసుకొని వచ్చి తరగతిగదిలో చర్చించాలి.

| వ.సం. | వస్తువు పేరు | ధర | అధిక ధరకు కారణము |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |
| 6 | | | |

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
- ✤ ఒకే వస్తువు ధరలలో వ్యత్యాసము ఎందుకున్నది?
- ✤ ఎక్కువ ధర ఉన్నంతమాత్రాన వాటినే కొనాలా? ఎందుకు?
- ✤ ధర ముఖ్యమా? నాణ్యత ముఖ్యమా?
- ✤ మనకున్న Budget లో నాణ్యత గల వస్తువులను కొనడంలో గల మెళకువలు తెలుసుకోండి?

**అదనపు కృత్యాలు** :
1. నీ తల్లిదండ్రులవెంట కూరగాయల సంతకు వెళ్ళి ధరలను వాకబుచేసే విధానము, కొనుగోలు చేసే పద్ధతి తెలుసుకోండి.
2. చౌకధరలో లభిస్తున్న వస్తువులు అన్నీ కొనుగోలు చేయవచ్చా?
3. దుకాణాల్లో, సంతల్లో మొదట ఎక్కువ ధరచెప్పి, తర్వాత తగ్గించి ఇస్తుంటారు. కారణం కనుక్కోండి?
4. ఎక్కువ మొత్తం (సంఖ్య) లో వస్తువులు కొనుగోలు చేస్తే ధర తగ్గిస్తారు. ఎందుకో కనుక్కోండి.

# పర్యావరణ విద్య

**ఉపఅంశం** : ప్రకృతి – ఆకారాలు, క్రమాలు

**కృత్యము** : ప్రకృతిలోని మొక్కల భాగాలలో కనిపించే ఆకారాలను, క్రమాలను గుర్తించి సేకరించడం, ప్రదర్శించడం.

**ఆశించిన ఫలితము** : మొక్కల భాగాల ఆకారాలలోనూ, నిర్మాణాలలోనూ తేడాలున్నాయని గుర్తిస్తారు. వాటిని చూసి ఆనందిస్తాడు. ప్రకృతి వైవిధ్యాలను అభినందిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :

◆ పరిసరాలలో లభించే వివిధ ఆకారాలలో ఉండే మొక్కల ఆకులను సేకరించమని చెప్పడం.

◆ ప్రకృతిలో వివిధ ఆకారాలు, నిర్మాణాలు ఉన్న మొక్కలున్నాయనే విషయాన్ని అవగాహన చేయించడం.

◆ సేకరించిన మొక్కల భాగాలను ఏవిధంగా భద్రపరచాలో విద్యార్థులకు వివరించాలి.

**కృత్య విధానం** :

✤ వివిధ మొక్కల భాగాలను సేకరించమని చెప్పాలి.

✤ భాగాలను పుస్తకాలలోగానీ, నీడలోగాని ఉంచి పూర్తిగా ఆరనివ్వాలి.

✤ ఆరిన మొక్కల భాగాలను స్క్రాపుపుస్తకంలోగానీ, చార్టుపైగానీ అతికించి తరగతిలో ప్రదర్శించాలి.

✤ ఆకారాలలో, సైజులలో ఉండే వైవిధ్యాన్ని పిల్లలచే చెప్పించాలి.

**అదనపు కృత్యాలు** :

1. వార్తాపత్రికలు, ఇంటర్‌నెట్ నుండి విభిన్న నమూనా చిత్రాలు సేకరించుట.
2. దగ్గరలోని పార్కుకు వెళ్ళి భిన్న ఆకారాలున్న మొక్కలను సందర్శించుట.
3. పాఠశాలలోని భిన్న ఆకారాలున్న మొక్కలను గుర్తించుట.
4. పిల్లలచే హెర్బేరియం తయారుచేయించుట.

# 5వ తరగతి

# పౌష్టికాహారం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | సమతుల ఆహారం |
| **కృత్యము** | : | వివిధ ఆహారపదార్థాలను సేకరించడం, వాటిలోని పోషకవిలువలను గుర్తించి, వర్గీకరించడం. |
| **సేకరించవలసిన ఆహారపదార్థాలు** | : | ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పుగింజలు, పాలు, గుడ్లు, పెరుగు, నెయ్యి మొదలగు ఆహారపదార్థాలను సేకరించడం. |
| **ఆశించిన ఫలితం** | : | ✤ వివిధ ఆహారపదార్థాలలో ఉండే పోషక విలువలను తెలుసుకుంటారు.<br>✤ అన్ని రకాల ఆహారపదార్థాలను తినడానికి విద్యార్థులు ఇష్టపడతారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులకు, వివిధ ఆహారపదార్థాల శాంపిల్స్‌ను వ్యక్తిగతంగా గాని / జట్లుగా గాని తీసుకునిరమ్మని చెప్పడం.<br>◆ పోషకవిలువల ఆధారంగా (ప్రధానంగా శక్తినిచ్చే ఆహారపదార్థాలు, పెరుగుదలకు తోడ్పడే ఆహారపదార్థాలుగా వర్గీకరించడం) ఆహారపదార్థాలను వర్గీకరించడం.<br>◆ ఎ) శక్తినిచ్చే ఆహారపదార్థాలు – ఉదా : కార్బోహైడ్రేట్స్ (పిండిపదార్థాలు)<br>బి) పెరుగుదలకు ఉపయోగపడే ఆహారపదార్థాలు – ఉదా : ప్రోటీన్స్ (మాంసకృత్తులు)<br>సి) ఆరోగ్యాన్నిచ్చే ఆహారపదార్థాలు – పండ్లు, కూరగాయలు.<br>◆ గత వారంరోజులుగా తాను తిన్న ఆహారపదార్థాల పేర్లు రాసి, వాటిలో ఏరకమైనవి ఎక్కువగా తీసుకోవాలో గుర్తించాలి. |
| **కృత్య విధానము** | : | ✦ సేకరించిన వివిధ ఆహారపదార్థాలను శక్తినిచ్చే పదార్థాలుగా, పెరుగుదలకు తోడ్పడే పదార్థాలుగా వర్గీకరింపచేయడం.<br>✦ ఆహారపదార్థాల పేర్లు రాసి ప్రదర్శింపచేయడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. ప్రతిరోజు మీరు తినే ఆహారపదార్థాలు ఏవి?<br>2. పెరుగుదలకు తోడ్పడే పదార్థాలు ఏం తింటున్నారు?<br>3. సమతుల ఆహారం తీసుకోవడానికి, కుటుంబ ఆర్థికస్థితికి సంబంధమేమి? |
| **అదనపు కృత్యాలు** | : | 1. సమతుల ఆహారం యొక్క ప్రాధాన్యతను తెలుపుతూ, శక్తినిచ్చే, పెరుగుదలకు తోడ్పడే ఆహారపదార్థాల జాబితాను చిత్రపటాల సహాయంతో చార్టును తయారుచేసి ప్రదర్శించడం.<br>2. సమతుల ఆహార విషయాలకు సంబంధించిన వార్తాపత్రికలలో ప్రచురించిన వార్తలను సేకరించి తరగతిలో ప్రదర్శించుట.<br>3. ఆహారపు లోపాలతో వచ్చే వ్యాధులను చార్టురూపంలో రాసి తరగతిలో ప్రదర్శించడం. |

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆహారపు మేళా |
| **తీసుకురావలసిన ఆహారపదార్థాలు** | : | విద్యార్థులు, వారి వారి ఇళ్ళలో వండిన వివిధ రకాల ఆహారపదార్థాలను తీసుకొనిరావడం. |
| **ఆశించే ఫలితము** | : | ✤ వివిధ రకాల వంటకాలను పరిశీలించి, తెలుసుకుంటారు.<br>✤ విద్యార్థులు, సహవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహారాన్ని వడ్డించడం, కలిసి భుజించడం ద్వార ఆనందాన్ని పొందుతారు.<br>✤ వంటకాలను వడ్డించే విధానంలోని మెళకువలు తెలుసుకుంటారు, వాటిని పాటిస్తారు.<br>✤ ఒకరికొకరు సహకరించుకోవడం, బాధ్యతలను నిర్వహించడం, సహనం పాటించడం వంటి విలువలను పెంపొందించుకుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులు, వారి వారి ఇళ్ళలో వండిన వివిధరకాల ఆహారపదార్థాలను తీసుకునిరమ్మని చెప్పడం.<br>◆ ఒక్కొక్క విద్యార్థికి, ఒకరకమైన వంటకాన్ని (విద్యార్థి ఇష్టప్రకారము / అనుకూలత ప్రకారము) కేటాయించడం.<br>◆ విద్యార్థులు, వంటకాలను వడ్డించుటకు, తినుటకు అవసరమయ్యే సామాగ్రిని కూడా తీసుకునిరమ్మని చెప్పడం.<br>◆ ఉపాధ్యాయుడు, వంటకాలను వడ్డించే విధానంపై, మెళకువలపై సహ విద్యార్థులతో, ఇతర ఉపాధ్యాయులతో ఆహారాన్ని పంచుకునే విధానంపై, పండుగ ఏర్పాటుకు ముందు తరగతిగదిలో చర్చించడం. |
| **కృత్య విధానం** | : | ✦ విద్యార్థులు తీసుకునివచ్చిన వివిధ వంటకాలను వడ్డించడానికి వీలుగా/ సౌకర్యంగా అమర్చుకోవడం.<br>✦ వంటకాలను వడ్డించడానికి కొంతమంది విద్యార్థులు బాధ్యత తీసుకోవడం.<br>✦ వంటకాలను సహవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు వడ్డించడం, అందరు కలిసి భుజించేలా చూడడం.<br>✦ ఎలాంటి అసౌకర్యం లేకుండా, అజాగ్రత్త లేకుండా చూసుకోవడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. భోజనకార్యక్రమం సమయంలో సాధారణంగా మనం ఎదుర్కొనే సమస్య లేమిటి?<br>2. ఆ సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవచ్చును?<br>3. భోజన సమయంలో ఆహారపదార్థాల వ్యర్థాన్ని ఎలా నిరోధించవచ్చు? |
| **అదనపు కృత్యాలు** | : | 1. వివిధ రకాల వంటపాత్రలను ప్రదర్శించడం, విద్యార్థులు వారి వారి ఇళ్ళలో నుండి తెచ్చిన వివిధ వంటపాత్రలను ప్రదర్శించి, వాటి పేర్లను, ఉపయోగాలను సూచించడం.<br>2. ఆహారపు పండుగ (Food Festival) పై విద్యార్థుల ప్రతిస్పందనలు నోటుబుక్‌లో రాయించి చదివించడం. |

# ఆరోగ్యవిద్య

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | పారిశుధ్యం – వస్తువుల శుభ్రత |
| **కృత్యము** | : | ✤ దువ్వెన, టూత్‌బ్రష్, టంగ్‌క్లీనర్; వాటర్‌బాటిళ్ళను, స్కూల్‌బ్యాగ్ మొదలైన వాటిని శుభ్రపరచుకోవడం.<br>✤ వస్తువులను యధాస్థానంలో ఉంచడం వల్ల లాభాలు తెలుసుకుంటారు. |
| **ఆశించే ఫలితము** | : | విద్యార్థులు ప్రతిరోజూ తాము వాడే వస్తువులను శుభ్రపరచుకుంటారు. ఆరోగ్యపు అలవాట్లను పెంపొందించుకుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | తాము రోజూ వాడే వస్తువులు తీసుకురమ్మని ముందురోజు సాయంత్రం విద్యార్థులకు చెప్పడం – తర్వాత తగు సూచనలు ఇవ్వడం. |
| **విధానము** | : | విద్యార్థులు తాము రోజూ వాడే వస్తువులు శుభ్రంగా ఉంచుకున్నవారిచే ప్రదర్శించి చూపడం, ప్రతి వస్తువును శుభ్రపరిచే విధానాన్ని చూపుతూ వివరించడం. వస్తువులను తిరిగి యధాస్థానములో ఉంచడము. వాటర్‌బాటిల్స్‌ను శుభ్రపరచుటకు బ్రష్ లేదా కట్టెతో బ్రష్ తయారుచేసి శుభ్రపరచడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. మనం రోజూ వాడే వస్తువులను శుభ్రంగా ఉంచుకోకపోవడం వలన నష్టమేమి?<br>2. వాటర్‌బాటిల్స్‌ను మూతతోసహా, బ్రష్‌తోనే ఎందుకు శుభ్రంచేయాలి?<br>3. శుభ్రపరచడానికి Forced గా వచ్చే కుళాయి నీటిని ఉపయోగించడం సరైనదేనా? ఎందుకు?<br>4. వస్తువులు ఉపయోగించిన తరువాత వాటి స్థానంలోకాక వేరే స్థానంలో ఉంచడం వలన నష్టమేమి? |
| **అదనపు కృత్యాలు** | : | 1. ప్రతిరోజూ వాడే వస్తువులను గోరువెచ్చని నీటితో, బ్రష్ ఉపయోగించి శుభ్రం చేసి దుమ్ముచేరని ప్రదేశాలలో ఉంచుకొనుట.<br>2. రోజూ వాడే వస్తువులు ఇతరులవి వాడకుండా చూచుట.<br>3. వస్తువులు వాడిన తర్వాత తిరిగి అదే స్థానంలోనే ఎందుకు ఉంచాలో చర్చించడం.<br>4. ఇంట్లో ఉపయోగించే పళ్ళెం, గ్లాసు, చెప్పులు, బూట్లు, సాక్స్, పుస్తకాలు, బట్టలు పెట్టే గూళ్ళను (Shelves) శుభ్రంగా ఉంచుకునే విధానంపై చర్చించడం. |

## జనాభా విద్య

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | వంశవృక్షం |
| **కృత్యము** | : | తాతనుండి తనవరకు వంశవృక్ష పటము గీయడం మరియు జనాభాను లెక్కించడం. |
| **ఆశించిన ఫలితము** | : | వంశంలోని కుటుంబాలు, సభ్యుల సంఖ్యను తెలుసుకుంటారు: వివిధ కుటుంబసభ్యుల మధ్యగల సంబంధాలను (వావివరుసలు) గుర్తిస్తారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులను జట్లుగా విభజించడం, కుటుంబంలోని సభ్యులగురించి చర్చించడం.<br>◆ ప్రస్తుతం కుటుంబాలకు, గత కుటుంబాలకు (పూర్వకాలంలో) గల వ్యత్యాసాలను చర్చించడం. |
| **ఆలోచింపజేసే ప్రశ్నలు** | : | 1. కుటుంబం అంటే ఏమిటి?<br>2. మీకుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు?<br>3. చిన్నకుటుంబానికి, పెద్దకుటుంబానికి గల తేడాలేవి? ఏవి మంచివి? ఎందుకు? |
| **కృత్య విధానము** | : | ✤ విద్యార్థులను జట్లుగా విభజించి, వారి వంశవృక్షాన్ని గీయడం (పేర్లతో) (తాత నుండి తమ వరకు). ప్రస్తుతం ఉన్న వారి జనాభాను లెక్కించడం.<br>✤ ఒకరి వంశవృక్షాన్ని ఇతరులకు చూపుట.<br>✤ తరగతిలో ప్రదర్శించి వివరించుట, వివిధ వంశవృక్షాల మధ్యగల పోలికలను, బేధాలను చర్చించడం. |
| **అదనపు కృత్యాలు** | : | 1. చిన్న కుటుంబాలు, పెద్ద కుటుంబాలను పోల్చడం.<br>2. కుటుంబంలోని వ్యక్తులమధ్య ఉండే వావివరుసలు తెలుసుకోవడం, ఉపయోగించడం. దీనిపై క్విజ్ కార్యక్రమం నిర్వహించడం.<br>3. వంశవృక్షాలను పోల్చడం, ప్రదర్శించడం. విద్యార్థులచే మాట్లాడించడం.<br>4. సమిష్టి కుటుంబం ప్రయోజనాలను గ్రూపులవారిగా చర్చించి ప్రదర్శించడం. |

# సాంస్కృతిక వైవిధ్యము - వినోదం

**ఉపఅంశం** : ✤ ఊయల తయారీ
✤ సంగీతవాయిద్యాలు - పరిచయం

**కృత్యము** : ◆ వివిధ రకాల ఊయలలను తయారుచేయడం మరియు ఊయలపాటలు నేర్చుకోవడం.
◆ స్థానిక కళాకారుల సహాయసహకారాలతో సంగీతవాయిద్యాల ఉపయోగాన్ని ప్రదర్శించడం, విద్యార్థులకు నేర్పించడం.

**ఆశించిన ఫలితము** : ◆ ఊయల తయారుచేసే విధానం తెలుసుకుంటారు. ఊగడంలో మెళకువలను అర్థం చేసుకుంటారు. సంగీత వాయిద్యాలపట్ల అవగాహన, ఆసక్తి పెంచుకుంటారు.
◆ ఊయల కట్టే విధానంలో మెళకువలు తెలుసుకుంటారు.
◆ ఊయలకట్టడంలో తాడు ఎంత బలంగా ఉందో, ఎంతవరకు కిందకు వేలాడదీయాలో, వేసే దిండు, చెక్క ఎట్లా అమర్చాలో తెలుసుకుంటారు.
◆ ఊగడంలో సమవేగంతో నెమ్మదిగా ఆనందంగా ఉండేటట్లు ఎలాచేయాలో తెలుసుకుంటాడు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : ఊయల తయారుచేయడంలో మెళకువలు తెల్పడం. విద్యార్థులతో ఊయల తయారుచేసే విధానాన్ని చూపడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. ఊయలను ఎవరు వాడతారు?
2. మనం ఊగాలనుకునే ఊయలను ఎలా చేసుకోవచ్చును?
3. గ్రామాలలో ఎక్కువగా ఊయలను ఏ సందర్భాలలో ఊగుతారు?
4. ఏ పండుగలలో ఆడపిల్లలు ప్రత్యేకంగా ఊయలలూగుతారు?
5. ఊయల ఊగడంలో పిల్లల అనుభూతులు చెప్పించడం

**కృత్య విధానము** :
✦ పాతగుడ్డలను దిండులాగా కట్టి / ఒక చెక్కకు మేకులు కొట్టి / కట్టెలతో / తాడుతో కట్టాలి.
✦ తీసుకున్న వస్తువుకు ఇరువైపులా గట్టి తాళ్ళు కట్టాలి.
✦ తాళ్ళ చివరలను చెట్టుకు కట్టుకోవాలి.
✦ చెట్టులేనిచోట ఇరువైపులా దుంగలు నాటుకుని ఊయల ఏర్పాటుచేసుకోవాలి.

★ **టైరుతో ఊయల**
✦ పాత టైరును సేకరించాలి. టైరుకి రెండువైపులా తాళ్ళుకట్టాలి.
✦ వాటిని చెట్టుకి తగినంత ఎత్తులో ఉండేవిధంగా కట్టాలి.
✦ ఊయల ఊగడం అనుభవాన్ని, అనుభూతిని చెప్పించడం.

★ **జట్లుగా చేసి ఒక్కొక్కరికి ఓరకమైన ఊయల తయారుచేసే బాధ్యతలు అప్పగించడం**
✦ తాడుతో ఊయల
✦ టైరుతో ఊయల
✦ చెక్క, తాడుతో ఊయల
✦ పాత చీరలను ఉపయోగించి - పాపాయి ఊయల

**అదనపు కృత్యాలు** :
1. ఊయల పాటలు నేర్పించడం, పాడించడం, నృత్యాలు చేయించడం.
2. ఊయలతాడు పొడవుకు మరియు ఊగే దూరానికి గల సంబంధం తెలుసుకునేలా ప్రదర్శన.

**ఉపఅంశం** : డప్పు, డోలు కొట్టించడం, ఫ్లూట్ వాయించడం, కోలాటము ఆడడం

**కృత్యము** : స్థానిక కళాకారులచే డప్పు, డోలు కొట్టించడం, ఫ్లూట్ వాయించడం, కోలాటము పిల్లలు నేర్చుకొనడం.

**ఆశించిన ఫలితము** :
- ❖ డప్పు, డోలు కొట్టడం కోలాటం ఆడటంలో ఆనందం పొందుతారు. ఫ్లూట్ వాయించడంలో మెలకువలు నేర్చుకుంటారు.
- ❖ సంస్కృతి సంప్రదాయాలను తెల్సుకుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ స్థానికంగా గల డప్పు, డోలు కొట్టేవారిని గుర్తించి వారి సహకారాన్ని తీసుకుని విద్యార్థులను గ్రూపులుగా చేసి నేర్పించడం.
- ◆ ఫ్లూట్ వాయించే కళాకారుల్ని గుర్తించి పాఠశాలలో ఆసక్తి గలవారికి ఫ్లూట్‌ను ఇప్పించి జట్లలో ఒక్కొక్కరిగా నేర్పించే అవకాశాన్ని కల్పించడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. డప్పు, డోలు ఎప్పుడెప్పుడు కొడ్తారు?
2. వీటిని వేటితో చేస్తారు?
3. ఇవి మనపై ఎలాంటి ప్రభావం చూపుతాయి?
4. ఫ్లూట్ వాయించడానికి మీరెప్పుడైనా ప్రయత్నించారా?

**కృత్య విధానము** :
- ✦ డప్పు, డోలు, ఫ్లూటు, వీణ, హార్మోనియం, కోలాటం మొదలగునవి స్థానికంగా సేకరించి విద్యార్థులచే తరగతిగది లేక పాఠశాల ఆవరణలో నైపుణ్యాన్ని ప్రదర్శింప చేయాలి. అవసరమైతే ఆయా స్థానిక కళాకారులచే ప్రదర్శన ఇప్పించి విద్యార్థులచే practice చేయించాలి. స్థానిక కళారూపాలపై ఉపాధ్యాయుడు అవగాహన పెంచుకొని, కళాకారులతో మాట్లాడి పిల్లలకు నేర్పించాలి.
- ✦ తాళం వేసే విధానం, లయ తప్పకుండా వేగవంతంగా పాడే జానపద పాటలను పాడిస్తూ నేర్పించడం. పాట పాడే జట్టుకి, డప్పు, డోలు కొట్టేవారు వేర్వేరు జట్లుగా ఉండి జట్ల మార్పుతో నేర్చుకోవడం.
- ✦ కావలసిన సాధనాలను పాఠశాల యాజమాన్యం సమకూర్చేటట్లు చూడడంతోపాటు కళాకారులు పూర్తి సహకారం అందించేటట్లు చూడడం.

**అదనపు కృత్యాలు** :
1. ఫ్లూట్ వాయిద్యాన్ని కూడ స్థానిక కళాకారుల సహకారంతో నేర్పించే ఏర్పాటు.
2. ఇతర వాయిద్యాలను నేర్చుకోవడంలో విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించడం.
3. పాఠశాలలో కోలాటం వేయించడం.

# సామాజిక అంశాలపై అవగాహన - స్పందన

**ఉపఅంశం** : సమాజం పట్ల బాధ్యత

**కృత్యము** : సమాజంలో వ్యక్తిగా తన బాధ్యతలను తెలుసుకోవడం, నిర్వర్తించడం.

**ఆశించిన ఫలితము** :
- ✤ సమాజంలో వ్యక్తిగా తన బాధ్యతలను తెలుసుకొని నిర్వర్తిస్తారు.
- ✤ ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తిస్తే కలిగే ఆనందాన్ని తెల్సుకుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ విద్యార్థులు – సమాజంలో వారి బాధ్యతలను గురించి తరగతులలో, పాఠశాల–ప్రార్థన సమావేశాలలో చర్చించడం.
- ◆ విద్యార్థులు – వారివారి బాధ్యతలను తెలుసుకునేలా చేయడం. బాధ్యతల జాబితాను తయారుచేయించడం, ప్రదర్శించడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :
1. విద్యార్థులు – సమాజం పట్ల బాధ్యతతో ఎందుకు ఉండాలి? ఉండకపోతే ఏమవుతుంది?
2. ఒక విద్యార్థిగా సమాజంలో ఏం చేయగలరు?
3. అందరుకూడ ఒకే విధమైన బాధ్యతలతో ఎందుకు ఉండరు? కారణాలేమి?

**కృత్య విధానము** :
- ✦ విద్యార్థులు, సమాజం పట్ల వారి బాధ్యతలని నిర్వర్తించేలా ఉపాధ్యాయులు పూర్తి సహాయసహకారాలను అందించాలి.
- ✦ సమాజంపట్ల బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన విద్యార్థులను, ప్రార్థనా సమావేశంలో మాట్లాడించడం/అభినందించడం.
- ✦ వారి బాధ్యతలను నిర్వర్తించిన తీరును / ఎదుర్కొన్న సమస్యలను చర్చించేలా ప్రోత్సహించడం.
- ✦ విద్యార్థుల పేర్లు – వారు నిర్వర్తించిన బాధ్యతలను గోడపత్రికపై ప్రదర్శించడం – ఇతరులకు స్ఫూర్తినివ్వడం.
- ✦ మనదేశంలో రిపబ్లిక్‌డే (గణతంత్రదినోత్సవం) సందర్భంగా ఇచ్చే Bravery Awards/సాహస బాలబాలికలకు ఇచ్చే అవార్డులు తీసుకున్నవారి వివరాలను ప్రదర్శించడం
- ✦ విద్యార్థులకు స్ఫూర్తినివ్వడం.

**అదనపు కృత్యాలు** :
1. సమాజంపట్ల బాధ్యతలు – నిర్వహణ గురించి, కుటుంబసభ్యులతో చర్చించడం. వారి బాధ్యత, నిర్వహణ విధానాన్ని తరగతిలోని సహవిద్యార్థులతో పంచుకోవడం.
2. భవిష్యత్తులో విద్యార్థులు ఏమి కావాలనుకుంటున్నారో వారు సమాజ అభివృద్ధికి ఎలా సహకారాలు అందిస్తారో ఒక్కొక్కరిగా తమ భావాలను/అభిప్రాయాలను చెప్పించాలి. మరియు వారిచే రాయించాలి. వాటిని ప్రదర్శించాలి.

# సమాచారము - డాక్యుమెంటేషన్

**ఉపఅంశం** : నోటీసులు, ఆహ్వానాలు మరియు ప్రకటనలు

**కృత్యము** : నోటీసులు, ఆహ్వానాలు మరియు ప్రకటనలు తయారుచేయడం మరియు ప్రదర్శించడం.

**ఆశించిన ఫలితము** : వివిధ నోటీసులు, ఆహ్వానాలు, ప్రకటనలు తయారుచేస్తారు మరియు ప్రదర్శిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :

- ◆ మనచుట్టూ అందుబాటులో ఉన్న వివిధ నోటీసులు, ఆహ్వానాలు, ప్రకటనలు సేకరించడం.
- ◆ వివిధ అంశాలకు సంబంధించి నోటీసులు, ప్రకటనలు తయారుచేయడంలో విద్యార్థులకు మెళుకువలు నేర్పడం.

**కృత్య విధానము** : ఈక్రింది అంశాలకు సంబంధించి ఉపాధ్యాయుల సహకారముతో నోటీసులు, ప్రకటనలు విద్యార్థులు తయారుచేయాలి.

- ✤ SMC సమావేశములు
- ✤ గ్రామంలో జరిగే కార్యక్రమాలు
- ✤ తిరునాళ్లు
- ✤ ఆటలు, పాటల పోటీలు, రంగవల్లుల పోటీలు
- ✤ ఆరోగ్య కార్యక్రమాలు (టీకాలు, పల్స్‌పోలియో మొ॥నవి)
- ✤ సినిమాహాళ్ళలో ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రకటనలు
- ✤ బాలల హక్కులపై, మహిళలపై జరిగే దాడులపై
- ✤ బడి బయటిపిల్లల్ని బడికిపంపే నోటీసులు, ప్రకటనలు మొ॥నవి
- ✤ పొగత్రాగరాదు, మద్యపాన నిషేదము
- ✤ పై సందర్భంలో వివిధరకాల నోటీసులు, ఆహ్వానాలు, ప్రకటనలు చేయడంలో వివిధ రంగులలో, డిజైన్స్‌లలో ఆకర్షవంతంగా తయారుచేయడం.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :

1. నోటీసులు, ప్రకటనలు ఏసందర్భంలో ఉపయోగిస్తారు?
2. ఆహ్వానాలలో రకాలు ఏవి?
3. పైవాటిని తయారుచేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవి? (రంగులలో, డిజైన్స్‌లలో, వాడే భాషలో)
4. పాఠశాలలో ఏ సందర్భాలలో నోటీసు, ప్రకటనలు, ఆహ్వానాలు ఉపయోగిస్తారు?

**అదనపు కృత్యాలు** :

1. గ్రామంలో జరిగే కార్యక్రమాలు, బడిబయటిపిల్లల్ని బడిలో చేర్పించుట, పిల్లల్ని పనిలో పెట్టుకున్నవారికి నోటీసులు తయారుచేయండి?
2. పొగత్రాగరాదు, మద్యపాన నిషేధం గురించిన ప్రకటనలు తయారుచేయండి.
3. సమాజ సమస్యలపై నోటీసులు, ప్రకటనలు క్లుప్తంగా, సూటిగా, స్పష్టంగా అందరికీ సులభంగా అర్థమయ్యేలా తయారుచేయుట.

## వస్తువులు - నమూనాల తయారి

**ఉపఅంశం** : పూలదండలు, డోర్‌మ్యాట్స్ తయారీ

**కృత్యము** : పూలదండలు, డోర్‌మ్యాట్స్, ఆక్రోబ్యాట్స్, ట్యాన్‌గ్రామ్‌లను తయారుచేయడం.

**ఆశించిన ఫలితము** : పూలదండలు, డోర్‌మ్యాట్స్, ఆక్రోబ్యాట్స్, ట్యాన్‌గ్రామ్‌లను తయారుచేస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ బొకేలు తయారుచేసి చూపించడం.
- ◆ రాఖీలు తయారుచేసి చూపించడం.
- ◆ బొకేలు, డోర్‌మ్యాట్స్ తయారుచేయడానికి అవసరమగు సామగ్రి సేకరణ
- ◆ తయారీలో విద్యార్థులందరు పాల్గొనుట.

**కృత్య విధానం** :
- ✤ పువ్వులు, ఆకులు ఉపయోగించి వివిధ బొకేలు తయారుచేయడం.
- ✤ గుడ్డముక్కలతో డోర్‌మ్యాట్స్ తయారుచేయించడం.
- ✤ వివిధ పూసలు, పూలు, ఆకులు ఉపయోగించి పూలదండలు తయారుచేయించడం.
- ✤ వ్యర్థ గుడ్డలనుపయోగించి డోర్‌మ్యాట్స్ తయారుచేయించడం.

**అదనపు కృత్యాలు** :
1. అట్టముక్కలతో వివిధ ఆకారాలను తయారుచేయించడం.
2. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్ ఉపయోగించి వివిధ అలంకరణ వస్తువులు తయారు చేయించడం.
3. నారలు, పీచులు, బట్టపీలికలు పేనడం ద్వారా త్రాళ్ళు, సంచులు తయారు చేయించడం.

గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు ఆడే ఆటవస్తువుల తయారీ మరియు వాటిని ప్రదర్శించాలి.
ప్రతి ఆటలో గల శాస్త్రీయ భావాలను విద్యార్థులతో చర్చించాలి.
ఉదా॥ బొంగరం, గులేరు (ఉండీల).

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఆకృతులు |
| **కృత్యము** | : | అలంకరణ వస్తువులు తయారీ (గాజు, కాగితము, పాతబట్టలు, వాడిపారేసిన రకరకాల వస్తువులు) |
| **ఆశించిన ఫలితము** | : | పాతవస్తువులు, వాడిన వస్తువులతో అలంకరణ వస్తువులు తయారుచేయడము. తద్వారా ఆనందం, సృజనాత్మకత, సహకార భావనలు పెంపొందుతాయి. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ ఉపాధ్యాయుడు విద్యార్థులకు అలంకరణవస్తువుల తయారీ గురించి శనివారము సాయంత్రము తగు సూచనలు, సలహాలు ఇవ్వాలి. సోమవారము వచ్చునప్పటికి వాటిని తీసుకుని రమ్మని తెలపాలి.<br>◆ ఇంటిదగ్గర పెద్దవారిలో వ్యర్థపదార్థాలనుండి వస్తువులు ఎలా తయారుచేయాలో తెలుసుకుంటారు. |
| **కృత్య విధానం** | : | ✤ విద్యార్థులు జట్లలోను, ఇండ్లదగ్గర పెద్దవారిని, అక్కలు, అన్నలను అడిగి తెలుసుకొని రకరకాల అలంకరణ వస్తువులు తయారుచేసి తీసుకుని వచ్చి తరగతిగదిలో ప్రదర్శిస్తారు.<br>✤ విద్యార్థులు తెచ్చిన వివిధ రకాల వస్తువులతో ఈక్రింది నమూనాలు చేయాలి. **కాగితము :** రంగు కాగితములతో రకరకాల దండలు, జెండాలు, వేడుకలకు డిజైన్ పేపర్ దండలు తయారుచేయుట.<br>**గాజులముక్కలు :** పగిలిన గాజులు కొద్దిగా వేడిచేసి చైన్‌లింక్‌లాగా అతికించి ప్రవేశ ద్వారమునకు అలంకరణగా వ్రేలాడదీయవచ్చు.<br>**కాగితపు కప్పులు :** వీటిని కట్ చేసి మాలలుగా తయారుచేసి ఫోటోలకు కిటికీలకు మాలలుగా అలంకరించవచ్చు.<br>**పాతబట్టలు :** రంగురంగులవి కత్తిరించి ద్వారములకు, కిటికీలకు, సంచులకు డిజైన్‌లుగా తయారుచేయవచ్చు. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. పాతపడిన, పారేసిన వస్తువులతో కూడా రకరకాల అలంకరణసామాగ్రి/వస్తువులు ఎలా తయారుచేస్తావు?<br>2. సృజనాత్మకంగా అలంకరణవస్తువుల తయారీకి నీకు ఏమేమి అవసరమని భావిస్తున్నావు?<br>3. మనం రోజూ వాడిపారేసే వస్తువులు ఏమి? వాటిని తిరిగి ఎలా ఉపయోగించుకోవచ్చు? |
| **అదనపు కృత్యాలు** | : | 1. కాగితపు గ్లాసులు, కప్పులు కత్తిరించి Pen stand తయారుచేయించాలి.<br>2. వాడిన బల్బులనుపయోగించి Flowervases తయారుచేయించాలి.<br>3. పాతబట్టలనుపయోగించి Door curtains తయారుచేయించాలి. |

**ఉపఅంశం** : ఆకృతులు

**కృత్యము** : ఎండుకాయలు, గింజలతో ఆకృతులు తయారుచేయడం.

**ఆశించిన ఫలితము** : మన చుట్టూ ఎండుకాయలు, గింజలుతో రకరకాల ఆకృతులు తయారు చేస్తారు. ఆ తయారీలో ఆనందాన్ని, సృజనాత్మకతను, పరస్పర సహకారం మొ॥ భావనలు విద్యార్థులు పెంపొందించుకుంటారు. ప్రకృతిలో కాయలు, గింజల ఆకృతిలో వైవిధ్యాన్ని ప్రశంసిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :

- ✤ విద్యార్థులు ముందురోజు సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత తమ గ్రామంలో, పరిసరాలలోని ఎండుకాయలు, గింజలు సేకరించి తరగతిగదికి తీసుకునివచ్చి వివిధ ఆకృతులు తయారుచేసేలా ఉపాధ్యాయుడు సూచనలివ్వాలి.
- ✤ విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా ఆకృతులు చేయించాలి.
- ✤ చేసిన వాటిని ప్రదర్శ్రి:ంపజేయాలి.

**కృత్య విధానం** : పాఠశాల తరగతిగదిలో విద్యార్థులు జట్లుగా చేరి ఎండుకాయలు, గింజలతో ఒక్కొక్క జట్టు రకరకాలుగా ఆకృతులు తయారుచేస్తారు. వినూత్నమైన ఆకృతులు తయారుచేసిన వారిని, వారితోపాటుగా తయారుచేసిన అందరినీ ప్రదర్శించినందుకు ప్రశంసించాలి, ప్రోత్సహించాలి.

ఉదా : గిలక, హారము, చెవి లోలకులు, పాఠశాలపేరు, వివిధ ప్రదేశాలు (దేవాలయం, చర్చి, మసీదు, చార్మినార్, తాజ్‌మహల్, పాఠశాల, గణిత ఆకృతులు మొ॥నవి) ఆకృతుల్లో గింజలను పేరుస్తారు.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :

1. మొక్కలలోని కాయలు, గింజలలో ఇంత వైవిధ్యము ఉండటం వలన ఉపయోగమేమి?
2. అన్ని మొక్కల కాయలు, గింజలు ఒకే ఆకృతి, ఆకారం, బరువు సైజు ఉండినచో ఏం జరిగేది?

**అదనపు కృత్యాలు** :

1. చెట్ల ఎండిన కాయలు, గింజలతోనేకాక వివిధ వస్తువులతో వివిధ ఆకృతులు తయారుచేయించాలి.
2. గింజలను నాటి క్రొత్త మొక్కలు మొలకెత్తేలాగాను, మొలకెత్తే విధానాన్ని పరిశీలించేలాగానూ కృత్యాన్నివ్వాలి.
3. ప్రకృతిలో కాయలు, గింజల ఆకారము, బరువు, అంచుల ఆకారము మొ॥ వైవిధ్యాన్ని గురించి తమ అనుభూతులను స్వంతమాటల్లో రాయించాలి.
4. వివిధ గింజలను కాగితంపై అతికించి వివిధ ఆకృతులను తయారుచేయుట.

# గృహ యాజమాన్యం

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | ఇల్లు – మొక్కల పెంపకం |
| **కృత్యము** | : | గాజు జాడీలు, పెద్ద సీసాలు, పాత బక్కెట్లు, డబ్బాలు, పాత మట్టి కుండలను పూలకుండీలుగా చేయడం. నీడలో పెరిగే మొక్కలను పెంచడం. |
| **ఆశించిన ఫలితము** | : | ✤ వాడేసిన వస్తువులతో పూలకుండీలను తయారుచేయడం నేర్చుకుంటారు, నీడలో పెరిగే మొక్కలను పెంచి ఇంటిని అందంగా తీర్చిదిద్దుతారు.<br>✤ పర్యావరణ స్పృహను పెంపొందించు కుంటారు. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులను జట్లుగా చేసి ఏఏ వస్తువులలో మొక్కలను పెంచవచ్చునో అవగాహన కల్పించడం. |
| **ఆలోచింపచేసే ప్రశ్నలు** | : | 1. కొద్దిగా పగులు వచ్చి, నీరు కారుతున్నట్లయితే అలాంటి బక్కెట్లు, టబ్‌లను ఏంచేస్తారు?<br>2. గాజు జాడీల వంటివి లేదా పెద్ద గాజుపాత్రలు అందంగా లేకపోయి, పాతబడి పోయిన వాటిని ఏం చేస్తారు?<br>3. రంధ్రం పడ్డ డబ్బాలను వేటి కోసం వాడుకోవచ్చు?<br>4. మట్టిపోసి వాడుకొనే ఈ పాత్రలకు ఇంకా ఏం చేస్తే మొక్కలను పెంచవచ్చు?<br>5. ఇంట్లో ఎలాంటి మొక్కలు పెంచవచ్చు? మీఇంట్లో ఉన్న మొక్కలు/చెట్లు ఏవి? |
| **కృత్య విధానం** | : | ✦ పాతకుండీలు, మట్టికుండల్లో పెంచాలనుకుంటే అడుగునగాని లేదా కొద్దిగా పైభాగాన గాని రంధ్రం ఏర్పాటుచేసుకోవాలి.<br>✦ మూడు లేదా నాల్గు చిన్న గులకరాళ్ళు ఉండేటట్లు ఏర్పాటుచేసుకోవాలి. ఇతర పాత్రలకు కూడ ఇదేవిధంగా చేయాలి.<br>✦ తగినంత మట్టిని ఆయా పాత్రలలో ఉంచి తగినంత నీటి సదుపాయాన్ని కల్పించాలి.<br>✦ నీడలో పెరిగే మొక్కలను, పూలమొక్కలను పెంచవచ్చును.<br>✦ కొత్తిమీర, పుదీనా వంటి మొక్కలను పెంచవచ్చు. |
| **అదనపు కృత్యాలు** | : | 1. పాఠశాలలో మరియు ఇండ్లలో వర్మికంపోస్టు తయారీ.<br>2. వ్యర్థపదార్థాలను ప్రత్యేక గుంతలో వేసి కంపోస్టు ఎరువు తయారుచేయడం. |

**ముఖ్యాంశాలు :**

- ✤ పాతబడిన, వాడేసిన వస్తువులు వ్యర్థంగా పారేయకుండా సద్వినియోగం చేసుకోవచ్చని
- ✤ అందమైన వస్తువులను వ్యర్థపదార్థాలతో చేసుకోవచ్చని
- ✤ కొద్దిపాటి నేలలో కూడ మొక్కలను పెంచుకోవచ్చని
- ✤ సారవంతమైన నేలగా కంపోస్టుతోను, వర్మికంపోస్టుతోను మార్చుకోవచ్చని తెలుసుకోవడం.

# వినియోగదారుల విజ్ఞానము

**ఉపఅంశం** : తూనికలు - కొలతలు

**కృత్యము** : అమ్మకందారులు వాడే తూనికలు, కొలిచే విధానాన్ని గమనించడం, తూకంలో జరిగే మోసాలను తెలుసుకోవడం.

**ఆశించిన ఫలితము** : వస్తువుల అమ్మకములో ఉపయోగించే సరైన తూనికలు, కొలతలను తెలుసుకుంటారు, తూకంలో జరిగే మోసాలను గుర్తించి జాగ్రత్త వహిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : దుకాణాలు, సంతలు తల్లిదండ్రులతోపాటుగా సందర్శించమని విద్యార్థులకు చెప్పాలి. తూనికలు, కొలతల్లో ఎలా మోసగిస్తారో పెద్దవారిని అడిగి వారి అనుభవాలను తెలుసుకొనివచ్చేలా ప్రోత్సహించాలి.

**కృత్య విధానం** : విద్యార్థులు తాము తెలుసుకున్నవి మరియు తమ స్వంత అనుభవాలను తరగతిగదిలో చర్చించాలి. ఏఏ సందర్భాలలో అమ్మకందారులు ఎలా మోసగిస్తుంటారో? కొనుగోలు దారులు మోసపోయే అవకాశాలను చర్చించి list out చేయడము. మోసపోతే ఏం చర్యలు చేపట్టాలో ఉపాధ్యాయుని సహకారంతో తెలుసుకోవడము. "వినియోగదారుల ఫోరం" గురించి తెలుపడము.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :

1. ఊర్లోకి అమ్మడానికి (కూరగాయలు, వస్తువులు) వచ్చే అమ్మకందారులు తూకంరాళ్ళకు బదులుగా అదే సైజులో ఉండే రాళ్ళను వాడడం సబబేనా? ఎందుకు?
2. పూలదుకాణం దగ్గర అమ్మకానికి చిన్నపిల్లలు (10-15 సం॥లు) ను ఉంచి పూలు అమ్మిస్తుంటారు. ఎందుకు?
3. తక్కెడతో తూచేటప్పుడు, పాత్రలతో ద్రవాలు కొలిచేటప్పుడు జరిగే మోసాలు ఏమి?

**అదనపు కృత్యాలు** :

1. తమ తల్లిదండ్రులు, స్నేహితులతోపాటుగా పూలు, పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు అమ్మే కిరణం కొట్టు మొ॥నవి దర్శించి తూనికలు, కొలతల్లో జరిగే మోసాలను గుర్తించండి.
2. మీ ఊరికి సమీపంలో ఉన్న "వినియోగదారుల ఫోరం" చిరునామా, ఫోన్‌నెంబరు సేకరించండి.
3. తూనికలు, కొలతలు విభాగం అధికారులతో ఫోన్‌ద్వారా / వ్యక్తిగతంగా కలిసి మీ అనుమానాలు నివృత్తి చేసుకోండి.
4. తూనికలు-కొలతలు అధికారిని తరగతిగదికి పిలిపించి సంబంధిత విషయాలు చెప్పించడం.
5. వినియోగదారుల హక్కులకు సంబంధించిన, పోస్టర్లు, ప్రకటనలు, కరపత్రాలు, సేకరించి తరగతిలో ప్రదర్శించండి.

# వినియోగదారుల విజ్ఞానము

**ఉపఅంశం** : తూనికలు - కొలతలు

**కృత్యము** : అమ్మకందారులు వాడే తూనికలను, కొలిచే విధానాన్ని గమనించడం. తూకంలో జరిగే మోసాలను తెలుసుకోవడం.

**ఆశించిన ఫలితము** : వస్తువుల అమ్మకంలో ఉపయోగించే సరైన తూనికలను, కొలతలను తెలుసుకుంటారు. తూకంలో జరిగే మోసాలను గుర్తిస్తారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** : విద్యార్థులందరికీ కేటాయించిన సమయంలో పాత్రోచిత సంభాషణలతో అమ్మకం, కొనుగోలు ప్రక్రియను ప్రదర్శింప చేయాలి.

**ఆలోచింపచేసే ప్రశ్నలు** :

1. ఆకుకూరలు, కూరగాయలు కొనాలంటే దుకాణదారుడు ఎలా కొలుస్తాడు/తూస్తాడు?
2. కొలతలకు ఉపయోగించే ప్రమాణాలేమిటి?
3. నూనె వంటి ద్రవపదార్థాలను ఎలా అమ్ముతారు?
4. బియ్యం, పప్పులు కొనడానికి నీవెవరిదగ్గరకు వెళ్తావు?
5. సంత, అంగళ్ళలో వివిధ వస్తువుల కొలమానాలు ఏమిటో పరిశీలించావా?

**కృత్య విధానం** :

- ✤ గ్రూపులవారీగా పిల్లలు సేకరించిన వస్తువులను ఒక్కొక్క గ్రూపులో తూనికగా తూనికరాళ్ళతో కొలిచి కొనుగోలు, అమ్మకంలో ఇద్దరు విద్యార్థులు పాల్గొనాలి.
- ✤ మరొక జట్టు విద్యార్థులు వివిధ రకాల వస్తువులను ప్రదర్శించి కిలో/$^1/_2$ కిలో/$^1/_4$ కిలోకి ఎంతెంత తూగుతుందో తెలుసుకోవడం.
- ✤ రైతుబజారు, సంత, అంగడి దుకాణాలను పరిశీలించాలి.

**అదనపు కృత్యాలు** :

1. విద్యార్థులను జట్లుగా చేసి ఒక్కొక్క జట్టుకి ఒక్కొక్క ప్రాంతంలోగల దుకాణాలకి వెళ్ళి వివిధరకాల వస్తువుల కొనుగోలు తూకాలను పరిశీలించి నమోదు చేసుకోమనాలి.
2. తూకానికి తగ్గట్లుగా వస్తువులిస్తున్నారా! అనేది గమనించాలి.
3. ఏఏ సందర్భాలలో మోసం జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.
4. చిల్లరదుకాణాలు, హోల్‌సేల్ దుకాణాలలో దొరికే వస్తువుల లాభనష్టాలు, అధిక ధరలపై అమ్మడం గురించి తెలుసుకోవాలి.
5. బడిలోకి వచ్చిన పిమ్మట తరగతిలో విద్యార్థులు అందరితో కలిపి చర్చ జరపాలి.

## పర్యావరణ విద్య

**ఉపఅంశం** : పాఠశాలలో మొక్కల పెంపకం - సంరక్షణ

**కృత్యము** : పాఠశాలలో వివిధ రకాల మొక్కలను పెంచడం. వాటిని సంరక్షించడం.

**ఆశించిన ఫలితము** : వివిధ రకాల మొక్కలను పెంచే విధానాలను తెలుసుకుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :

- ◆ విద్యార్థులకు పాఠశాలలో పెంచే మొక్కల విషయంలో అవగాహన కల్పించుట.
- ◆ మొక్కలు ప్రకృతిలో భాగమనే విషయాన్ని తెలియచేయుట.
- ◆ మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు అందచేయుట.

**కృత్య విధానం** :

- ✤ విద్యార్థులను మొక్కల పెంపకంలో వారికుండే అనుభవాలను తెలియజేయమని అడగాలి.
- ✤ చెట్లు, మొక్కలు మరియు మనుషులకు మధ్య అనుబంధాన్ని తరగతిగదిలో చర్చించాలి.
- ✤ మొక్కలపై మనం చూపే వైఖరులపై చర్చించాలి.

**అదనపు కృత్యాలు** :

1. దగ్గరలోని నర్సరిని సందర్శించి అక్కడి సిబ్బందితో మొక్కల పెంపకంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలుసుకోవడం.
2. వివిధ మొక్కలు, చెట్లు బొమ్మలను సేకరించి తరగతిలో ప్రదర్శించుట.
3. పిల్లలచేత వివిధరకాల గింజలు సేకరించి అందరికి పంచడం, పాఠశాలలో వాటిని నాటించడం.
4. పాఠశాల నర్సరీలో మొక్కలుపెంచి విద్యార్థులకు మొక్కలు పంచి వారి ఇండ్లలో నాటుకోవడాన్ని ప్రోత్సహించాలి.

# పాఠశాల మొత్తంగా చేపట్టవలసిన కార్యక్రమాలు

ఈ క్రింది కార్యక్రమాలను పాఠశాలలో సామూహికంగా పాఠశాల ప్రార్థనా సమయంలో గాని ప్రత్యేక సందర్భాలలో కాని నిర్వహించాలి. పిల్లలతో ఈ అంశాలపై చర్చించి, అవగాహన కలిగించాలి.

## 1. పౌష్టికాహారము

**ఉప అంశము** : **బాలసభ నిర్వహణ**

**ఫలితాంశము** :
- ✤ విద్యార్థులు బాలసభలో ఉత్సాహంగా పాల్గొంటారు.
- ✤ తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తారు.
- ✤ నాటికలు, నృత్యాలు, స్థానిక కళలు మొదలైనవి ప్రదర్శించడంలో ఆసక్తి కనబరుస్తారు.
- ✤ బాలసభ నిర్వహించడంలో బాధ్యతలు పంచుకుంటారు.
- ✤ బాలసభలో పాల్గొని ఆనందాన్ని పొందుతారు.

**ఉపాధ్యాయునికి సూచనలు** :
- ◆ నెలకొకసారి, ఒక శనివారము మధ్యాహ్నము బాలసభ నిర్వహించడం.
- ◆ అన్ని తరగతుల విద్యార్థులు బాలసభలో పాల్గొనేవిధంగా చూడడం.
- ◆ వివిధ కార్యక్రమాలలో పాల్గొనే విద్యార్థుల పేర్లు, వారు ప్రదర్శించే అంశముల జాబితా తయారుచేయడం.
- ◆ వివిధ అంశములను ప్రదర్శించే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, కొంత తర్ఫీదును ఇవ్వడం.
- ◆ ప్రతి తరగతినుండి లీడర్లతో ఒక బాలసభ కమిటీని ఏర్పాటుచేయడం. ఉపాధ్యాయుల సూచనల ప్రకారం ఈ కమిటీ బాలసభను నిర్వహిస్తుంది.

**కృత్య విధానము** :
- ✦ ప్రతి నెలలో ఒక శనివారము బాలసభ కమిటీ బాలసభ నిర్వహిస్తుంది.
- ✦ నిర్వహణకు కావలసిన వేదికను ఏర్పాటుచేసుకొనవచ్చును.
- ✦ చక్కటి ప్రదర్శననిచ్చినవారికి బహుమతులు ప్రదానం చేయవచ్చును.
- ✦ బాలసభ నిర్వహించిన తీరుపై నివేదికను రూపొందించడం.
- ✦ వివిధ ప్రదర్శనల ఫోటోలను నోటీస్‌బోర్డుపై ప్రదర్శించడం.

# 2. ఆరోగ్య విద్య

**ఉపఅంశం : పారిశుధ్య అలవాట్లు**

**ఎ) వ్యక్తిగతమైనవి :**

**1) పళ్ళుతోముకోవడము**

- ❖ బ్రష్ మరియు పేస్టు కానీ వేపపుల్లతో కానీ దంతములు బ్రష్‌తో పైకి, క్రిందికి అలాగే దంతముల చివరి మూలలవరకు ఆతర్వాత దంతముల వెనుకవైపున రెండు దవడలకు సంబంధించి అన్ని దంతములను శుభ్రంగా బ్రష్ చేసుకోవాలి. చూపుడువ్రేలుతో చిగుర్లను బాగా రుద్దాలి.
- ❖ ప్రతిరోజూ ఉదయము, రాత్రి భోజనము చేసిన తర్వాత తప్పక బ్రష్ చేసుకోవాలి.
- ❖ దంతముల మధ్య ఇరుక్కున్న ఆహారపదార్థాలను దారంతో దంతాలమధ్య అటూ ఇటూ లాగడం ద్వారా మరియు నీళ్ళతో పుక్కిలించడం ద్వారా వాటిని తొలగించవచ్చు. తద్వారా పంటివ్యాధులు, నొప్పిరాకుండా నివారించవచ్చు.

**2) సబ్బుతో చేతులు కడుక్కోవడం**

- ◆ సబ్బును మొదట చేతులను నీటితో తడుపుకొని సబ్బును రెండు చేతులకు రుద్దుకోవాలి. రెండుచేతుల పైవైపున, వ్రేళ్ళమధ్యలో, వ్రేళ్ళ గోర్లలో మట్టిపోయేలాగున రుద్దుకొని శుభ్రంగా కడుక్కోవాలి. తదుపరి శుభ్రమైన గుడ్డతో తుడుచుకోవాలి. ప్రతిరోజూ ఆహారం తీసుకునే ముందు, తర్వాత, ఆటలాడిన తర్వాత శుభ్రంగా చేతులు కడుగుకోవాలి.

**3) గోళ్ళు కత్తిరించుకోవడం**

- ❖ గోళ్ళు ఎక్కువగా పెరగకుండా Nail Cutter తో కత్తిరించుకోవాలి.
- ❖ గోళ్ళ సందుల్లో ఎటువంటి మలినాలు చేరకుండా శుభ్రంగా ప్రతిరోజూ సబ్బుతో కడిగేటప్పుడు జాగ్రత్త వహించాలి. తద్వారా మలినాలు నోటిలోకి చేరి అనారోగ్యం రాకుండా నివారించవచ్చు.
- ❖ గోళ్ళు కత్తిరించేటప్పుడు రక్తము వచ్చేలా లోతుగా గోర్లు కత్తిరించరాదు.

**4) తల దువ్వుకోవడం**

- ✦ ప్రతిరోజు స్నానం చేసిన తర్వాత దువ్వెనతో శుభ్రంగా తల దువ్వుకోవాలి.
- ✦ తలస్నానం చేసినప్పుడు జుట్టు పూర్తిగా తడిఆరిన తర్వాత దువ్వెనతో దువ్వుకోవాలి.
- ✦ దువ్వెనలో మట్టి చేరకుండా దువ్వెన పళ్ళమధ్య శుభ్రంచేసి, కడిగి ఆరబెట్టి శుభ్రంగా ఉంచుకోవాలి.
- ✦ ఒకరు వాడిన దువ్వెనను ఇంకొకరు వాడరాదు.
- ✦ తలలో చుండ్రు, పేలు లేకుండా జాగ్రత్త వహించాలి.
- ✦ ఉన్నచో అందుకనుగుణమైన దువ్వెన (పేలదువ్వెన) ఉపయోగించాలి.
- ✦ సరైన ఆరోగ్య అలవాట్లతో వీటిని నివారించుకోవచ్చు.

**పాఠశాలకు సంబంధించినవి :**

**1) తరగతిగది/పాఠశాలల శుభ్రత**

- ❖ తరగతిగదిని ప్రతిరోజు విద్యార్థులందరూ వంతులవారీగా కసువుచిమ్మి శుభ్రపరచుకోవడం, ఆ కసువు కంపోస్టు గుంతలో వేసేలా కేటాయించాలి.

- కసువు చిమ్మేటప్పుడు చీపురును నేలకు ఆనించి దుమ్ము పైకి రేగకుండా చూడాలి. మట్టిపైన చిమ్మేటపుడు మొదట నీరు చిలకరించి తర్వాత చిమ్మాలి.
- అలాగే ఎప్పటికప్పుడు బూజును కూడ బూజుకర్రతో శుభ్రం చేయాలి.
- మరి ముఖ్యంగా జాతీయపండుగలు, పాఠశాల వార్షికోత్సవాలు, నవంబర్ 14, పాఠశాల మొదలయ్యే జూన్ 12 మొ॥ దినాలలో ప్రత్యేకంగా పాఠశాలను అలంకరించాలి.

**2) మరుగుదొడ్ల శుభ్రత**

- మరుగుదొడ్లు వాడటానికి ముందు, తర్వాత నీళ్ళు ప్యాన్‌లో ఎక్కువగా పోయవలయును. తద్వారా హానికారక క్రిములన్నిటిని పారద్రోలవచ్చు. దుర్వాసన రాకుండా నివారించవచ్చు. అందుకు Toilet cleaners, Acids కూడా వాడాలి.
- మరుగుదొడ్డికి వెళ్ళివచ్చిన తర్వాత ప్రత్యేకంగా కేటాయించుకున్న సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కుడిచేతితోకాక ఎడమచేతితోనే సబ్బును అద్దుకొని శుభ్రంగా రుద్ది శుభ్రం చేసుకోవాలి. కేటాయించిన టవలుతో చేతులు శుభ్రంగా తుడుచుకోవాలి.
- మరుగుదొడ్లలో మంచి వాసన వచ్చే, దోమలను చంపే కొన్నిరకాల ఉండలు (Deoderance) వాడాలి.

**3) ఆరోగ్యం – ఆహారం – పరిశుభ్రతపై ప్లకార్డులు – నినాదాలతో ఆరోగ్యప్రచారం**

- మంచి పోషకాహారం తీసుకోండి – ఆరోగ్యాన్ని కాపాడుకోండి.
- పరిశుభ్రతను పాటించండి – దోమ, ఈగలను పారద్రోలండి.
- అపరిశుభ్ర వాతావరణాలు – దోమ, ఈగల నిలయాలు.
- ఆరోగ్యమే మహాభాగ్యం
- బ్రెడ్డు కన్నా గ్రుడ్డు మిన్న
- చక్కెర ఉండగ – గ్లూకోజ్ దండగ
- పై నినాదాలే కాకుండా మరికొన్ని ప్లకార్డులపై రాసి గ్రామంలో ఆరోగ్యప్రచారం నిర్వహించాలి.

**4) ప్రథమచికిత్స – ప్రాథమిక నర్సింగ్ సేవలు**

- చిన్న చిన్న గాయాలను ముందు డెట్టాల్‌తో శుభ్రంచేసి దానిపైన దూదితో శుభ్రంగా తుడిచి గాయానికి పుండ్లమందు వేసి బ్యాండేజిగుడ్డతో కట్టు కట్టవలయును. తదుపరి చేతులు శుభ్రంగా కడుగుకోవలయును.
- ఆరోగ్యకమిటీ తమ విద్యార్థులకుగానీ, గ్రామస్థులకుగానీ అయ్యే చిన్న చిన్న గాయాలను కడిగి, మందుపూసి బ్యాండేజి కట్టాలి.
- అలాగే చిన్న చిన్న రోగాలైన జ్వరం, బేదులు లేదా విరోచనాలు, వాంతులు, నొప్పులు మొ॥ వాటికి ANM ద్వారా PHC నుండి సేకరించిన మందులు ఇవ్వాలి. దానిని APSHEP వారు అందించిన Box లో ఉంచుకొని "ఆరోగ్య రిజిష్టర్" నిర్వహించాలి.

**5) ఆవాస ప్రాంతంలో మురికిగుంటల సర్వే – పూడికతీత**

- పై తరగతుల విద్యార్థులు ఆవాసప్రాంతంలోని మురికిగుంటలను సర్వేచేసుకొని తమ గ్రూపు అంతా కలిసి పూడిక తీసి మురుగునీరు స్వేచ్ఛగా వెళ్ళేలా చేయాలి. గ్రామస్థులను చైతన్యవంతం చేయాలి. శుభ్రత అలవాట్లు మెరుగుపరచుకునేలా చైతన్యం చేయాలి.

## 3. జనాభా విద్య

| | | |
|---|---|---|
| **ఉపఅంశం** | : | **జనాభా విద్య : బాలబాలికల నిష్పత్తి, లింగవివక్షత / వికలాంగుల సమస్యల అవగాహన.** |
| **ఆశించిన ఫలితము** | : | ✤ లింగ వివక్షతపై అవగాహన కలుగుతుంది.<br>✤ లింగ వివక్షత కారణంగా స్త్రీ, పురుష సంఖ్యలో వ్యత్యాసాన్ని, దానివలన కలిగే దుష్పరిణామాలను తెలుసుకుంటారు.<br>✤ బాలబాలికల పనుల మధ్య వ్యత్యాసం ఉండకూడదని తెలుసుకుంటారు.<br>✤ వికలాంగుల సమస్యలపై అవగాహన కలుగుతుంది. |
| **ఉపాధ్యాయునికి సూచనలు** | : | ◆ విద్యార్థులకు ముందుగానే వ్యాసరచన, వక్తృత్వ పోటీల తేదీలను తెలియచేయాలి.<br>◆ ఆయా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. |
| **చేపట్టే కార్యక్రమాలు** | : | పైన తెలిపిన అంశాలగురించి ఆయా ప్రత్యేక దినాలలో వ్యాసరచనపోటి, వక్తృత్వ పోటీలు నిర్వహించాలి. అనుభవము గలవారిని పిలిపించి ఉపన్యాసాలిప్పించాలి. |

---

## 4. సాంస్కృతిక వైవిధ్యము - వినోదము

**ఉప అంశం : స్థానిక డప్పు, తోలుబొమ్మలు, డోలు, హరికథ మొదలగునవి కళాకారులచే పాఠశాలల్లో ప్రదర్శన ఏర్పాటు.**

**పాఠశాలలో చేపట్టవలసినవి :**

**1. సందేశాత్మక సినిమలు/నాటకాల ప్రదర్శన :**

పాఠశాలలోని విద్యార్థులందరికి వినోదమును, విజ్ఞానాన్ని కల్గించుటకు, సందేశాన్ని తెలియజేయడానికి కొన్ని కార్యక్రమాలు చేపట్టాలి.

- ✤ స్థానిక కళాకారులతో డప్పువాద్యం, డోలుకొట్టడం, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథల వారిచే ఆయా కథలను చెప్పించడం వంటి వాటిని పదిహేనురోజులకొకమారు నిర్వహించడం.
- ✤ **తోలుబొమ్మల ప్రదర్శన ఏర్పాటుచేయడం :** వేలి తొడుగులతో, చేతి తొడుగులతో, ముఖపు తొడుగులతో (తోలుబొమ్మలతో) వినోద విజ్ఞాన కథలను చెప్పించడం.
- ✤ హరికథ, బుర్రకథలు చెప్పేవారిలో ఎంతమంది పాల్గొంటారు. వారి చేతిలో ఉండే సాధనాల గురించి తెలుసుకోవడం, వారు పాడుతూ, వంతలు గొంతులు కలుపుతూ తెల్పే వీరగాథలు, పురాణగాథలను పిల్లలు వినడానికి, చూడడానికి ప్రోత్సహించడం.
- ✤ గ్రామీణ, పట్టణ ప్రాంతాలల్లో ప్రసిద్ధ గాయకులు, జానపద కళాకారులు ఉంటారు. వారిని ఆహ్వానించి ప్రదర్శన ఇప్పించడం.
- ✤ ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేటందుకు బాలకళాకారుల కార్యక్రమాలను నిర్వహించడం.
- ✤ చిత్రలేఖనంలో ప్రావీణ్యం పొందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, అందరి సమక్షంలో ప్రదర్శన జరపడం.
- ✤ నిర్వహించిన కళారూపాల ప్రదర్శన నిర్వహణలను ఆల్బమ్స్‌గాను, పుస్తకరూపంలో ప్రదర్శించడం, ప్రదర్శన శాలలు నిర్వహించడం.

**2. సందేశాత్మక సినిమాలు / నాటకాల ప్రదర్శన**

- ✤ సందేశాత్మక బాలల చిత్రాలను చూపించడం.
- ✤ బాలల చలనచిత్రాలను పాఠశాలల్లోనే ప్రదర్శింపజేయడం.
- ✤ మంచి ఆరోగ్య ఆహార నియమాలకు సంబంధించిన చిత్రాలు బడిలోనే చూపించడం.
- ✤ నీతికథలకు సంబంధించిన Animated చిత్రాలు. చూపించడం
- ✤ కార్టూను చిత్రాలను సందేశాత్మకమై వినోదం కల్గించేవాటిని చూపించడం.
- ✤ నైతిక విలువలతో కూడిన సందేశాన్ని ప్రబోధించే నాటకాలను చూపించడం.
- ✤ నాటికలు, నాటకాలు సామాజిక చైతన్యాన్ని కల్పించేవి, బాలల చదివే హక్కు. బాలకార్మికత నిర్మూలనపై నృత్యరూపకాల ప్రదర్శన.
- ✤ వీరగాథలు, పౌరాణిక గాథలకు సంబంధించిన ఏకపాత్రాభినయాలు, సంభాషణలు, స్వగతాలు చేయించడం.
- ✤ వీథినాటకాల ప్రదర్శనగా అప్పటికప్పుడు సన్నివేశాలను సృష్టించుకొని వేషధారణకు ప్రాముఖ్యత లేకుండానే ప్రదర్శించే వీలు కల్పించడం. స్థానిక కళారూపాలను ప్రదర్శించడం.
- ✤ నాటకాలను ప్రదర్శించేటప్పుడు పాత్రోచిత దుస్తులు, అలంకరణ సామగ్రి వినియోగం మొ॥వి విద్యార్థులే చేసుకునేటట్లు నిపుణుల సహాయంతో ఉపాధ్యాయ పర్యవేక్షణలో రంగులు వేసుకొని, పాత్రోచిత దుస్తులు ధరించడం జరగాలి.

**సూచన:** ఈ ప్రదర్శనలన్నీ కూడా ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మాత్రమే నిర్వహింపబడాలి.

---

**ఉప అంశం : జాతీయ పండుగలు / పాఠశాల వార్షికోత్సవాల సందర్భంలో నిర్వహించే కార్యక్రమాలు**

★ ఆగష్టు 15, జనవరి 26, జాతీయదినోత్సవాలలోను, నవంబర్ 14 బాలలదినోత్సవం, సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవము ఆయా రోజులకు ప్రత్యేక కార్యక్రమాలను పాఠశాలలోని పిల్లలందరిని సమావేశపరచి నిర్వహించాలి. వారం ముందుగానే విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, పాటల పోటీలు, ముగ్గులపోటీలు, చిత్రలేఖనం, ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కార్యక్రమాన్ని నిర్వహించేరోజు అతిథులు, ఆహ్వానితుల సమక్షంలో ఇప్పించడం.

★ పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా కూడ అన్నిరకాల పోటీలు నిర్వహించి – గెలుపొందినవారికి బహుమతులివ్వడం, పాటలు, నృత్యప్రదర్శనలు ఏర్పాటుచేయడం.

- ✤ నాటకాలను వేయించడం
- ✤ వేషధారణలు చేయడం
- ✤ పాత్రోచిత సంభాషణలు, ఏకపాత్రాభినయాలు, బహుపాత్రాభినయాలు చేయించడం.
- ✤ దేశభక్తి, జానపద, భక్తిపాటలను పాడించడం
- ✤ విచిత్ర వేషధారణల ప్రదర్శన

★ తరగతివారీగా బాధ్యతలు అప్పగిస్తూ ఆయా తరగతులలో తరగతి క్రమశిక్షణ, సమయపాలన, యూనిఫామ్‌తో బడికి క్రమంతప్పక వచ్చే విద్యార్థులు, హాజరు 100 శాతం గల విద్యార్థులను, ఎంపిక చేసి బహుమతులను ఇప్పించడం.

★ జాతీయదినోత్సవాలలో వార్షికోత్సవాల సందర్భంగా పాఠశాలను అలంకరించడం.

- ప్రతి విద్యార్థి అలంకరణలో భాగస్వామ్యం కావడం, బూజు, దుమ్ము ధూళి లేకుండాచూడడం.
- స్వాగత బ్యానర్లు, తోరణాలు కట్టడం.
- నీళ్ళతో తరగతిగదులను కడుక్కోవడం, రంగురంగుల ముగ్గులతో అలంకరించడం.
- మామిడాకుల తోరణాలు, రంగుకాగితాలతో దండలు, డిజైన్లతో అలంకరణ.
- గోడలను సహజమైన ఆకులు, పూలతో అలంకరణ, పుష్పగుచ్ఛాలమాదిరిగా చేయడం.
- పాఠశాల ఆవరణ నేలప్రాంతాన్ని నీళ్ళు ముందుగా జల్లి తర్వాత ఊడ్వడం.
- మామిడాకులతోను, కొమ్మలతో, రెమ్మలతోను, కర్రలు పాతి పూలదండలతో కర్రలను చుట్టి వేదికను అలంకరించడం.
- వేదిక వెనుకభాగాన అందమైన డిజైన్లు ఏర్పాటుచేసిన తెరలను వ్రేలాడదీయడం.
- వేదిక ముందుభాగాన తెరలను కుడి, ఎడమ భాగాలకు రెండుగా ఏర్పాటుచేయడం.
- రంగుకాగితాల దండలు, సహజమైన పూలదండలు, చెమ్కీలనుపయోగించి దండలుగా చేసుకోవడం.
- పెద్దలను ఆహ్వానించేటప్పుడు పూలగుత్తులనివ్వడం.

**సూచన :** ఏ వార్షికోత్సవమైన, జాతీయ వేడుకల సందర్భంలోనైనా ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో నిపుణుల సహకారంతో నిర్వహించాలి.

---

## 5. సామాజిక అంశాలపై అవగాహన - స్పందన

**పాఠశాల చేపట్టవలసిన కార్యక్రమాలు :**

- ✦ బాల్యవివాహాలు, బాలల హక్కులు మరియు మహిళలపై అత్యాచారాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు.
- ✦ వీటికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపట్ల అవగాహన కలిగించడం.

**ఫలితాంశాలు :**

- బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలు, బాలల హక్కులు, వీటికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల గురించి తెలుసుకుంటారు.
- బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలను ఖండిస్తారు.
- బాలల హక్కులను తెలుసుకొని, వినియోగిస్తారు.
- సంబంధిత ప్రభుత్వ పథకాలను తెలుసుకోవడంలో ఆసక్తి కనబరుస్తారు.
- స్త్రీ సాధికారతపై విశాలభావాన్ని కలిగివుంటారు.

**ఉపాధ్యాయునికి సూచనలు:**

- ◆ ప్రతి తరగతినుండి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించేలా చూడడం.
- ◆ చర్చ, అవగాహనా కార్యక్రమాలు జరపడానికి తేదీలను నిర్ణయించడం.
- ◆ చర్చ, అవగాహన కార్యక్రమాలలో పాల్గొనే విద్యార్థులను జట్లుగా చేయడం – వారి పేర్లు నమోదుచేసుకోవడం.
- ◆ బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలు బాలల హక్కులపై చర్చ, అవగాహన కార్యక్రమాల పూర్తి ప్రణాళికను సిద్ధంచేయడం.
- ◆ చర్చ, అవగాహన కార్యక్రమం నిర్వహించడంలో మెళకువలు నేర్పించడం.

విధానం :
- ✤ ప్రణాళిక ప్రకారం, బాల్యవివాహాలపై పాఠశాలలో చర్చ నిర్వహించడం.
- ✤ మహిళలపై జరిగే అత్యాచారాలను, కేస్‌స్టడీలతో / వార్తాపత్రికలలో వచ్చిన నిజసంఘటనలతో చర్చించడం.
- ✤ బాలల హక్కులు – వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- ✤ ప్రభుత్వ కార్యక్రమాలు – పథకాలు – వాటి ఉపయోగాలు తెలియజేస్తూ చర్చించడం.

---

## 6. సమాచారము - డాక్యుమెంటేషన్

**ఉప అంశము :** పాఠశాల కార్యక్రమాలపై డాక్యుమెంటేషన్

**1. నోటీసుబోర్డు నిర్వహణ**
- ✤ విద్యార్థులు గీసిన చిత్రాలు
- ✤ రాత అంశాలు
- ✤ సేకరణలు
- ✤ SMC సమావేశముల తేదీలు
- ✤ పాఠశాల సెలవుదినములు
- ✤ ప్రత్యేక అంశములు

మొ॥ అంశాలన్నీ నోటీసుబోర్డులో ఉంచాలి. తర్వాత వాటిని తీసి భద్రపరచాలి.

**2. గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ**
- ◆ తరగతివారీగా, అంశాలవారీగా వేరుచేసి ప్రదర్శించాలి.
- ◆ Stock & Issue Register నిర్వహించాలి.

**3.**
- ❖ తాము చదివిన అంశాలు / కథలు / వ్యక్తుల గురించి తమ స్వంత మాటల్లో చెప్పించాలి, నోటుపుస్తకంలో రాయించాలి.
- ❖ క్రొత్త పుస్తకాలు collect చేసి Library Stock Register లో నమోదుచేయాలి.

**4. సామాజిక కార్యక్రమాలపై (పెళ్ళి, పండుగ, ఉత్సవం మొ॥) నివేదిక**
- ✦ ఈ కార్యక్రమాల నిర్వహణ, కట్టుబాట్లు, ఆచారాలు, పద్ధతులు, వేషధారణ మొ॥ అన్ని అంశాలపైన నివేదిక రాయాలి. ఆ అంశాలపై తరగతిగదిలో చర్చించాలి. ఫోటోలు/కార్డులు సేకరించాలి. ఆల్బమ్ తయారుచేసి ప్రదర్శించాలి.
- ✦ సంస్కృతి–సంప్రదాయాలు, పద్ధతులు మరిచిపోకుండా తర్వాత తరానికి కొనసాగుటకు ఉపయోగపడుతుంది.

**5. పాఠశాల/స్థానిక సమస్యలపై పత్రికలకు ఉత్తరాలు రాయడం**
- ✤ పాఠశాల/స్థానికంగా ఉన్న సమస్యలపైన పత్రికలకు ఫోటోగ్రాఫ్‌లతోసహా వ్యాసాలు రాయడం.
- ✤ పై అధికారులకు ఉత్తరాలు/నివేదికలద్వారా విన్నవించడం.
- ✤ R.T.I. ద్వారా సమాచారాన్ని సేకరించి, నష్టాలు/సమస్యలపై పోరాడటం.
- ✤ విద్యార్థుల్లో సమస్యలపట్ల స్పందించే గుణం అలవడుతుంది.
- ✤ సమస్యలకు పరిష్కారమార్గాలు కనుగొంటారు.

6. **పాఠశాల సంచిక తయారీ :** పాఠశాల సంచికలో పాఠశాలలో జరిగే అన్నిరకాల కార్యక్రమాలు, అభివృద్ధి, పిల్లల వినూత్న ఆలోచనలు మొ॥ అన్ని అంశాలు SMC/గ్రామస్థుల భాగస్వామ్యం మొ॥నవి ఉండేలా సంచికను రూపొందించి ప్రదర్శించాలి, మండల/జిల్లా స్థాయికి పంపాలి.
7. **వార్తాపత్రికలలోని అంశాలు, ఆర్టికల్స్ ప్రదర్శన :** వార్తాపత్రికలలో వచ్చే విజ్ఞాన, వినోద, ఆటలు, సినిమా, వింతలు, విశేషాలు, సమస్యలు మొ॥ అన్ని అంశాల పేపర్ కటింగ్స్‌ను గోడపత్రికలో ప్రదర్శించాలి. డాక్యుమెంటేషన్ కమిటీ వాటిని ఎప్పటికప్పుడు భద్రపరచాలి.
8. **మాక్ అసెంబ్లీ :** పాఠశాలలోని అన్ని కమిటీల సభ్యులతో మాక్‌అసెంబ్లీ నిర్వహించాలి. టీచర్ స్పీకర్‌గా వ్యవహరించాలి. తమ ప్రగతిని, సమస్యలను చర్చించాలి, పరిష్కరించాలి.

---

## 7. వస్తువులు, నమూనాల తయారీ

**పాఠశాలలో నిర్వహించు కార్యక్రమాలు :** వివిధ ముడిపదార్థాలనుండి వాడిన వస్తువులనుండి రకరకాల అలంకృత వస్తువులు తయారుచేయుట.

**ఫలితాంశం :**

- ✤ విరామ సమయాన్ని వినియోగించుకుంటారు.
- ✤ సృజనాత్మకత వృద్ధిచెందుతుంది.
- ✤ వ్యర్థపదార్థాలను వినియోగించుకుంటారు.
- ✤ ఉత్పాదక విలువలు పెంపొందుతాయి.
- ✤ శ్రమను గౌరవిస్తారు.
- ✤ శ్రమ విలువను గుర్తిస్తారు.
- ✤ అలంకరణపై అవగాహన పెరుగుతుంది.
- ✤ విద్యార్థులు తామే స్వయంగా వస్తువులను తయారుచేస్తారు కాబట్టి క్రొత్తవాటిని సృష్టించామనే ఆత్మానందం కలుగుతుంది.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

- ◆ పాఠశాల విద్యార్థులను వివిధ జట్లుగా విభజించాలి.
- ◆ ఏయే వస్తువులను ఏరకంగా వినియోగించవచ్చో విద్యార్థులకు అవగాహన కల్పించాలి.
- ◆ అవసరమైనచోట విద్యార్థులకు ఉపాధ్యాయులు చేసి చూపించాలి.
- ◆ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు వివిధ వస్తువుల తయారీలో తర్ఫీదు ఇవ్వాలి. పిల్లలు చేసిన వస్తువులను ప్రదర్శించాలి.

# 8. గృహ యాజమాన్యం

## పాఠశాలలో మరియు ఇంటివద్ద పిల్లలు చేయవలసిన పనులు

**పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు**

- ప్రతిరోజు తమ ఇంట్లోని వస్తువులను శుభ్రం చేయడం.
- పాఠశాలలో నిరుపయోగమైన వస్తువులను ఎస్.ఎం.సి. లో చర్చించి తొలగించడం (కనీసం నెలకొకసారి)
- నెలకొకసారి పాఠశాలను శుభ్రం చేయడం (తరగతివారీగా కేటాయింపు)

**విద్యార్థులు ఇంట్లో చేయవలసిన పనులు**

- ప్రతిరోజు వాడే వంటసామాన్లు, గిన్నెలు మొ॥ వాడిన వెంటనే కడిగి శుభ్రం చేసుకోవాలి.
- తమ యూనిఫామ్‌ను రోజువిడిచిరోజు ఉతికి, ఇస్త్రీచేసుకోవాలి. (కనీసం రెండుజతలు ఉండాలి)
- ఇంట్లోని గోడలకు పట్టిన బూజు తొలగించుకోవాలి. పురుగులు, క్రిమికీటకాదులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బజారులో దొరికే దోమలమందులను ఉపయోగించాలి.
- వెలుతురు, గాలి అందేటట్లు కిటికీ తలుపులు తెరచిపెట్టాలి.
- వారానికొకసారైనా నీళ్ళతో ఇల్లు కడుక్కోవాలి. మట్టిఇల్లు అయితే పేడతో అలకాలి. ముగ్గులుపెట్టాలి.
- అందమైన ముగ్గులు పెట్టుకోవాలి. గుమ్మాలు కడిగి పసుపు, కుంకుమలతో అలంకరించాలి.
- అవసరమైన సమయాలలో వేడుకలలో సున్నాలు, రంగులు వేయించుకోవాలి.
- ప్రతిరోజు ఇంటిముందు వాకిలి శుభ్రంచేసుకోవాలి.
- స్నానాలగది, మరుగుదొడ్లను శుభ్రపరచుకోవాలి.
- దుర్వాసన రాకుండా సుగంధపూరిత పదార్థాలను వెలిగించాలి.
- ఇంటికయ్యే చిన్న మరమ్మత్తులను పూర్తిచేసుకోవాలి.

**నెలకొకసారైనా పాఠశాలను శుభ్రంచేయడం తరగతివారీగా కేటాయింపు**

పాఠశాల ఆవరణను శుభ్రంచేయడం పరిశుభ్రతాకమిటి ఆధ్వర్యంలో తరగతివారీగా విద్యార్థులను కేటాయించి వారానికి ఒక తరగతి చొప్పున బాధ్యతను చేపట్టి విద్యార్థులు జట్లుగా విడిపోయి పనులను పంచుకోవాలి.

- పాఠశాల ఆవరణలోని చెట్ల కొమ్మలలో ఎండినవాటిని తొలగించడం.
- ఆకులు, రెమ్మలు పడిపోయిన, రాలిన పూలు మొ॥ వాటిని శుభ్రంచేసి, వృక్షసంబంధిత చెత్తను ఒక గోతిలో వేసే ఏర్పాటు చేయడం.
- పూలమొక్కలు, అలంకరణ మొక్కలను పాఠశాల గేటునుంచి ప్రహరివెంబడి రెండువైపులా అమర్చుకోవడం మరియు ప్రతిరోజు మొక్కలకు నీళ్ళుపోయడం.
- మట్టి బాగాఉంటే ఆ ప్రదేశంలో చిన్నచిన్న మళ్ళుచేసి కూరగాయమొక్కలను, ఆకుకూరలను పెంచడం.
- మధ్యాహ్న భోజన సమయంలో, వంటచేసేటప్పుడు వంటపాత్రలు కడిగేటప్పుడు, నీళ్ళు తాగేటప్పుడు వాడిన నీరు కాలువరూపంలో పారించి ఆయా మడులలోగల మొక్కలకు అందేటట్లు చూడడం.
- ప్రహరీ లేకపోతే ముళ్ళకంచెల ఏర్పాటు చేసుకోవడం.
- ఆటలాడే మైదానం శుభ్రంగా ఉండేటట్లు, రాళ్ళురప్పలు లేకుండా చూడడం

  మొ॥ పనులు పిల్లలు, ఉపాధ్యాయుల సహకారంతో చేయడం. పాఠశాలలో నిరుపయోగమైన వస్తువులను, పాడైపోయిన సామాగ్రిని పాఠశాల యాజమాన్య కమిటీతో చర్చించి, తొలగింపుచర్యలు చేపట్టడం. అమ్మిన వాటిద్వారా వచ్చిన సొమ్మును పాఠశాల నిర్వహణకు వినియోగించడం

# 9. వినియోగదారుల విజ్ఞానము

**1. వినియోగదారుల హక్కులు**

- కొన్న వస్తువు ఖరీదుకు సరిపడా నాణ్యత, మన్నిక పొందే హక్కు.
- తగిన బరువు, రుచి, రంగు మొ॥నవి పొందే హక్కు.
- ఖరీదుకు సరిపడా నాణ్యత లేకున్నా (లేక) నాసిరకము సరఫరా చేసినా "వినియోగదారుల ఫోరం"ను ఆశ్రయించి తగిన న్యాయం పొందే హక్కు.
- ఈ అంశాలన్నింటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి.
- తద్వారా వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలి.

**2. కొనుగోలులో జరిగే మోసాలు, కల్తీల పై చర్చ / అవగాహన**

- కల్తీలు ఎన్నిరకాలుగా జరుగుతున్నాయో ప్రసారమాధ్యమాలు, పత్రికల ద్వారా సేకరించి, ప్రదర్శించి, చర్చించాలి.
- ముఖ్యంగా ప్యాకింగ్ చేసిన వస్తువు బ్రాండెడ్ ఐటంలాగానే ఉండి కొంత తేడా ఉన్న వాటిని గుర్తించడము.
- లూజ్‌గా అమ్మే సరుకుల్లో కల్తీచేయడం, ఉండవలసిన బరువుకంటే తక్కువ బరువు, తక్కువ పోషకవిలువలు, తక్కువ సంఖ్యలో ఉండటం.
- తక్కువ ధరకు Branded items లాగా ఉండే నకిలీలు అమ్మడం.
- ISI, AGMARK వినియోగదారుల ఫోరంల గురించి అవగాహన కల్పించడము.
- Expiry date ఐన వాటిని వినియోగదారులకు అమ్మడం.
- క్రొత్తవాటితో పాతవాటిని కలిపి అమ్మడం.
- జంతువుల క్రొవ్వులతో నూనెలు తయారుచేసి కల్తీచేయడం.
- కొలతలు, తూకాల్లో మోసాలు.
- దొంతరలుగా ఉన్న సంచులలో మంచి నాణ్యత ఉన్నవి చూపించి వాటితోపాటు తక్కువ నాణ్యత గలవి వినియోగదారునికి అంటగట్టడం.
- ఒకటి కొంటే ఇంకొకటి ఉచితం ప్రకటనలు.
- ఫలానా సినిమా హీరో/హీరోయిన్ వాడారు మీరు వాడండి. అనే ప్రకటనలు
- ఆషాఢం 50% ఆఫర్ ప్రకటనలు.
- మీ ఫోన్‌కు లక్షరూపాయలు బహుమతి వచ్చింది, 1000/- లు క్రింది నంబరు A/c కు పంపండి. ఇలాంటి ప్రకటనలతో మోసం చేయడం.
- పై అంశాలపై వినియోగదారుడు జాగరూకులై ఉండాలి. మోసానికి గురైతే వినియోగదారుల ఫోరంలో పిర్యాదుచేయడం. సాధ్యమైనంత వరకు మోసాలు గమనించి వాటికి దూరంగా ఉండాలి.

# 10. పర్యావరణము

**పాఠశాల చేపట్టవలసిన కార్యక్రమాలు :**

- ✦ బడి తోట పెంపకము, నిర్వహణ, చెట్లు నాటే కార్యక్రమము
- ✦ పర్యావరణ దినోత్సవాలు జరుపుకోవడం
- ✦ కంపోస్టు గుంత తయారీ, నిర్వహణ
- ✦ పర్యావరణ పరిరక్షణపై విషయసంచిక తయారీ

**ఫలితాంశాలు :**

- ✤ మొక్కలను పెంచే విధానాన్ని తెలుసుకుంటారు.
- ✤ కంపోస్టు గుంత తయారుచేస్తారు మరియు వీటి నిర్వహణకు బాధ్యత వహిస్తారు.
- ✤ పర్యావరణం పట్ల స్నేహపూరిత వైఖరిని పెంపొందించుకుంటారు.
- ✤ విషయ సంచికను రాయగలరు.
- ✤ మొక్కలునాటడంలో, పర్యావరణ దినోత్సవాలు జరుపుకోవడంలో ఆసక్తిని కనబరుస్తారు.

**ఉపాధ్యాయులకు సూచనలు :**

- ✤ అన్ని తరగతులలోని విద్యార్థులు పాఠశాల కార్యక్రమాలలో పాల్గొనేలా చూడడం.
- ✤ విద్యార్థులను ఆరు జట్లుగా చేయడం.
- ✤ ప్రతి జట్టులో ఒక లీడరు, ఒక ఉపాధ్యాయుడు, కొంతమంది విద్యార్థులు ఉండాలి.
- ✤ కార్యక్రమాలకు కావలసిన సామాగ్రిని సమకూర్చుకోవడం.
- ✤ కార్యక్రమాలను అమలుపరిచే తేదీలను నిర్ణయించుకోవాలి.
- ✤ కార్యక్రమాల ప్రణాళికను సిద్ధంచేసుకోవడం. ప్రతి జట్టుకు ఒక కార్యక్రమాన్ని కేటాయించడం.

| | |
|---|---|
| జట్టు 1 | బడి తోట – స్థలం తయారీ |
| జట్టు 2 | చెట్లు నాటడం |
| జట్టు 3 | కంపోస్టు గుంత తయారీ |
| జట్టు 4 | కంపోస్టు గుంత నిర్వహణ |
| జట్టు 5 | పర్యావరణ దినోత్సవము జరుపుట |
| జట్టు 6 | పర్యావరణ పరిరక్షణ – విషయసంచిక తయారీ |

**విధానం :**

- ✦ పర్యావరణమునకు సంబంధించిన 'రోజుల జాబితా' రాయడం.
- ✦ ప్రణాళిక ప్రకారం, జట్లవారికి కేటాయించిన కార్యక్రమాలను నిర్వహించడం.
- ✦ మొక్కలు నాటడంలో ముఖ్యమైన మెళకువలను పాటించడం.
- ✦ మధ్యాహ్న భోజనము తరువాత పళ్ళాలలో మిగిలిన ఆహారపదార్థాలను కంపోస్టు గుంతలో వేసి ఎరువు తయారీకి వాడడం.
- ✦ పర్యావరణ దినోత్సవాలను జరుపుట.
- ✦ పర్యావరణ పరిరక్షణపై సంచికను తయారుచేయడం.